లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

జూన్ 2021

రూ.10/-





## ప్రధానీ!
## పటిష్ఠ ఆరోగ్య విధానం తీసుకురండి

## తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ..
## ముందుగానే చొరవ చూపండి







## ప్రజారోగ్యం-కరోనా:
## నిర్లక్ష్యమే కొంప ముంచింది




## యువ భారత్‌కీ మార్గం చూపే ప్రజా జీవితం

# సంజీవయ్య మార్గంలో యువత సమసమాజం కోసం కృషి చేయాలి



నేటి యువత దామోదరం సంజీవయ్యను ఆదర్శంగా తీసుకుని సమసమాజం కోసం కృషి చేయాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య శతజయంతి వేడుక ద్రావిడదేశం ఆధ్వర్యంలో అంతర్జాలంలో జరిగింది. కార్యక్రమాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి మాజీ చైర్మన్ చక్రపాణి ప్రారంభించారు. జేపీతోపాటు మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, ద్రావిడదేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, విశ్రాంత ఐఏఎస్ పి. కృష్ణయ్య ప్రసంగించారు. సీనియర్ పాత్రికేయుడు సూర్యప్రకాష్‌రావు స్వాగతోపన్యాసం చేయగా, మన్నవ గంగాధర ప్రసాద్, ఝాన్సీ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. శ్రీదేవి వందన సమర్పణ చేశారు.

22 ఏళ్ల ప్రజాజీవితం గడిపిన సంజీవయ్య కుటుంబంలో ప్రస్తుతం ఎవరికీ ఎటువంటి పదవులు లేవని జేపీ అన్నారు. అప్పట్లో రాష్ట్రపతితో సమానమైన ఏఐసీసీ ప్రెసిడెంట్‌గా, రెండు పర్యాయాలు కేంద్ర మంత్రిగా, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా, ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా.. ఇలా ఎన్నో పదవులను ఆయన చేపట్టారన్నారు. ఏ పదవిలో ఉన్నా నిజాయతీని కాపాడుకోవటంతోపాటు పరిపాలనలో అనేక సంస్కరణల్ని తీసుకొచ్చారన్నారు. దామోదరం సంజీవయ్య లాంటి వారిని గౌరవించుకోవటం వల్ల వ్యక్తిగతంగా వారికొచ్చే లాభమేమీ ఉండదని, కానీ సమాజానికి మేలు జరుగుతుందని జేపీ అన్నారు.



**సురాజ్య యాత్ర సందర్భంగా కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలోని దళితవాడలో ఉన్న దామోదరం సంజీవయ్య ఇంటిని సందర్శించిన జేపీ**

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


| సంపుటి | సంచిక | సంపాదకవర్గం | వర్కింగ్ ఎడిటర్ |
|---|---|---|---|
| 24 | 06 | బండారు రామ్మోహనరావు | దూసనపూడి |
| జూన్ 2021 | | శిరమణి నరేష్ | సోమసుందర్ |


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




నగరంలో వర్షాకాలాన్ని ఎదుర్కోవటానికి అంతా సిద్ధం సార్. ఇళ్లల్లో చేరిన నీరు చేది పోసుకోటానికి బొక్కెనలూ, బకెట్లూ ఇస్తున్నాం. కొట్టుకుపోయిన వారికోసం గజ ఈతగాళ్లను తెచ్చాం.


కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,
సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

సంపాదకీయం

# వైద్య ఆరోగ్య సేవలను పటిష్టం చేయాలి

కరోనా రెండో వేవ్ ఉధృతి తగ్గుముఖం పడుతుందన్న ఊరట దక్కకుండానే మూడో వేవ్ ముప్పు ముంచుకొస్తోంది. గత మూడు నెలలుగా కరోనా రెండోవేవ్ కరాళ నృత్యం చేసింది. వేలాదిమంది ప్రజలు మహమ్మారి బారిన పడి కన్నుమూసారు. ఆస్పత్రుల్లో పడకలు దొరక్క కొందరు, ఆక్సిజన్ అందక మరికొందరు అశువులు బాసారు. సకాలంలో అంబులెన్సులు రాక, మందులు దొరక్క, డాక్టర్లు, వైద్య సిబ్బంది లేక దేశం మొత్తం నరకయాతన అనుభవించింది. మొదటి వేవ్ చూసిన తర్వాత కూడా పాలకులుగానీ, పాలనా యంత్రాంగంకానీ తగిన విధంగా సన్నద్ధంగా లేకపోవడంతో మన దేశం మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

మొదటి వేవ్ తర్వాత మన అవగాహన, పరిజ్ఞానం పెరిగింది. బోలెడు అనుభవం కూడా సంపాదించాం. అయినా పాలకులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. కరోనాని జయించి భారతదేశం విశ్వగురువుగా ఆవిర్భవించినట్లు ప్రపంచ వేదికలపై ఆర్భాటంగా ప్రకటించిన నేతలు రెండో వేవ్‌ని తేలిగ్గా తీసుకున్నారు. గత సంవత్సరం చేసిన ఏర్పాట్లను నీరుగార్చారు. నిర్ధారణ పరీక్షలను నిలిపివేశారు. ఐసోలేషన్ కేంద్రాలనూ, కోవిడ్ ఆస్పత్రులను మూసివేశారు. తాత్కాలికంగా తీసుకున్న సిబ్బందిని తొలగించారు. నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ ఈ సన్నద్ధతనూ, అప్రమత్తతనూ పక్కన పెట్టి విచ్చలవిడి, విశృంఖల కార్యకలాపాలకు గేట్లు తెరిచారు. ఎన్నికలు, రాజకీయ సభలు, కుంభమేళా వంటి ఆర్భాటాలతో కోవిడ్ నియమాలను యధేచ్ఛగా ఉల్లంఘించారు. పర్యవసానం ఇప్పుడు చూస్తున్నాం!

దేశంలో మొత్తం కేసుల సంఖ్య 2.9 కోట్లకు చేరుకోగా మరణాలు మూడున్నర లక్షల వరకూ సంభవించాయి. సుమారు 15లక్షల యాక్టివ్ కేసులతో మనం ఇంకా కరోనాతో పోరాడుతూనే ఉన్నాం. కరోనా వ్యాక్సిన్ రావడంతో పరిస్థితి మెరుగు అయ్యే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటికే దాదాపు 23కోట్ల మందికి టీకాలు వేయడం ఆశాజనకమైన పరిణామం. స్వదేశీ టీకాలతో పాటు ఇతర దేశాల టీకాలను కూడా అనుమతించి, సాధ్యమైనంత త్వరితగతిన ప్రజలందరికీ టీకా వేయడంపై ప్రభుత్వం దృష్టి సారించడం హర్షణీయమే!

అయితే మూడో వేవ్ కూడా వస్తున్నదన్న నిపుణుల హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ప్రాధాన్యతల దిశ మారకుండా కోవిడ్‌పై పోరాటం కొనసాగించాల్సి ఉంది. భారతీయ వైద్య, ఆరోగ్య వ్యవస్థకు కరోనా లాంటి ఒక సంక్షోభాన్ని ఎదుర్కొనే సామర్థ్యంగానీ, సన్నద్ధతగానీ లేదన్న వాస్తవాల్ని ముందుగా గుర్తించాలి. మన వైద్య, ఆరోగ్య సంరక్షణా రంగానికి సంబంధించిన వాస్తవిక సమాచారంగానీ, గణాంకాలుగానీ ప్రభుత్వం దగ్గర లేవు. కోవిడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం విడుదల చేసే గణాంకాలు కేవలం ప్రభుత్వం సేకరించిన అరకొర సమాచారమే తప్ప వాటికి ప్రామాణికత ఎంత మాత్రమూ లేదు.

ఆస్పత్రులు ప్రధానంగా నగరాల్లో, పట్టణాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. 65శాతం జనాభా నివశిస్తున్న గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్య సేవలు నామమాత్రంగానే ఉన్నాయి. దేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 25743, సబ్ సెంటర్లు 1,58,417, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు 5,624 ఉన్నాయి. మొత్తం అన్ని రకాల ప్రభుత్వ ఆస్పత్రులలో ఉన్న పడకల సంఖ్య 7 లక్షలు మాత్రమే!. లక్ష మంది జనాభాకు 32 పడకలు జాతీయ సగటు కాగా, జార్ఖండ్, అసోం, హర్యానా, బీహార్, గుజరాత్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్ వంటి రాష్ట్రాల్లో సగటు పడకలు లక్షకు 20 కంటే తక్కువ ఉన్నాయి.  బీహారులో లక్ష జనాభాకు 6 పడకలే అందుబాటులో ఉన్నాయి. కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల స్థాయిలో నిపుణుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. అటువంటి కేంద్రాల్లో ప్రసూతి నిపుణులు 25.3శాతం మాత్రమే అందుబాటులో ఉన్నారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు 17.3శాతం, ఫిజిషియన్లు 14.3శాతం మాత్రమే ఉన్నారు.

ప్రస్తుత మౌలిక సదుపాయాల దుస్థితిలో రోజువారీ వైద్య ఆరోగ్య సేవలు అందించలేక ఆస్పత్రులు చేతులెత్తేస్తున్నాయి. కరోనా లాంటి సంక్షోభం ఎదురైతే మొత్తం వ్యవస్థ చతికిల పడుతుందన్న సంగతి గత ఏడాది కాలంగా తెలుస్తూనే ఉంది. భవిష్యత్తులో ఇటువంటి మరో సంక్షోభం వచ్చినా తట్టుకునే విధంగా మౌలిక సదుపాయాలను పటిష్టం చేయాలి. సుశిక్షితులైన వైద్య నిపుణులను , వైద్యులను నర్సులను సాంకేతిక సహాయకులను పెద్ద ఎత్తున నియమించుకోవాలి. అత్యవసర మందుల సరఫరాను పెంచాలి.

ప్రపంచంలోనే ఆరవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్పుకునే మనం వైద్యం కోసం చేస్తున్న ఖర్చులో ఆఖరి వరసలో ఉన్నాం. గత రెండు దశాబ్దాలలో వైద్య, ఆరోగ్య సేవలకు ప్రభుత్వం వెచ్చిస్తున్న తలసరి వ్యయం 2500 రూపాయల నుంచి 2800 రూపాయల మధ్యలో ఉంది. జీడీపీలో చైనా 5.5శాతం, బ్రెజిల్ 9.5శాతం, బ్రిటన్ 10శాతం ఖర్చు చేస్తుంటే.. భారత్ గత పుష్కర కాలంలో 1.4శాతం మాత్రమే వ్యయం చేసింది. దాన్ని కనీసం 3శాతానికి పెంచితే ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయి వైద్య, ఆరోగ్య సేవలను పటిష్టం చేయగలుగుతాం! ఆయుష్మాన్ భారత్, ఇంద్రధనుస్, పోషణ్ అభియాన్ వంటి ఆర్భాటపు ప్రకటను చేస్తున్న ప్రభుత్వం వాటికి తగిన నిధుల్ని ఇవ్వడం లేదు. దేశీయ సంప్రదాయక వైద్య విధానాల గురించి గంభీరోపన్యాసాలు చేస్తున్న ప్రభుత్వం ' ఆయుష్' బడ్జెట్‌కు కేవలం 2970కోట్లు కేటాయించింది.

మన దేశంలో మధ్య తరగతి, సంపన్నుల ఆదాయం పెరుగుదల, జీవన శైలి, ఆరోగ్య సమస్యలు, బీమా సదుపాయాల విస్తరణ, టెలీ మెడిసిన్ సేవల ప్రారంభం ప్రజల్లో పెరుగుతున్న ఆరోగ్య చైతన్యం రీత్యా భారత్‌ను ఆరోగ్య రంగంలో ఒక సూర్యోదయ మార్కెట్‌గా సంపన్న దేశాలు భావిస్తున్నాయి. ప్రైవేటు రంగంలో అంతర్జాతీయస్థాయి వైద్య, ఆరోగ్య సేవలు విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కానీ 70శాతం పైగా జనాభాకి వైద్య, ఆరోగ్య సేవలు అందించే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వ్యవస్థలను బలోపేతం చేయకపోతే పర్యవసానం మరిన్ని ఆరోగ్య సంక్షోభాలకు దారి తీయవచ్చు. కరోనా ప్రమాదం తెచ్చిన సంక్షోభాన్ని ఒక అవకాశంగా మార్చుకుని వైద్య, ఆరోగ్య వ్యవస్థలను పటిష్టం చేయడంపై పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

డి. సోమ సుందర్



# ప్రధానీ! ప్రజారోగ్యానికి పటిష్ఠ విధానం తీసుకురండి

2021 ఆరంభంలో ఐదు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగినా.. ప్రధాని సహా అందరి దృష్టీ పశ్చిమ బెంగాల్‌పైనే ఉంది. కానీ కొవిడ్ కల్లోలంతో ఫలితాలపై మాత్రం జరగాల్సిన చర్చ జరగలేదు. ఇప్పుడు పార్టీపరమైన అంతర్గత సమీక్షలు మాత్రమే జరుగుతున్నాయి. కానీ పార్టీలకతీతమైన, ఈ దేశ ప్రజాస్వామ్యంలో దీర్ఘకాల మార్పులకు దారితీయగల కొన్ని అంశాలు బెంగాల్ ఎన్నికల్లో కనిపిస్తున్నాయి.

బెంగాల్‌లోనే కాకుండా యావద్దేశంలోనూ అమెరికన్ శైలి రాజకీయ నిర్వహణకు ఈ ఎన్నికలు నాంది పలికాయని ఒక ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు అన్న మాటలు అతిశయోక్తులు కావు. ఈ ఎన్నికలు తృణమూల్ కాంగ్రెస్, బీజేపీల మధ్య ప్రత్యక్ష యుద్ధంలా, ఇంకా చెప్పాలంటే మమతా బెనర్జీ, నరేంద్ర మోదీల మధ్య ప్రత్యక్ష యుద్ధంలా జరిగాయి. బెంగాల్‌లో ఘనవిజయం సాధిస్తే భావజాలపరంగా, సాంస్కృతికంగా యావత్ భారతదేశాన్ని కూడా అధీనంలోకి తెచ్చుకునే అవకాశం బీజేపీకి పెరుగుతుందటనటంలో సందేహం లేదు. అందుకే ఇంతకంటే బీజేపీ చేయాల్సింది ఏమీ లేదు అనే రకంగా సర్వశక్తుల్నీ, సర్వశక్తిమంతుడైన ప్రధానినీ ఒడ్డి ఆ పార్టీ పోరాటం సాగించింది. తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఓటర్లకు డబ్బు పంపిణీ జరిగినట్లు పెద్దగా వార్తలు రాలేదుగానీ.. బెంగాల్‌లోనే కాకుండా యావత్ దేశంలో కూడా  నభూతో అనే రీతిలో నాయకుల కొనుగోలు, ప్రచారం, మీడియా మేనేజ్‌మెంట్ వంటి వాటికి డబ్బు వెదజల్లినట్లు సమాచారం. మత రాజకీయాలతోపాటు మొదటిసారిగా ఆ రాష్ట్రంలో కుల అస్తిత్వ రాజకీయాలను పెద్దస్థాయిలో ప్రయోగించటం జరిగింది. ఆధిపత్య కులాల దిగువన ఉన్న ఉపశ్రేణులను ఆకట్టుకునే ప్రయత్నం జరిగింది. సబాల్టరన్  ఆధిపత్య భావనను ఈసారి బెంగాల్ అస్తిత్వమే అధిగమించి తృణమూల్ కాంగ్రెస్‌కు ఘనవిజయాన్ని అందించినా, 2021 అసెంబ్లీ ఎన్నికలతో బెంగాల్ రాజకీయాల్లో

ఒక మౌలిక మార్పు మొదలైందనుకోవచ్చు. 2021 అసెంబ్లీ ఎన్నికలు బెంగాల్ ప్రత్యేకతకు చరమగీతం పాడాయి. దేశ ఫెడరల్ వ్యవస్థ పరిణామక్రమంలో కూడా మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

బెంగాల్‌లో బీజేపీకి పరాభవం ఎదురైనా పెద్ద మార్పులకు ఈ ఎన్నికలు దారితీయనున్నాయా అనిపించవచ్చు. అమిత్‌షా సహా బీజేపీ అగ్రనేతల ఆర్భాటపు ప్రకటనల వల్ల ఏర్పడిన హైప్‌ని ఆ పార్టీ అందుకోలేకపోవటం వల్ల ఫలితాలు బీజేపీకి పరాజయంలా అనిపించవచ్చుగానీ, బీజేపీ బెంగాల్‌లో వేళ్లూనుకుందని ఈ ఎన్నికలు స్పష్టంగా రుజువు చేశాయి. అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు ప్రజలు వేర్వేరు ప్రాథమ్యాలతో ఓటు వేసే ధోరణి కొనసాగటం, బీజేపీ మితిమీరిన వ్యవహారశైలి ఓటర్లకు కొంత వెగటు కలిగించటం, సంస్థాగత బలం లేకపోవటం, స్థానిక సెంటిమెంట్ వంటి కారణాల వల్ల బీజేపీ 2019 లోక్‌సభ ఎన్నికలలో వచ్చిన ఫలితాల స్థాయిలో 120+ అసెంబ్లీ సీట్లను సంపాదించలేకపోయినా, ఆ పునాది మీద నుంచి 200 సీట్లకు ఎగరలేకపోయినా 2016 నాటి అసెంబ్లీ ఎన్నికల కన్నా అనేకరెట్లు ఎక్కువ ఫలితాల్ని సాధించింది. 2016 ఎన్నికల్లో 10.2 శాతం ఓట్లతో బెంగాల్‌లో కేవలం 3 సీట్లు గెలుచుకున్న బీజేపీ.. ఈసారి 38.09 శాతం ఓట్లతో 77 సీట్లను సాధించుకుంది.

ఇదంతా ఒక ఎత్తయితే.. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అగ్రనేతలు ధీమా వ్యక్తం చేసినట్లు బీజేపీ 200కు పైగా సీట్లతో గెలిచినా కూడా ఆ ఘనవిజయాన్ని సెలబ్రేట్ చేసుకునే అవకాశం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లభించేది కాదన్నది మరో ఎత్తు. ఎన్నికలు ముగుస్తున్న సమయానికే, కొవిడ్ రెండో దశ విలయతాండవం అలాంటి హ్యాండ్సప్ పరిస్థితిని ఆయన ప్రభుత్వానికి కల్పించింది. కొవిడ్‌ను ఎదుర్కోవటంలో మోదీ పాలనా వైఫల్యం బెంగాల్ ఎన్నికలకు సంబంధించిన చర్చను మాత్రమే కాదు.. మొత్తం మోదీ రాజకీయ విజయాల్నే సవాలు చేసే స్థాయిలో ప్రభావం కనబరచింది.

జాతీయస్థాయి ప్రభుత్వం కొవిడ్‌పై తప్పుడు నిర్ణయాలు తీసుకోవటంతోపాటు.. మమతా బెనర్జీ చెప్పినట్లు, గత కొన్ని నెలలుగా ప్రధాని సహా కేంద్ర ప్రభుత్వంలోని నేతలంతా తమ బాధ్యతల్ని విస్మరించి బెంగాల్ చుట్టూనే తిరగటం వల్ల దేశం ఎంతో మూల్యం చెల్లించింది.

మన ప్రధానమంత్రిని ఇలాంటి సమయాల్లో విమర్శించాల్సి రావటం బాధాకరమే. కానీ కొవిడ్ తాకిడి ఎలాంటిదో చూశాక కూడా ఏడాదిపాటు ప్రజారోగ్యం పట్ల ఏమాత్రం పట్టింపు లేకుండా, ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యవహరించటాన్ని ఉపేక్షిస్తే రేపు ఇంతకంటే భయంకరమైన ఉత్పాతానికి మనమే అవకాశమిచ్చినవారమవుతాం. కొవిడ్ నేపథ్యంలో జాతీయ స్థాయి ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే చర్యలకు సహకరిస్తూనే సద్విమర్శ చేయటం అవసరం. ప్రజలుగా మనకు



మతిమరుపు కూడా బాగా అలవాటు. మన కళ్ల ముందు జరిగిన తప్పుల్ని తేలిగ్గా మర్చిపోతూ తప్పుడు విధానాల్ని ప్రోత్సహిస్తుంటాం. కొవిడ్ రెండో దశను కూడా అలా షార్ట్ మెమోరీతో మర్చిపోతే? ప్రజల కోపాన్ని పక్కకు మళ్లించటంలో, బాధను మరపింప చేయటంలో, గందరగోళపరిచి పక్కదోవ పట్టించటంలో మన పాలకులు సిద్ధహస్తులు. టీకాల సేకరణ బాధ్యతను రాష్ట్రాల నుంచి జాతీయ స్థాయి ప్రభుత్వం తిరిగి తీసుకున్న పరిణామమే ఇందుకు తాజా ఉదాహరణ. కేంద్రీకృత పాలనకు, ఓ అంశంపై జాతీయ విధానానికి మధ్య తేడా లేదన్నట్లు ప్రజల్ని అయోమయానికి గురిచేసే రీతి ప్రచారం ఈ విషయంలో జరుగుతోంది. వ్యక్తి పూజ, ఏకపక్ష ధోరణుల వైపు ప్రజానీకాన్ని తిరిగి నెట్టే ప్రయత్నం జరుగుతోంది. కొవిడ్ రెండో దశ అనుభవాల్ని మర్చిపోవటమనే ఖరీదైన ప్రమాదాన్ని నివారించటానికే నిష్పాక్షికంగా, నిజాయతీగా, స్పష్టంగా, నిశితంగా వాస్తవాల్ని మరింత లోతుగా విశ్లేషించుకోవటం, ఏం చేయాలో నిర్ణయించుకోవటం అవసరం.

కొవిడ్ రెండో దశ తీవ్రత ఎంత స్థాయిలో ఉంటుందో ఎవరూ అంచనా వేసి ఉండకపోవచ్చు. ఎందుకంటే వైరస్ జన్యు ఉత్పరివర్తనాల వివరాలు, దేశ ప్రజల్లోని రోగనిరోధక స్థాయిల గురించిన శాస్త్రీయ వివరాలు మనకు అందుబాటులో లేవు. ఆ దిశగా మన పరిశోధనలు చాలా స్వల్ప స్థాయిలో ఉన్నాయి. కానీ కొత్త వేరియంట్లు కనిపించాక, ఇతర దేశాల్లో అనుభవాల్ని చూశాక ఏదోకస్థాయిలో రెండో దశ తాకిడి తప్పదనే అంచనాకు మన శాస్త్రజ్ఞులు, వైద్య నిపుణులు వచ్చారు. ఇలాంటప్పుడు వ్యాక్సిన్ల తయారీకి ప్రపంచ ఖ్యాతి గాంచిన, అప్పటికే స్వదేశంలో ఓ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిన దేశంగా భారత్ ఏం చేయాలి? వీలైనంతమందికి వేగంగా టీకాలను వేయించే పని చేయాలి. వ్యాక్సిన్‌తో దాదాపు సమానమైన పనులు.. ప్రజలంతా మాస్క్ ధరించటం, గుమికూడకుండా ఉండటం, పరిశుభ్రత వంటివి విధిగా పాటించేలా చేయాలి. ఈ రెండు పనుల్లోనూ మోదీ

ప్రభుత్వం విఫలమైంది. వ్యాక్సిన్ తయారీకి చేతిలో ఉన్న అవకాశాల్ని వినియోగించుకునేందుకు సకాలంలో స్పందించలేదు, మోదీ తానే స్వయంగా పాల్గొంటూ (చాలా సందర్భాల్లో మాస్క్ కూడా లేకుండా) సూపర్ స్ప్రెడర్ కార్యక్రమాలను ప్రోత్సహించారు.

## ప్రభుత్వానికి లేని ఆసక్తి కంపెనీలకు ఎందుకుంటుంది?

వ్యాక్సిన్ తయారీ కంపెనీలకు రూ.5,000 - 10,000 కోట్లు పెట్టుబడిగా పెడితే మనకు చౌకగా వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చి దేశ జనాభాలో 70 శాతానికిపైగా టీకా రెండు డోసులు వేసే అవకాశం లభిస్తుందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దాదాపు ఏడాది క్రితమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అక్టోబర్, 2020లో బహిరంగంగా కూడా చెప్పారు. కానీ మన యూనియన్ ప్రభుత్వం ఏం చేసింది? వ్యాక్సిన్ తయారీ కంపెనీలకు ముందుగా డబ్బు సమకూర్చకపోగా, జనవరి నాటికి 20 కోట్ల డోసులు మాత్రమే ఆర్డర్ ఇచ్చింది. అంటే దేశ ప్రజల్లో వైరస్ వ్యాప్తిని అరికట్టటానికి కావలసిన 200 కోట్ల టీకాల్లో పదో వంతన్నమాట. కనీసం కొవిడ్‌పై వివాదాస్పద వ్యాఖ్యలతో అభాసుపాలైన అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాటి కూడా మన పాలకులు ఆలోచన చేయలేకపోయారు. 2020 మార్చిలో కొవిడ్ ప్రపంచమంతా విస్తరిస్తున్న తరుణంలో ట్రంప్ 'ఆపరేషన్ వార్ప్ స్పీడ్' పేరుతో టీకాల తయారీకి భారీగా నిధుల్ని కేటాయించారు. కేర్స్ యాక్ట్ (కరోనా వైరస్ ఎయిడ్, రిలీఫ్ అండ్ ఎకనామిక్ సెక్యూరిటీ) పేరిట 10 బిలియన్ డాలర్లను కేటాయించారు. ఆ తర్వాత బయోమెడికల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా మరిన్ని నిధులనిచ్చారు. టీకాలు తయారయ్యాక అమెరికాకు కావలసిన డోసుల ఇవ్వాలని ముందుగానే టీకాల కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదం పొందారు. ప్రభుత్వం నుంచి ఇలా భారీ సహకారం లభించటంతో, డోసులకు ఆర్డర్ లభించటంతో ఫార్మా కంపెనీలు వేగంగా టీకాలను తయారుచేశాయి. ట్రంప్ తర్వాత అమెరికా అధ్యక్షుడైన బైడెన్ కూడా మొట్టమొదటి ప్రాధాన్యాంశంగా 100 రోజుల్లో 10 కోట్ల డోసుల టీకాలు వేసే కార్యక్రమాన్నే తీసుకున్నారు. డిసెంబర్ 14 నుంచి ఇలా టీకాలు వేయటాన్ని మొదలుపెట్టి గడువుకంటే ముందే 90 రోజుల్లోనే 20 కోట్ల డోసులు వేయించగలిగారు. ఇలా మిషన్ మోడ్‌లో వ్యాక్సినేషన్ వల్ల కొవిడ్ మరణాల నుంచి ఊపిరి పీల్చుకునే స్థితికి అమెరికా వచ్చింది. 2020 మార్చి నుంచి 2021 మార్చి వరకు ఏడాది పాటు అమెరికాలో ఏం జరుగుతోందో చాలా స్పష్టంగా మనకు తెలుసు. ఆ చర్యల ఫలితాలు కూడా మనకు అర్థమవుతున్నాయి. కానీ అగలీబార్ ట్రంప్ సర్కార్, నమస్తే ట్రంప్ కార్యక్రమాలకిచ్చిన ప్రాధాన్యత మనం ఆ దేశ ఆరోగ్యరంగంలో పరిణామాలకు ఇవ్వలేదు. ఫలితంగా పెనుఉత్పాతాన్ని మన దేశం ఎదుర్కోవాల్సి వచ్చింది. అనేక జీవితాలు ఛిన్నాభిన్నమై పోయాయి. వ్యాక్సిన్ల తయారీ ఎప్పుడూ రిస్క్‌తో కూడుకున్నదే. అలాగే ఎంతటి సురక్షితమైన వ్యాక్సిన్‌కయినా ఏదోక దుష్పరిణామం ఉండే అవకాశముంది. అందులోనూ ఇంత వేగంగా, భారీఎత్తున వ్యాక్సిన్ల తయారీ వైద్య చరిత్రలో ఎన్నడూ జరగలేదు. ఆచితూచి స్పందించాల్సిందే. విదేశీ కంపెనీలు వ్యాక్సిన్ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకుంటే ట్రయల్స్ గురించి ఆలోచించాల్సిందే. ముఖ్యంగా ఆరోగ్యకరమైన వారికి ఓ టీకా ఇవ్వటమంటే చాలా లోతుగా పరిశీలించాలి. కానీ కొవిడ్ విజృంభణతో జరిగే నష్టంతో పోల్చుకుంటే, ప్రస్తుత కొవిడ్ వ్యాక్సిన్ల వల్ల కలిగే దుష్పరిణామాలు నామమాత్రమని ప్రపంచవ్యాప్తంగా నిపుణులు చెబుతున్నారు. క్షేత్రస్థాయి ఆధారాలు కూడా అలాగే కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాక్సిన్ల తయారీకి కేటాయింపులు, అనుమతులు లేకుండా తాత్సారం చేయటం ఘోరవైఫల్యం కాక మరేమిటి? వ్యాక్సిన్లు విఫలమైనా, కొవిడ్ దానంతటదే అంతరించిపోయినా.. వ్యాక్సిన్లకు మార్కెట్ లేకపోయినా నష్టం వస్తుంది. కానీ కోట్ల మంది దేశ ప్రజల ప్రాణాల ముందు వేల కోట్ల నష్టం చాలా స్వల్ప విషయమన్న పాలనా పరిజ్ఞానం, నాయకత్వ పాటవం ప్రభుత్వానికే లేకుంటే కంపెనీలెందుకు పట్టించుకుంటాయి? ప్రభుత్వానికి, సమాజానికి లేని బాధ్యత లాభాపేక్షతో పనిచేసే కంపెనీలకెందుకు ఉంటుంది?

## ప్రధానికి సంశయలాభం ఇవ్వనక్కర్లేదు

కొవిడ్ రెండో దశ విజృంభణ గురించి ప్రభుత్వానికి నిర్దిష్ట సమాచారం లేదా అంటే.. ఉందని స్పష్టంగా తెలుస్తోంది. కొవిడ్ రెండో దశ విజృంభణ గురించి ప్రభుత్వానికి తగిన మార్గాల ద్వారా తెలియజేశామని, సాంక్రమికేతర వ్యాధుల శాస్త్రవేత్తలు స్పష్టంగా చెబుతున్నారు. ఈ హెచ్చరికల జాబితా కూడా పెద్దదే. దేశవ్యాప్తంగా ఉన్న ల్యాబొరేటరీల కన్సార్షియం (ఇన్సాకాగ్)ఎన్‌సీడీసీ (నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్) ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వివరాల్ని స్పష్టంగా అందించిందని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) డైరెక్టర్‌గా ఇటీవల పదవీవిరమణ చేసిన రాకేష్ మిశ్రా నిర్ద్వంద్వంగా తెలిపారు. వైరస్ కొత్త వేరియంట్లు సహా రెండో దశ ప్రమాదాన్ని సూచించే సమాచారం ఇందులో వివరంగా ఉందన్నారు. ప్రఖ్యాత మెడికల్ జర్నల్ 'లాన్సెట్' కూడా సంపాదకీయంలో ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రస్తుత పరిస్థితికి కారణమని తేల్చింది. ఏప్రిల్ వరకు కేంద్ర ప్రభుత్వ కొవిడ్ టాస్క్‌ఫోర్స్ ఒక్కసారి కూడా సమావేశం కాలేదని తెలిపింది. అలాగే 2020 మే మాసంలో ఏర్పాటైన సూపర్ మోడల్ కమిటీ కూడా మార్చిలో రెండో దశ విజృంభణ గురించి స్పష్టమైన హెచ్చరిలు జారీ చేసింది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ ఓ అంచనా వేస్తూ, ఆగస్టు 1 కల్లా భారత్‌లో 10 లక్షల మరణాలు సంభవిస్తాయని, ఒకవేళ అలాంటి పరిస్థితి

తలెత్తితే ఆ జాతీయ విపత్తుకు మోదీ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని స్పష్టీకరించింది. దేశీయంగా, విదేశీయంగా మరికొన్ని ప్రామాణిక అధ్యయనాలు కూడా ఇంచుమించు ఇదే రీతిలో చెప్పాయి.

అయితే, ఈ హెచ్చరికలన్నీ ప్రధానికి చేరాయా, లేదా అని కూడా కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. శాస్త్రవేత్తల నివేదికలు, హెచ్చరికలు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తెలిశాయా లేదా అని మనం మల్లగుల్లాలు పడనక్కర్లేదు. సంశయలాభాన్ని ప్రధానికేమీ ఇవ్వనక్కర్లేదు. ఎంతో ముఖ్యమైన ప్రజారోగ్యంపై ఒక మహమ్మారి ఉరుముతున్నప్పుడు ప్రధాని అడిగిమరీ సమాచారాన్ని తెప్పించుకోవాలి. కేంద్ర ఆరోగ్యమంత్రి అడిగిమరీ సమాచారాన్ని తెప్పించుకోవాలి.

### ఈసీ కూడా సమగ్ర సమాచారం తెప్పించుకోలేదు

ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యమూ ఎంతో ఉంది. మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించాలనుకున్నప్పుడు ఈసీ ముందుగానే నివేదికను తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలించాలి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి భారతదేశంలో కమిషన్‌దే తుది అధికారం. న్యాయస్థానాలు కూడా ఒక పరిధి దాటి జోక్యం చేసుకోవు. ఎన్నికల కమిషన్ గనక కొవిడ్ రెండో దశ గురించిన సమగ్ర సమాచారాన్ని తెప్పించుకుని బయటపెట్టి ఉంటే దేశవ్యాప్తంగా పెద్ద చర్చ కూడా అయ్యేది. పాలకులు కూడా తలవంచాల్సి వచ్చేది. ప్రభుత్వాన్ని మించి విఫలమైంది ఈసీ కరోనా సమాచారాన్ని సమగ్రంగా తెలుసుకోవటంలో. ప్రభుత్వ శాఖల నుంచే కాకుండా, శాస్త్రవేత్తలు, నిపుణుల నుంచి నేరుగా కూడా వివరాల్ని కమిషన్ సేకరించి ఉండాల్సింది. కొవిడ్ రెండో దశ తీవ్రతకు మార్చి, ఏప్రిల్‌లో అవకాశముందని ఏమాత్రం శాస్త్రీయమైన సంకేతం వచ్చినా ఎన్నికల నిర్వహణలో కొత్త పుంతలకు ఈసీకి అవకాశం లభించేది. ముఖ్యంగా ఎన్నికల ప్రచార సరళిని సమూలంగా మార్చే అవకాశం దక్కి ఉండేది. విద్యార్థులే అష్టకష్టాలు పడి ఆన్‌లైన్ మార్గంలోకి మళ్లగా లేనిది, ఎన్నికల ప్రచార సభలను వర్చువల్‌గా నిర్వహించలేరా? అలాగే టీవీల్లో ఎన్నికల ప్రసంగాలు, డిబేట్లు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంతో ఇంటి నుంచి ఓటు వేయటం, ప్రజలు తమకు నిర్దిష్ట కాలవ్యవధిలో తమకు నచ్చిన రోజు ఓటు వేసుకునే వెసులుబాటు వంటి అవకాశాలు లభించేవి. కొవిడ్ వ్యాప్తి అంచనాలపై దేశాన్ని హెచ్చరించటంతోపాటు ఎన్నికల నిర్వహణలో కూడా మరింత చౌకయిన, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచగల అవకాశాన్ని ఈసీ జారవిడిచింది.

### భయం వల్ల ఇప్పుడు గుర్తించాంగానీ.. కరోనాకు ముందూ సంక్షోభం ఉంది

మన దేశంలో మనిషి ప్రాణాలకు, సామాన్యుల గుండెఘోషకు విలువ లేదు కాబట్టే ఎంతమంది మరణించారు అనే సంఖ్యను బట్టి తరచూ సంక్షోభ తీవ్రతను అంచనా వేస్తున్నాం. మనలో ఎవరికైనా కొవిడ్ సోకి ప్రమాదం ముంచుకొస్తుందేమోనన్న భయం ఉండబట్టే తీవ్రతను ప్రస్తావిస్తున్నాం. కానీ లక్షయినా, పది లక్షలయినా.. నివారించదగ్గ ప్రతి మరణానికీ పాలకులే బాధ్యత వహించాలి. ప్రాణం విలువను, అనారోగ్యం వల్ల ఆస్పత్రిపాలై ఆ డబ్బు కట్టలేక అప్పుల పాలవుతున్న వారి కష్టాల్ని, ఆ అప్పు కూడా పుట్టక సతమతమవుతున్న వారి ఆవేదనను అర్థం చేసుకునే ప్రజాస్వామిక దృక్పథం మనకు ఉంటే.. ఇప్పటికే మన చుట్టూ ఉన్న నివారించదగ్గ మరణాల్ని, కన్నీళ్లను గుర్తించి ఉండేవాళ్లం. పవిత్ర భారతదేశ ప్రజారోగ్య వ్యవస్థలో రోజూ నివారించదగ్గ బాధలతో ఐదేళ్లలోపు పిల్లలు 2,000 మందికి పైగా మరణిస్తున్నారు. కేవలం ఆరోగ్య ఖర్చులు భరించలేక ఏటా 5 కోట్లమందికి పైగా అప్పటివరకూ పేదలు కాని వారు పేదరికంలోకి జారిపోతున్నారు. అనారోగ్యం వల్ల ఏర్పడిన బలహీనత వల్ల ఉత్పాదక శక్తి కొరవడి బతుకీడుస్తున్నవారు అనేకమంది ఉన్నారు. కొవిడ్ వచ్చి ఒక్కసారిగా మన వైద్య ఆరోగ్య వ్యవస్థపై ఒత్తిడి పెరగటంతో మనం ఏదో ప్రమాదం ముంచుకొచ్చిందనుకుంటున్నాం. ఇది ముంచుకొచ్చిన ప్రమాదం కాదు.. దశాబ్దాలుగా మనం కళ్లు మూసుకుని పట్టించుకోకుండా అధ్వాన్న ప్రజారోగ్య వ్యవస్థలో బతుకుతుండటం వల్ల వచ్చిన ప్రమాదం. కరోనా రెండో దశయితే సునామీలా వచ్చి దృఢకాయులు అనుకున్నవారిని కూడా వణికిస్తుండటంతో, మనకున్న పరపతి కూడా బెడ్లు ఇప్పించటానికి పనిచేయకపోవటంతో ఇప్పుడు సమస్య గురించి కలవరపడుతున్నాం.

### ఓటుకు - ఆరోగ్యానికి సంబంధం లేకుండా పోవటంతో వైద్యం వ్యాపారమైంది

కులం, మతం, ప్రాంతం, భాష, డబ్బు, వినియోగదారీ సంస్కృతి, భ్రమాజనిత గొప్పతనాల్లో బతుకుతున్నాంగానీ.. కనీస బాధ్యతలు నెరవేర్చలేని రాజ్య వ్యవస్థను అనుమతిస్తున్నాం అనే స్పృహ మనలో కొరవడింది. రాజ్య వ్యవస్థ చేయాల్సి మొట్టమొదటి పనుల్లో ప్రతి కుటుంబానికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందించటం కీలకమనే ఆలోచన మనం ఇంతవరకూ చిత్తశుద్ధితో చేయలేదు. స్వతంత్రం వచ్చిన నాటి నుంచి మనం ఎన్నుకున్న పాలకులు చేసిన నేరసమాన నిర్లక్ష్యం ఇది. అందరికీ ఆరోగ్యాన్నివ్వటం నాగరిక సమాజ లక్షణం, ప్రజాస్వామ్య సమాజ ప్రాథమిక బాధ్యత అనే భావం ఇప్పటికీ మన బహిరంగ చర్చల్లో కొరవడింది. ఎప్పుడైతే మన ఓటుకు – మన ఆరోగ్యానికి సంబంధం లేకుండా పోయిందో ఆరోగ్యం వ్యాపారంలా మారిపోయింది. ఈ రంగంలో ఆదాయావకాశాల్ని వ్యాపారవర్గాలు గుర్తించాయి కాబట్టే భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఎన్నికల్లో డబ్బులిచ్చే కామధేనువుల్లా ప్రయివేటు

వైద్యాన్ని ఉపయోగించుకోవటం లేదా తామే నేరుగా కార్పొరేట్ ఆస్పత్రులను ఏర్పాటు చేసుకోవటాల్ని రాజకీయ నాయకులు మొదలుపెట్టారు. ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ప్రజలకు కొంత మేలు చేస్తున్నప్పటికీ, ప్రయివేటు రంగానికి ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. ప్రజలకు తాత్కాలిక ఉపశమనంగా ఉపయోగపడుతుండగా, ప్రయివేటు శక్తులకు మాత్రం శాశ్వత ఆదాయ మార్గంగా ఉపయోగపడుతోంది. ఆరోగ్యశ్రీ లేకుంటే పలు ఆస్పత్రుల్ని మూసేయాల్సిందే అని సాక్షాత్తూ ఓ కార్పొరేట్ హాస్పిటల్ యాజమానే బహిరంగంగా వ్యాఖ్యానించినా మనలో పునస్సమీక్ష లేదంటే, మనం మన జీవితాలకు అవసరమైన అసలైన అంశాల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉన్నామో అర్థం చేసుకోవచ్చు. ఈ వైఫల్యం నుంచే కొవిడ్ మన మీద విరుచుకుపడింది. కొవిడ్ రెండో దశలో జనాభా నిష్పత్తి ప్రకారం మన దేశంలో వచ్చిన స్థాయిలోనే మహమ్మారి ఫ్రాన్స్‌లో కూడా విజృంభించినా, అక్కడ మన వద్దలా హాహాకారాలు లేవు. కొవిడ్ వచ్చిందనో, వస్తుందనో భయాందోళనలకు గురవటం, కొంతమంది మరణించటం వంటి వాటికి మన దేశంలో వ్యాధి కన్నా కూడా.. దాన్ని ఎదుర్కోవటానికి తగిన వైద్య సౌకర్యాలు, అందుకయ్యే ఖర్చును భరించలేకపోవటమే ఎక్కువ కారణం.

### ముందున్నవి రెండే కర్తవ్యాలు

ఇప్పుడు మన ముందున్నవి రెండే కర్తవ్యాలు. ఒకటి, కొవిడ్ రెండో దశను అధిగమించి మూడో దశ రాకుండా నివారించటం. రెండోది, ఇక ముందు ఇటువంటి విపత్తులు వచ్చినా స్తంభించిపోకుండా తట్టుకునేలా, కొవిడ్ వంటివి లేని సాధారణ పరిస్థితుల్లో ఆరోగ్యరంగంలో రోజూ చోటుచేసుకుంటున్న వేలాది మరణాల్ని, పేదరికపు విషాదాల్ని నివారించేలా ఒక పటిష్టమైన ప్రజారోగ్య వ్యవస్థని నిర్మించటం.

కొవిడ్ రెండో దశ ప్రమాదాన్ని ఇప్పుడు గుర్తెరిగాం కాబట్టి, ప్రభావశీల మందులు, వ్యాక్సిన్లు ఉన్నాయి కాబట్టి, విపత్తుల్లో గట్టిగా పనిచేయటం మన యంత్రాంగానికి కూడా కొంత అలవాటు కాబట్టి, వీటితోపాటు ప్రపంచవ్యాప్త అనుభవాలు, సహాయసహకారాలు ఉన్నాయి కాబట్టి.. కాస్త అటూఇటుగా ఈ సంక్షోభాన్ని గట్టెక్కుతాం. నివారించదగ్గ మరణాలు, ఇతరత్రా నష్టాలు తక్కువగా ఉండాలని ఆశిద్దాం. మాస్కులు ధరించటం, శుభ్రత వంటి జాగ్రత్తలను పాటిస్తుండటంతోపాటు లాక్‌డౌన్లు సడలించాక టెస్టులు, పర్యవేక్షణల్ని పెంచటం, వ్యాక్సిన్ల సంఖ్య పెంచుతూ, పంపిణీ కూడా సవ్యంగా చేస్తూ వేగంగా ప్రజలకి అందిస్తుంటే మూడో దశను కూడా చాలావరకు నివారించవచ్చు. వీటి కోసం సర్వశక్తులతో కృషి చేయాలి. ఇదేసమయంలో మనం ప్రధానంగా ఆలోచించవలసింది సమగ్రమైన ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించటం గురించి. ఈ అవసరాన్ని పాలకులు కూడా కొంత అంగీకరించారు. మొదటి కొవిడ్ వేవ్ వచ్చి తగ్గగానే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంటర్‌ప్రెన్యూర్‌లో భారత్‌లో వైద్యరంగంలో ఉన్న వ్యాపారావకాశాల గురించి ఆలోచనల్ని ముమ్మరం చేశారు. వారి నుంచి రకరకాల ప్రతిపాదనలు వస్తున్నాయి. ఇవికాక మన దేశంలోని బ్యూరోక్రాట్లు కూడా కొన్ని సూచనలు రూపొందిస్తున్నారు. ఇవి ప్రయివేటు, కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా ఉండే అవకాశాలు కూడా ఎక్కువ. ఒకవేళ ఆరోగ్యాన్ని అందించే పని ప్రభుత్వమే చేయాలి అని నిజాయతీగా చెప్పినా కూడా.. ఖర్చు ఎక్కువ ఫలితం తక్కువ అనే నమూనాను ప్రతిపాదించవచ్చు. కానీ మన దేశ ఆర్థిక పరిస్థితులు, మన ప్రజల స్థితిగతులు, సంఘటిత రంగంలో ఆదాయావకాశాలు వంటి వన్నిటినీ పరిగణలోకి తీసుకుని కొత్త ఆరోగ్య నమూనాను రూపొందించాలి. ప్రజలకు ఆరోగ్యాన్ని అందించటం ప్రభుత్వ బాధ్యత అనటంలో ఎటువంటి సందేహం లేదు. కానీ అమెరికాలోలా 18 శాతం, మరో దేశంలోలా 10 శాతం అందించటం మన దేశం ఉన్న పరిస్థితుల్లో సాధ్యం కాదు. అదే సమయంలో మన దేశంలో అందరికీ మంచి ఆరోగ్యాన్ని ఖర్చు లేకుండా అందించటానికి నిపుణులైన వైద్య సిబ్బంది, చౌక మందులు కొన్ని అదృష్టాలు కూడా ఉన్నాయి. ఈ సానుకూలతల్ని ఉపయోగించి వీలైనంత తక్కువ ఖర్చుతో రూపాయి భారం లేకుండా ప్రజలందరికీ చెప్పుకోదగిన ప్రమాణాల ఆరోగ్యాన్ని అందించటం అనేది మనం చర్చించాల్సిన విషయం. ఇది పూర్తిగా ఆచరణ సాధ్యం అనేది మొదట మనం గుర్తించాల్సిన అంశం. ఇలాంటి ఓ సమగ్ర ప్రజారోగ్య విధానం నమూనాను లోక్‌సత్తా జేపీ 2005లోనే రూపొందించి అమలు చేసేందుకు అప్పటి ప్రభుత్వానికి అందించారు. కానీ మన దేశంలో స్వతంత్రం వచ్చిన నాటి నుంచి చేసిన వైఫల్యాన్ని గుర్తించే శక్తిని ఇంకా రాజకీయ వ్యవస్థ ప్రదర్శించలేకపోతోంది.

### ఆర్థిక సంస్కరణలకు ముందు ప్రజారోగ్యం బాగుందన్న వాదన సరికాదు

మనకు ఎలాంటి ఆరోగ్య వ్యవస్థ ఉండాలనే చర్చ స్వతంత్రం వస్తున్న సమయంలోనే జరిగింది. అందరికీ ఆరోగ్యాన్నిచ్చే తగిన మౌలిక వసతులతో ఆరోగ్య విధానాన్ని అమలు చేయాలని 'భోర్' కమిటీ 1946లోనే సూచించింది. నివారణ, ప్రాథమిక వైద్యం నుంచి తృతీయ స్థాయి వైద్యం వరకూ కలిపి చూడాలని స్పష్టం చేసింది. కానీ దాన్ని అమలు చేయకుండా ఆరోగ్య రంగానికి 1% మాత్రమే కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్వతంత్ర భారతదేశ బడ్జెట్‌లలో సాధారణంగా ఆరోగ్యం గురించి పెద్ద వివరణ ఉండేది కాదు. క్రమంగా భోర్ కమిటీ నివేదికకు విరుద్ధంగా ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యాల్ని వేరు చేసి.. వైద్యాన్ని ఖరీదైనదిగా మార్చి తృతీయ స్థాయిలో ప్రయివేటు ఆధిపత్యానికి ప్రభుత్వాలే అవకాశం కల్పించాయి.

మన దేశం పేదరికం కారణంగా ఆరోగ్య రంగానికి 1 శాతం

కంటే ఎక్కువ ఖర్చు చేయలేదనే వాదనను వినిపిస్తారుగానీ, ఒక దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే అందరికీ ఆరోగ్యం విధానం అమల్లో ఉండటం అవసరమన్న వాస్తవాన్ని మాత్రం దాటవేస్తారు. వలస దేశాలను పాలిస్తూ రెండో ప్రపంచ యుద్ధంలో గెలిచినా ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన బ్రిటన్ అలాంటి పరిస్థితుల్లో కూడా అందరికీ ఆరోగ్యం అందించేందుకు యూనివర్సల్ హెల్త్ కేర్ విధానాన్ని 'ఎన్‌హెచ్‌ఎస్' (నేషనల్ హెల్త్ స్కీమ్) పేరుతో ప్రారంభించింది. 1948లో ప్రధానమంత్రి క్లెమెంట్ అట్లీ ఈ విధానాన్ని ప్రారంభించారు. ఇప్పటికీ ఈ విధానం బ్రిటన్‌లో అత్యంత ప్రజాదరణతో నడుస్తోంది. పేదరికం కన్నా కూడా మన ప్రాథమ్యాల లోపం మనకు ఆ రోజు మన వైఫల్యాలకు ప్రధాన కారణంగా ఉంది. దేశ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించకపోవటం వల్ల జరిగిన నివారించదగ్గ మరణాలు కులం, మతం, పేదరికం, అవిద్య, గ్రామీణ జీవనం, సమాచార వ్యవస్థ కొరవడటం వంటి కారణాల వల్ల నమోదవలేదు గానీ.. చాలా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. గుండెజబ్బో, మరొకటో వచ్చిందంటే ఆ రోజుల్లో చాలామంది రోజులు లెక్కపెట్టుకోవటమే. అణగారిన కులాల వారయితే ఎవరో పారంపరిక వైద్యులు ఇచ్చిన పొడి తింటూ ఆరోగ్యం కుదుటపడుతుందనే నమ్మకంతో బతకటమే. వైద్య ఆరోగ్య రంగంలో వచ్చిన విప్లవాత్మక ఆవిష్కరణలు భారతదేశంలో అమలవటానికి ఏళ్లకు ఏళ్లు పట్టింది. వ్యాక్సిన్లు అమెరికాలో ఇచ్చిన పాతికేళ్లకు భారతదేశంలో ఇస్తుండేవారు. వ్యాక్సిన్లు మొదలుపెట్టిన దశాబ్దాల తర్వాతగానీ ఆ వ్యాధులు అదుపులోకి వచ్చేవి కావు. పోలియో వ్యాక్సిన్లను మన దేశంలో 1979లో ప్రారంభిస్తే.. దాదాపు ఇరవయ్యో శతాబ్దపు చివరి వరకూ పోలియో వ్యాధి దేశంలో ఎక్కడోక చోట కనిపిస్తూనే ఉండేది. మశూచి టీకా ఇవ్వటం భారత్‌లో 1962లో ప్రారంభిస్తే నిర్మూలనకు 1977 దాకా పట్టింది. హెపటైటిస్-బి వ్యాక్సినయితే 21వ శతాబ్దం వచ్చే వరకూ మన టీకా కార్యక్రమంలో భాగం కాలేదు. చాలాఏళ్లపాటు మన దేశంలో టీకాలను దేశ జనాభాలో సగానికి అందిస్తే పెద్ద విజయం అనుకునేవాళ్లు. లోక్‌సత్తా 20 ఏళ్ల పోరాటం తర్వాత ఎంఎంఆర్ వ్యాక్సిన్ ఇటీవల వచ్చింది. దీనివల్ల ఏటా 3 లక్షల మంది పిల్లల్ని గర్భస్థ దశ వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందుతున్నారు. పెద్ద ఖర్చు కూడా లేని ఈ వ్యాక్సిన్‌ను తీసుకురావటంలో ఇన్నేళ్ల నిర్లక్ష్యం వల్ల ఎన్ని లక్షల మంది బలయ్యారో తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. మలేరియా, క్షయ వంటి వాటి బారిన పడి అకాల మరణం పొందేవారి సంఖ్య లక్షల్లో ఉండేది. క్షయ వల్ల ఇప్పటికీ మన దేశంలో ఏటా 4,00,000 మంది దాకా మరణిస్తున్నారు. అంటే రోజుకు సగటున 1000 మందికిపైగానే. పౌష్టికాహార లోపాన్ని సవరించే ప్రయత్నం ఉండేది కాదు. మన సమాజంలోని అంతర్గత బలానికి తోడు కొంతమంది వైద్యులు ఎందో ఆదర్శప్రాయంగా సేవలందించినా, ప్రపంచంలో పలు చికిత్సలు అందుబాటులోకి వచ్చినా వాటిని సద్వినియోగం చేసుకునే ఆరోగ్య విధానం కొరవడటం వల్ల భారతదేశంలో నివారించదగ్గ అనారోగ్యం, మరణాలు లెక్కకుమిక్కిలిగా ఉండేవి. సగటు ఆయుర్దాయం చాలా నెమ్మదిగా పెరిగింది. 1990 ప్రాంతంలో ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక పురోగతితో వైద్యరంగంలోకూడా మన దేశంలో పెద్దఎత్తున మార్పులు వచ్చినా ప్రభుత్వం ప్రజారోగ్యం దిశగా ఆలోచన చేయకపోవటంతో ఆరోగ్య రంగంలో వ్యాపార ధోరణులు మొదలయ్యాయి. దీనివల్ల ఆరోగ్యానికయ్యే ఖర్చు ప్రజల ఆదాయాల్ని మింగేస్తూ పేదరికాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తోంది. ఇందిరాగాంధీ 'గరీబీ హటావో' నుంచి నేటి ప్రధాని నరేంద్రమోదీ 'అచ్ఛేదిన్' వరకు ఉదాత్త నినాదాలు ఆచరణరూపం దాల్చకపోవటానికి మన దేశంలో సరైన ప్రజారోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటం ఒక ప్రధాన కారణం. మన దేశంలో పెట్టే ఆరోగ్య ఖర్చులో ప్రజలు జేబులో నుంచి 60 – 70 శాతందాకా ఖర్చు చేస్తుండగా, మిగిలినదే ప్రభుత్వాలు చేస్తున్నాయి. ప్రపంచంలో చెప్పుకోదగిన దేశాలేవీ ఈ స్థాయిలో జనం మీద భారం మోపటం లేదు. ఆరోగ్య వ్యయంలో చైనాలో 36 శాతం, బ్రిటన్‌లో 16, జపాన్‌లో 13, జర్మనీలో 12, బ్రెజిల్‌లో 27 శాతం వంతున మాత్రమే ప్రజలు భరిస్తున్నారు. ఆరోగ్య వ్యయంలో పౌరుల సొంత వ్యయంలో అంతర్జాతీయ సగటు 18 శాతం మాత్రమే. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం బాధ్యత తీసుకోవాల్సిన ఆరోగ్య వ్యవస్థ సక్రమంగా లేకపోవటం వల్ల ఎంతమంది నలిగిపోతున్నారో కరోనా దృశ్యాలే తెలియచేస్తున్నాయి. పెరుగుతున్న ఆదాయాలు, సమాచార వ్యవస్థతో అణగారిన, పేద వర్గాల నుంచి ఆరోగ్యానికి డిమాండ్లు పెరుగుతుండటంతో ఆరోగ్యశ్రీ వంటి పథకాలను ప్రవేశపెట్టి కొంతమేర ఉపశమనం కల్పించే ప్రయత్నాల్ని చేస్తూ వచ్చారు తప్ప ఆ వైఫల్యాన్ని సరిచేసే ప్రయత్నం చేయటం లేదు.


## మోదీ ఆ ఆలోచన నుంచి వాస్తవాల వైపు మళ్లాలి, లోక్‌సత్తా సూచించిన విధానం తరహాలో సమగ్ర ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించాలి

ప్రధాని మోదీకి కూడా స్వతంత్రం వచ్చినప్పుడు భారతదేశం అనుసరించిన ఆరోగ్య విధానం పట్ల పెద్ద అభ్యంతరం కనిపించినట్లు లేదు. భారతీయ జీవనశైలిలోనే ఆరోగ్యం అంతర్భాగంగా ఉంటుందని ఆయన ప్రగాఢ విశ్వాసంలా కనిపిస్తుంది. అందువల్ల ప్రాథమిక వైద్యానికి, వ్యాధుల నివారణకి పెద్ద కేటాయింపుల అవసరం లేదని ఆయన భావిస్తుండవచ్చు. గుజరాత్‌లో కూడా ఈ రకమైన ధోరణి ఆయన ముఖ్యమంత్రిత్వంలో కనిపిస్తుంది. అందువల్లే ఆరోగ్యశ్రీ తరహాలో తృతీయ స్థాయి వైద్యానికి ఆయుష్మాన్ భారత్‌ని తీసుకొస్తే భారతదేశ ఆరోగ్య సంక్షోభానికి పెద్ద పరిష్కారమవుతుందని ఆయన అనుకున్నారు. ప్రపంచంలోనే అతి గొప్ప ఆరోగ్య పథకం ఆయుష్మాన్ భారత్ అని ఘనంగా ప్రకటించి అమల్లోకి తెచ్చారు. అది పరిమిత ప్రయోజనాలను

మాత్రమే ఇవ్వగల స్కీమే తప్ప సమగ్ర ప్రజారోగ్య వ్యవస్థకు పరిష్కారం కాదని చెప్పినా వినిపించుకోలేదు. ఫలితం కొవిడ్ తాకిడికి మన ఆరోగ్య రంగం అల్లకల్లోలమైంది. వైద్యసేవలు మృగ్యమైన గ్రామాల్లోనైతే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మన పవిత్ర నదుల్లోనే శవాలు కొట్టుకొచ్చాయి. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లు ఏవీ కొవిడ్‌ను నిలువరించి ప్రజలకు భరోసానివ్వలేకపోతున్నాయి. అనేకమంది ఆస్తుల్ని, పుస్తెల్ని అమ్ముకున్నారు. పలువురు ఎప్పుడు తీర్చగలమో తెలియనంత భారీ అప్పుల పాలయ్యారు.

సంస్థానాల కాలం నుంచి ప్రజారోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ వచ్చిన కేరళ మాత్రం కొవిడ్ కాలంలో మెరుగైన ఫలితాల్ని సాధించింది. కొవిడ్ రెండో దశ ఉద్ధృతిని ముందుగానే అంచనా వేయటంతోపాటు ఆస్పత్రి సదుపాయాలను అందుకు తగ్గట్లు విస్తరించుకోగలిగింది. ఆక్సిజన్ సదుపాయాలను మెరుగుపరచుకుంది. అక్కడ కేసుల సంఖ్య మిగతా రాష్ట్రాల్లో కన్నా ఎక్కువగా కనిపించినా, మరణాల రేటు, ఆరోగ్య సేవలు అందటం లేదనే క్షోభ తక్కువగా ఉందని గమనించాలి. అలాగే టెస్టుల సంఖ్యను మిగతా రాష్ట్రాల్లో కంటే ఎక్కువ చేయటం, ఎన్నికలు జరగటం వల్ల అక్కడ కేసులు కనిపిస్తున్నాయి తప్ప, దేశంలోని మిగతా చోట్ల కంటే అక్కడ కొవిడ్ ఎక్కువ ఉందనుకోనక్కర్లేదు. టెస్టింగ్ కేరళలో జాతీయ సగటు కన్నా దాదాపు 20 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. కానీ ఒక పరిధి దాటినాక కేరళ ప్రజారోగ్య వ్యవస్థ శక్తి కూడా చాలలేదు. కాబట్టి భారతీయ సంస్కృతిలోనే ఆరోగ్యం అంతర్భాగం, ప్రత్యేకించి ప్రాథమిక వైద్యం అక్కర్లేదు అనే భావం ప్రధానిలో ఉంటే, దాన్ని కూడా సవరించుకోవటం అవసరం. చిన్న ఆరోగ్య సమస్యలకు సంపన్నుల కంటే పేదలు ఎక్కువగా ఖర్చు పెడుతున్నారు. స్థానికంగా వైద్య సేవలు సక్రమంగా లేకపోవటం వల్ల పెద్దాస్పత్రులకు వెళ్లటం చేస్తున్నారు. విలువైన సమయాన్ని, ఆదాయాన్ని కోల్పోతున్నారు. ఆ తర్వాత చికిత్సను శాస్త్రీయంగా కొనసాగించలేకపోతున్నారు. వ్యాధి ముదిరాక ఏదోక పథకం ద్వారా ప్రభుత్వ సాయం అందినా, వ్యాధి తగ్గినా ఉత్పాదక శక్తి తగ్గిపోతోంది. అలాగే ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి స్కీముల పరిధిలోకి రాని ఔట్ పేషెంట్ సేవలకే 60 శాతం డబ్బును ప్రజలు జేబుల్లో నుంచి వెచ్చిస్తున్నారు. మన దేశంలో అకాల మరణాలు పెద్దఎత్తున ఉండేవి కాబట్టే పూర్వం అధిక సంతానానికి ప్రాధాన్యత ఇచ్చేవాళ్లు, మనం వినడానికి ఇష్టపడని, విచిత్రమైన పేర్లు పెట్టేవారు. 1952లో భారతీయుల సగటు ఆయుర్దాయం 32 ఏళ్లు మాత్రమే. కేవలం వైద్య రంగంలో వచ్చిన అభివృద్ధి వల్లే మన దేశంలో ఆయుర్దాయం ఇప్పుడు 70 ఏళ్లకు చేరింది. ఆరోగ్య రంగం పట్ల మన కంటే శ్రద్ధ వహించే దేశాల్లో ఆయుర్దాయం మనకంటే ముందే పెరిగింది, ఇప్పటికీ మన కంటే ఎక్కువగానే ఉంది. ఈ వాస్తవాల్ని ప్రధాని గుర్తెరగాలి. ఇందులో హార్వర్డ్, హార్క్‌వర్క్‌ల మధ్య తేడా ఏమీ లేదు. దేశానికి ఒక సమగ్ర ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించాలి. వ్యాధుల నివారణ, ప్రాథమిక ఆరోగ్యానికి గణనీయ ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవల కొరత, అసంఘటిత రంగం, పేదరికం, ఎక్కువ ఔట్‌పేషెంట్ ఖర్చు, ప్రమాణాలులేని విద్య ఉన్న మన దేశంలో ఇది విజయవంతంగా అమలవ్వాలంటే, బ్రిటన్‌లోలా ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిని ప్రవేశపెట్టటం మేలు. ఆధునిక సాంకేతికతను దీనికి జోడించాలి. దీనివల్ల ప్రతి కుటుంబానికీ ఒక శిక్షణ పొందిన ఎంబీబీఎస్ డాక్టర్ అందుబాటులో ఉండటం, వారి ఆరోగ్య సమస్యలు, చికిత్స గురించి వారికి సమగ్ర సమాచారంతో స్పష్టత, భరోసా ఉండటం, అనవసర వ్యయాలు తగ్గటం వంటివి సాధ్యమవుతాయి. ఒక్కో పేషెంట్‌కు కొంత డబ్బు చొప్పున డాక్టర్‌కి ప్రభుత్వమే చెల్లింపులు చేస్తుంది. ఉదాహరణకు ఢిల్లీలో డాక్టర్‌కి ప్రభుత్వం తలసరి రూ.130 ఇస్తోంది. ఆ మొత్తాన్ని రూ.150కి పెంచి ఇవ్వవచ్చు. అలాగే ఉచితంగా జనరిక్ మందులను పంపిణీ చేయాలి. ఆ తర్వాతి దశ చికిత్స అవసరమైతే అక్కడ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లను వినియోగించుకోవాలి. ప్రయివేటు భాగస్వామ్యాన్ని తీసుకోవాలి. తృతీయ దశ వైద్యం ఖరీదైనది. ఇది చాలామేర ప్రభుత్వం చేతిలో ఉండాలి. ప్రాథమికం నుంచి తృతీయ స్థాయి వరకు ఈ మొత్తానికీ అదనంగా రూ.1,00,000 కోట్లు మాత్రమే ఖర్చవుతాయి. ఈ రకమైన ఆరోగ్య విధానాన్ని అమలు చేయటం కోసం ఇప్పుడు వెచ్చిస్తున్న నిధులను కొద్దిమేర పెంచితే చాలు. 1.1 శాతం నుంచి 2 శాతానికి ఆరోగ్య బడ్జెట్‌ను పెంచితే చాలు, అందరికీ ఆరోగ్యాన్ని ఆర్థిక భారం లేకుండా అందించటం సాధ్యమవుతుంది. భారత్ ఫార్మా రంగంలో ప్రపంచస్థాయిలో ఉంది. పలు దేశాలకు వ్యాక్సిన్ల సరఫరా కేంద్రం ఇండియా. మన వైద్యులు అన్ని దేశాల్లో నిపుణులుగా గుర్తింపుపొందారు. మన దేశంలోని ఆస్పత్రులు ఖరీదైన తృతీయ స్థాయి వైద్యాన్ని సంపన్న దేశాల్లో అయ్యే ఖర్చులో 5-10 శాతంతోనే అందించ గలుగుతున్నాయి. ఇలాంటి సానుకూల అంశాలు మనకున్నాయి. వ్యాక్సిన్ వచ్చే దాకా అమెరికాను అల్లకల్లోలం చేయటానికి డొనాల్డ్ ట్రంప్ అశాస్త్రీయ వైఖరితోపాటు ఆ దేశ ఆరోగ్య విధానం కూడా పెద్ద కారణం. ఒబామా కేర్‌ను కూడా తోసిరాజనటంతో అక్కడ పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేస్తున్నా ఆరోగ్యానికి భరోసా లేని పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా ఆరోగ్య వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని అక్కడి వైద్యనిపుణులు కూడా భావిస్తున్నారు. అమెరికాలోలా మొత్తం ప్రైవేటు ఇన్సూరెన్స్ ఆధారిత నమూనాను కాకుండా, బ్రిటన్ ఎన్‌హెచ్‌ఎస్ తరహాలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భారత్ ఆరోగ్య వ్యవస్థను రూపొందించుకుంటే, మన దేశంలో అందరికీ మంచి ఆరోగ్యం అందుబాటులోకి వస్తుంది. మన దేశంలో దాదాపు 80 శాతం మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారు కాబట్టి పరిమిత ఇన్సూరెన్స్ విధానాన్ని అనుసరించాలి. ఆస్పత్రి ఖర్చులు భరించలేక అప్పులపాలై పేదరికంలోకి జారిపోకుండా ఏటా దాదాపు 5 కోట్ల మందిని కాపాడగలం. కొన్ని సంవత్సరాల

వ్యవధిలోనే పేదరికాన్ని నిర్మూలించగలం. కొవిడ్ చివరి మహమ్మారి కాదు. మున్ముందు మరిన్ని అటువంటి ఉత్పాతాలు రావచ్చని అంచనాలున్నాయి. కొవిడ్‌తో బయటపడిన మన ఆరోగ్య సంక్షోభాన్ని, ప్రాథమ్యాల వైఫల్యాల్ని సరిచేసుకోవాలి. కొవిడ్ సద్దుమణిగాక చేయవలసిన అత్యంత ప్రాధాన్యం గల పని బలమైన ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించటం. జాతీయ స్థాయి ప్రభుత్వం ఇందుకు చొరవ తీసుకోవాలి. కొవిడ్ కాలంలో కూడా మన పారంపరిక ఆయుర్వేద వ్యవస్థను శాస్త్రీయంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరగలేదు. ఆయుష్ శాఖను అలోపతి వైద్యంతో అనుసంధానం చేస్తూ స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలి. ఈలోగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ముందుకొచ్చి ఈ విధానానికి చొరవ చూపాలి. మొత్తం భారతదేశానికి ఒక మార్గం చూపాలి. లోక్‌సత్తా జేపీ సూచించిన ఈ ఆరోగ్య నమూనా (వివరాలను ఎఫ్‌డీఆర్ వెబ్‌సైట్‌లో, జేపీ వీడియోల్లో చూడవచ్చు. కరోనా నేపథ్యంలో గణాంకాలను, అవకాశాలను కూడా అధ్యయనం చేస్తూ తాజా పరిచిన సమగ్ర ప్రజారోగ్య విధానం నమూనాని ప్రస్తుతం జేపీ రూపొందిస్తున్నారు) వల్ల ప్రతి ఒక్కరికీ జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యం అందటంతోపాటు దేశంలో 2 కోట్లకు పైగా కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. మన దేశంలో ప్రజారోగ్య వ్యవస్థ సక్రమంగా లేకపోవటం వల్ల హెల్త్‌కేర్ సిబ్బంది సంఖ్య ప్రస్తుతం చాలా తక్కువగా ఉంది.



రాజకీయ నాయకులకు ప్రత్యేకమైన సూదులు న్నాయా.. అని తనకు టీకా వేసేటప్పుడు ప్రధానమంత్రి మోదీ ప్రశ్నించారు. రాజకీయ నేతలకు తోలు మందం కదా అని హాస్యమాడారు. హెర్డ్ ఇమ్యూనిటీ దానంతటదే వచ్చేస్తుందిలే అని కొవిడ్ రెండో అలను కూడా గుర్తించలేకపోవటం చూస్తే ఆ హాస్యంలో నిజముందనిపిస్తుంది. పాలకుల్లో ఆరకమైన నిర్లక్ష్యం ఉంటే పరిస్థితులు ఎంత ప్రమాదకరంగా మారతాయో ఇప్పుడు అనుభవపూర్వకంగా తెలిసొచ్చింది. బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ సైతం ఈ వైఫల్యాన్ని తప్పుపట్టింది. ఇంత ఖరీదైన తప్పిదం తర్వాత కూడా మోదీ మీ న మే షా లు లెక్కించకూడదు. ప్రజల్లో కొద్దిమందికి ప్రపంచస్థాయికి ఎదిగే అవకాశాలు, మిగిలినవారు పరిమిత ఆదాయంతో అణగిమణిగి ఉండాలనే ఆలోచనా ధోరణిని వీడాలి. అందరికీ ఎదిగే అవకాశాల కోసం మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని అందించాలి. మోదీ వ్యక్తిగత నిజాయతీ, చిత్తశుద్ధి పట్ల ఇప్పటికీ అత్యధికులకు సందేహం లేదు. కానీ ఆధునిక సవాళ్లను ఎదుర్కోలేకపోగా కొత్త సమస్యల్ని సృష్టించే భావజాలంలోని లోపాల్ని సరిదిద్దుకోకుండా కొనసాగిస్తే, దీర్ఘకాలం కొనసాగే అవకాశమున్న అధికారం, భావజాలం క్రమంగా అంతరించిపోయే ప్రమాదముంది. అప్పుడు ప్రతిపక్షాల వైఫల్యం కూడా రక్షించలేని పరిస్థితులు ఏర్పడతాయి. కరోనా రెండో దశ తీవ్రత పెరిగాక మోదీ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలు గుర్తించటం బెంగాల్ చివరి దశ పోలింగ్‌లో ప్రతిఫలించింది. ఉత్తర ప్రదేశ్ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లోనూ ప్రతిఫలించింది. ఆరోగ్యానికి ఓట్లున్నాయని తెలుగునాట వైఎస్ రాజశేఖర రెడ్డి, తాజాగా కేరళలో కె.కె శైలజ నిరూపించారు. కాబట్టి మంచి ఆరోగ్య వ్యవస్థను నిర్మించటం వల్ల రాజకీయంగా కూడా లాభం ఉంటుంది. కొవిడ్ రెండో దశ వైఫల్యంతో కొంత కుంగినట్లు కనిపించిన మోదీ ఆ తర్వాత ఏదో నిర్ణయానికి వచ్చినట్లు కనిపిస్తున్నారు. తిరిగి ఆయనలో కొంత ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది. ఆయన కొత్త నిర్ణయాలు బడ్జెట్‌లో ఆరోగ్య కేటాయింపుల్లా మభ్యపెట్టనిరీతిలో, తా బట్టిన కుందేలుకు మూడేకాళ్లు అనే ధోరణితో ఉండవని ఆశిద్దాం. ఆయన ఏం చేయకపోయినా, ప్రాథమిక స్థాయి నుంచి అన్ని దశల్లోనూ అన్ని రోగాలకూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్యాన్నిచ్చే సార్వత్రిక ఆరోగ్య పథకాన్ని అందించే శాశ్వత ప్రజారోగ్య వ్యవస్థను నిర్మిస్తే.. భారతదేశ చరిత్రలో ఆయనకు శాశ్వతకీర్తి లభిస్తుంది. చాలా ప్రపంచ దేశాలకు భిన్నంగా భారత్‌లో ఆరోగ్యంపై రాష్ట్రాలు ఎక్కువగా, జాతీయ స్థాయి ప్రభుత్వం తక్కువ ఖర్చు చేస్తున్నాయి. ఈ లోపాన్ని సరిచేయాలి. ఆరోగ్యంపై జాతీయ స్థాయి ప్రభుత్వం తన ఖర్చును పెంచటంతోపాటు మొత్తం దేశానికీ మార్గదర్శకంగా ఉండే విధానాలను అమలు చేయటం అవసరం. దేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ప్రధానమంత్రి ప్రజారోగ్యంపై ఓ మంచి నిర్ణయాన్ని వెలువరిస్తారని ఆశిద్దాం.

# వైద్య ఆరోగ్యం పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన స్థాయీసంఘం నివేదిక

**దేశంలో వైద్య ఆరోగ్య రంగం ఏళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని ఇటీవల కూడా పార్లమెంటు స్థాయీ సంఘం నివేదిక పేర్కొంది. నిధుల కేటాయింపులో ఆరోగ్య రంగానికి సముచిత ప్రాధాన్యం లభించటం లేదని స్పష్టం చేసింది. ఫలితంగా ఆస్పత్రుల్లో మానవ వనరులు, మౌలిక వసతుల కొరత ఏర్పడుతోందని తెలిపింది. పార్లమెంటుకు సమర్పించిన ఈ నివేదికలోని ముఖ్యాంశాలు:**

జాతీయ స్థాయి బడ్జెట్‌లో వైద్య రంగానికి దాదాపుగా ప్రతిసారీ నిరాశే ఎదురవుతోంది. కేటాయింపులు అరకొరగానే ఉంటున్నాయి. 2021-22 బడ్జెట్‌లో రూ. 1,21,889 కోట్లు కేటాయించాలని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ కోరితే, కేవలం రూ. 71,268 కోట్లు (కోరిన మొత్తంలో 58%) కేటాయించారు. వైద్య రంగానికి సముచిత ప్రాధాన్యమిచ్చే దేశాల జాబితాలో.. 189 దేశాలకు గాను భారత్ 179వ స్థానంలో ఉన్నట్లు ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఇటీవల ప్రకటించాయి. 2018 నాటి లెక్కల ప్రకారం స్వీడన్, జపాన్ వంటి దేశాలు తమ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 9 శాతానికిపైగా నిధులను వైద్య ఆరోగ్య రంగంలో ఖర్చు చేస్తున్నాయి. మాల్దీవులు, అర్జెంటీనా, కొలంబియా తదితర అభివృద్ధి చెందుతున్న దేశాలూ 5-7% వ్యయం చేస్తున్నాయి. భారత్ (1.4% లోపు) వాటి దరిదాపుల్లో కూడా లేదు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ బడ్జెట్‌లో 8% నిధులను వైద్యరంగానికి వెచ్చించాలని జాతీయ వైద్య విధానం సూచిస్తోంది. కానీ పలు రాష్ట్రాల్లో ఈ సూచన అమలు కావటం లేదు. 2018-19లో ఒక్క ఢిల్లీ (13.7%) మినహా ఏ రాష్ట్ర వ్యయమూ రెండంకెలు దాటలేదు. చాలా రాష్ట్రాలు వైద్య రంగానికి ప్రాధాన్యత ఇవ్వటం లేదు. ఇక ముందైనా కేటాయింపులు పెరగాలి.

**నిరుపేదలకే దెబ్బ**

నిధుల లేమి వైద్య వ్యవస్థ పాలిట సమస్యగా పరిణమిస్తోంది. దానివల్ల నిరుపేదలు, అణగారిన వర్గాలకే ఎక్కువ దెబ్బ. వైద్యం కోసం ప్రజలు సొంత జేబుల నుంచి పెట్టుకొనే ఖర్చును తగ్గించాలి. ప్రజల ఆర్థిక, సామాజిక అభ్యున్నతిని ప్రోత్సహించాలి.

**లోపాల్ని బహిర్గతం చేసిన కొవిడ్**

దేశ వైద్యరంగంలోని లోపాలను కొవిడ్ మహమ్మారి బట్టబయలు చేసింది. ఇకనైనా ప్రభుత్వాలు మేల్కోవాలి. ప్రజలకు సులభంగా, అందుబాటు ధరల్లో వైద్యం అందించాలి. అకస్మాత్తుగా ఎదురయ్యే వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లోనూ వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అందుకోసం ప్రజారోగ్య మౌలిక వసతులు, మానవ వనరులను భారీగా పెంచాలి. వచ్చే రెండేళ్లు జీడీపీలో కనీసం 2.5% మొత్తాన్ని వైద్య ఆరోగ్య రంగానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించాలి. 2025 నాటికి ఆ మొత్తాన్ని 5 శాతానికి పెంచాలి. ప్రస్తుతం దేశంలో వైద్య రంగంపై జరుగుతున్న ఖర్చులో 27% మాత్రమే ప్రభుత్వ వ్యయం ఉంది. వైద్య రంగంలో ప్రభుత్వ వ్యయం ఎక్కువగా ఉన్న దేశాల జాబితా లో 196 దేశాలకు గాను 158వ స్థానంలో భారత్ ఉంది.

**విపత్తులు చెప్పిరావు**

విపత్తులు ముందే చెప్పిరావు. అవి వచ్చినపుడు మొదట బలయ్యేది వైద్యరంగమే. వాటిని సమర్థంగా ఎదుర్కొనేలా వైద్యరంగాన్ని బలోపేతం చేయడం ఇప్పుడు అత్యవసరం. వైపరీత్యాలు ముంచుకొస్తే అత్యుత్తమ రీతిలో స్పందించడానికి అవసరమైన మానవ వనరులను ముందుగానే సమకూర్చుకోవాలి. రసాయనిక, జీవ సంబంధ, రేడియో ధార్మిక, అణు (సీబీఆర్ఎన్) విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక సామర్థ్యాలను సముపార్జించుకోవాలి.

## బడ్జెట్‌లో అబద్ధపు లెక్కలు

కరోనా నేపథ్యంలో ఆరోగ్య రంగం ప్రాధాన్యతను గుర్తించినట్లు జాతీయ స్థాయి ప్రభుత్వం 2021 బడ్జెట్‌లో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేసింది. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు 137 శాతం పెంచామని ఆర్థికమంత్రి లోక్‌సభలో చెప్పారు. కానీ పోషకాహారం, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా పద్దులనూ అందులో కలిపి చూపటం చూశాక.. ఆ అబద్ధపు ప్రచారానికి ఏమనాలో తెలియక నిపుణులు, పౌర నేతలు తలలు పట్టుకున్నారు.

## ఇతర వ్యాధుల వారికి చికిత్స మరో సవాలు

కొవిడ్ సేవల్లో తలమునకలవటం వల్ల పలు ఆస్పత్రుల్లో ఇతర వ్యాధులకు అందించే సేవలు దెబ్బతిన్నాయి. ఆరోగ్య కేంద్రాల్లో ఇతర వ్యాక్సిన్లివ్వటం మందగించింది. సరైన సమాచారం అందక పలువురు అయోమయానికి గురవుతున్నారు.

గుండె సమస్య ఉన్నవారు, క్యాన్సర్, క్షయ వంటి వ్యాధులతో బాధపడుతున్నవారు, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి సకాలంలో వైద్యం అందకపోతే వారి ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదముంది. కరోనా కల్లోలం కొంత తగ్గాక ఆరోగ్య విభాగం, సమాజం ఎదుర్కోవాల్సిన మరో పెద్ద సవాలు ఇది.

## గ్రామీణ భారతంలో దుస్థితి

దేశంలో దాదాపు 6% గ్రామాల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 14.5% గ్రామాల్లో ప్రాథమిక వైద్య కేంద్రాలు, 23.5% గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు, 11.5% గ్రామాల్లో జన ఔషధీ కేంద్రాలు ఉన్నాయని యూనియన్ గ్రామీణాభివృద్ధిశాఖ నిర్వహించిన మిషన్ అంత్యోదయ సర్వే–2019 తెలిపింది. గ్రామాల్లో అత్యధికంగా ఉన్న సౌకర్యం అంగన్‌వాడీ కేంద్రాలే. మరోవైపు వైద్య ఆరోగ్య శాఖ తాజాగా విడుదల చేసిన గ్రామీణ వైద్య నివేదిక ప్రకారమూ పల్లెల్లో వైద్య సేవలు అధ్వాన్నంగా ఉన్నాయి. అక్కడి ఆస్పత్రుల్లో సరైన వైద్య సిబ్బంది లేరు. 80 వేలకుపైగా పోస్టులు ఖాళీ ఉన్నాయి. స్పెషలిస్టులు కొరత విపరీతంగా ఉంది. మౌలిక వసతుల లేమి వల్ల గ్రామీణ ప్రాంతాల్లో 72% మంది ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.



# ముందుగానే చొరవ చూపండి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ!





హైదరాబాద్‌లోనే సీసీఎంబీ ఉంది. కొవిడ్ వైరస్ ఉత్పరివర్తనాలు, ఇతర అంశాలపై వారు ఉన్నంతలో మెరుగైన అధ్యయనాలు చేస్తున్నారు. నవంబర్ 2020లోనే నగరంలోని ఓ చెరువులో వైరస్ ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయని వారు గుర్తించారు. అలాగే సాంప్రదాయ ఆర్‌టీపీసీఆర్‌కు ప్రత్యామ్నాయంగా పొడి పరీక్ష (డ్రైస్వాబ్)ను చౌకధరలో అభివృద్ధి చేసామని ప్రభుత్వాలకు సమాచారం కూడా ఇచ్చారు. మార్చిలోనైతే కరోనా సునామీ వచ్చే ప్రమాదముందని అప్పటి సీసీఎంబీ డైరెక్టర్ ఘంటికలు మోగించారు. హైదరాబాద్‌లోనే ఇంత సమాచారమున్నా కూడా, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పట్టించుకోలేదు. సీసీఎంబీ బృందాల్ని పిలిపించి ఏం జరుగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి చర్చించలేదు. నిపుణులతో చర్చించి పర్యవసానాలు ఎలా ఉంటాయో తెలుసుకుని పొరుగు రాష్ట్రాల్ని, జాతీయ స్థాయి ప్రభుత్వాన్ని హెచ్చరించే పని చేయలేదు. పైగా నాగార్జునసాగర్ ఉప ఎన్నిక ప్రచారంలో కరోనా నిబంధనల్ని ఉల్లంఘించి మరీ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా ఆ దిశగా దృష్టి సారించలేదు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హెచ్చరించి ఉంటే మోదీ ప్రభుత్వమే కాదు, దేశం మొత్తం కొంతమేరైనా మేలుకొని ఉండేది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వం వైద్య రంగంపై ఖర్చును తగ్గిస్తూ వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం వైద్య రంగంపై 3.5% మాత్రమే ఖర్చు పెడుతున్నట్లు అప్పట్లో ఆర్‌బీఐ లెక్కేసింది. 2014–15లో ఇది 4.1%. మొదటి మూడేళ్లు జాతీయ ఆరోగ్య మిషన్‌కు మ్యాచింగ్ గ్రాంట్లు కూడా విడుదల చేయకుండా నిధులు మురిగిపోయే పరిస్థితిని కల్పించింది. 2021 ప్రారంభానికి ముందు పీఆర్ఎస్ ఇచ్చిన నివేదిక ప్రకారం మానవాభివృద్ధికి అవసరమైన ఆరోగ్యం, విద్యలకు కేటాయింపుల్లో మిగతా రాష్ట్రాల కంటే కూడా తెలంగాణ వెనుకబడి ఉంది. మానవాభివృద్ధి విషయంలో అన్ని రాష్ట్రాల సరాసరి వ్యయం 24% ఉండగా, తెలంగాణలో మాత్రం కేవలం 16 శాతం మాత్రమే ఉంది. 2015–21 సంవత్సరాల మధ్యకాలానికి (ఆర్థిక సంవత్సరాలు) సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించి పీఆర్ఎస్ ఈ నివేదికను తయారుచేసింది. చివరికి కొవిడ్ రెండో దశలో ఆస్పత్రుల సందర్శన తర్వాత ముఖ్యమంత్రి సమీక్షిస్తూ, పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నుంచి వార్డు సభ్యుని వరకూ అందరూ చికిత్స కోసం 15–20 కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే చేరాలని అనుకుంటున్నప్పుడు కొవిడ్ రెండో దశ లాంటి కల్లోలంలో పరిస్థితి దయనీయంగా గాక ఇంకెలా ఉంటుంది? రాబోయే రెండేళ్లలో రూ.10,000 కోట్లతో ఆరోగ్య రంగాన్ని బాగు చేస్తామని తాజాగా కేసీఆర్ చెప్పటం సానుకూల పరిణామం. కానీ ఆ ఖర్చు సరైన రీతిలో ఉండాలి. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో వైద్యానికి కేటాయింపులు మెరుగ్గా ఉన్నా ఎక్కువ ఆరోగ్యశ్రీకి వర్తింపచేయటంతో ఫలితాలు ఒక పరిధి దాటి రావటం లేదు. అందుకే ఆరోగ్యశ్రీని కరోనాకు వర్తింప చేస్తున్నా హాహాకారాలు తగ్గలేదు. ఈ సమస్యకు పరిష్కారం కొత్త వైద్యకళాశాలల్ని నిర్మించటంలో, ప్రయివేటు ఆస్పత్రులకు రాయితీలకు భూముల్ని కేటాయించటంలో, ఆనందయ్య మందు వంటి వాటి చుట్టూ నిగూఢ కారణాలతో హడావుడి చేయటంలో లేదు. ప్రభుత్వ బాధ్యతతో ప్రాథమిక స్థాయి నుంచి ఆరోగ్య వ్యవస్థని పటిష్ఠం చేయటంలో ఉంది. ఆరోగ్యశ్రీని, ప్రయివేటు భాగస్వామ్యాన్ని ఎక్కడ వినియోగించాలో అక్కడికి పరిమితం చేయటంలో ఉంది. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో తగినంతమంది ఎంబీబీఎస్‌లు ఉన్నారు. ఈ రకమైన సమగ్ర ప్రజారోగ్య విధానానికి జాతీయస్థాయిలో ప్రభుత్వం చొరవ తీసుకునేలోగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖరరావు, వైఎస్ జగన్మోహన్ రెడ్డి చొరవ తీసుకుని లోక్‌సత్తా సూచించిన తరహాలో ప్రజలపై ఆర్థికభారంలేని ప్రజారోగ్య విధానాన్ని తీసుకురావాలని కోరదాం.

# ఆరోగ్య సంరక్షణ గాల్లో దీపమేనా?

## - గుల్ పనాగ్, రచయిత్రి, నటి, వాణిజ్యవేత్త

కులం, తెగ, జెండర్, నేపథ్యంతో పనిలేకుండా ఏ భారతీయుడినైనా సరే వారికీ వారి కుటుంబానికి ప్రప్రథమంగా కావలసింది ఏమిటి అని అడిగితే పదిమందిలో కనీసం ఎనిమిది మంది మంచి ఆరోగ్యం, దాంతోపాటు సంతోషం కావాలని కోరుకుంటారు. అయితే ఒక పోలింగ్ బూత్‌లోని ఏ వ్యక్తినైనా పట్టుకుని అభ్యర్థిని ఎంచుకోవడంలో అతడి లేక ఆమె ప్రథమ ప్రాధాన్యత ఏది అని అడిగారనుకోండి.. ఆరోగ్య సంరక్షణను కల్పించే అభ్యర్థి తమకు కావాలనే సమాధానం వారి నుంచి కలికానికిక్కూడా వినిపించదు. భారతదేశంలో ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థ కుప్పకూలి పోవడానికి మన ఓటర్లలోని ఈ నిర్లిప్తతే ప్రధాన కారణం.

తాము ఎన్నుకుంటున్న ప్రభుత్వ ప్రధాన విధుల్లో ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని, ఉండాలని మన ఓటర్లు అస్సలు ఆలోచించటం లేదు. మరిన్ని ఆసుపత్రులు నిర్మించడం, ఉన్న ఆసుపత్రులను నవీకరించి మెరుగుపర్చడం అనేది జరగకపోతే, అభివృద్ధి కావాలంటే ఓటు వేయండని రాజకీయ పార్టీలు, నేతలు చెప్పేదానికి ఏమాత్రం విలువ ఉంటుంది? ఒకసారి అభివృద్ధి లేక వికాస్ అనే భావనను ఎవరికీ అర్థం కాని అమూర్త భావనగా మార్చేశాక, మన రాజకీయ నాయకులు దాన్ని వాడుకోవడంలో మీడియా సైతం బ్రహ్మాండంగా తన వంతు పాత్ర పోషిస్తోంది. పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలకేసి చూద్దాం. ఈ 3 రాష్ట్రాలకు చండీగఢ్‌లోని పీజీఐ ఆసుపత్రి మాత్రమే ఏకైక దిక్కుగా ఉంటోంది. దశాబ్దాలుగా ఈ ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతూ ఉంటోంది. చండీగఢ్‌లోని పీజీఐ ఆసుపత్రి గేటు వద్దకు చేరుకోవడానికి ముందే అంబులెన్స్‌లోనే ప్రాణాలు కోల్పోతున్న భయానక గాథలు ఎన్నో ఎన్నెన్నో. ఒకవేళ ప్రాణాలు నిలుపుకుని వారు ఆసుపత్రిలోకి అడుగుపెడితే చికిత్స కోసం గంటలపాటు ఆసుపత్రి ప్రాంగణంలో వేచి చూడక తప్పదు.

దేశవ్యాప్తంగా కూడా పరిస్థితి దీనికి భిన్నంగా లేదు. దేశంలో ప్రభుత్వ నిర్వహణలో కొనసాగుతున్న ఎయిమ్స్, పీజీఐ వంటి రెఫరల్ ఆసుపత్రులు తమ సామర్థ్యానికి మించి రోగులకు సేవలందిస్తూ అలసిపోతున్నాయి. నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ దేశంలో కలికానికిక్కూడా లేదు కాబట్టే.. ఇలాంటి రెఫరల్ ఆసుపత్రులపై ఇంత అలవిమాలిన భారం పడుతోంది. చాలా ప్రభుత్వాలు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వటం లేదు. అందువల్లనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు కనీస అవసరాలకు కూడా దూరమై పోయాయి. దేశ స్థూల జాతీయోత్పత్తిపై, ఆర్థిక వ్యవస్థపై పేలవమైన ఆరోగ్య సంరక్షణ



వ్యవస్థల ప్రభావం ఏ స్థాయిలో ఉందనే అంశం ఇప్పటికే చాలాసార్లు వెల్లడవుతూ వచ్చింది. ఇలాంటి దుష్ప్రభావం బారిన పడకుండా అభివృద్ధి చెందిన దేశాలు చాలావరకు తమ పౌరులకు ఏదో ఒక రూపంలో రక్షణ ఛత్రాన్ని ఏర్పాటు చేయగలిగాయి. అదే భారతదేశం విషయానికి వస్తే కుటుంబంలో ఒక్క సభ్యుడు తీవ్ర వ్యాధికి, అస్వస్థతకు గురైతే సంవత్సరాలుగా పొదుపు చేస్తూ వచ్చిన మొత్తాలు కరిగిపోతాయి.

ఈ విధంగా ఆరోగ్య సంబంధిత వ్యయం కారణంగానే ప్రతి సంవత్సరమూ దేశ జనాభాలో 3.5 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువ స్థాయికి పడిపోతున్నారని మీడియా వార్తలు చెబుతున్నాయి. తమ ప్రియతముల, ఆప్తుల వైద్య ఖర్చులు భరించడానికి సమస్తాన్ని అమ్ముకుంటున్న, తాకట్టుపెడుతున్న కుటుంబాల గాథలు ఒకటీ రెండూ కాదు. చాలావరకు ఇలాంటి గాథలు విషాదాంతాలుగానే ముగిసిపోతుంటాయి. ఆస్తుల్ని కరగదీసినా కుటుంబం వ్యాధులపాలైన తమ ప్రియతములను కోల్పోతూనే ఉంటుంది.

దేశంలోని పేలవమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల బారినపడి ఘోరంగా నలుగుతున్న బాధితుల్లో దిగువ మధ్యతరగతి కుటుంబాలే ఎక్కువగా ఉంటున్నాయి. వీరికి ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు అందని ద్రాక్షపండుగానే ఉంటున్నాయి. పైగా అత్యుత్తమమైన టయర్ 1 ఆసుపత్రులు వీరికి అందుబాటులో ఉండటం లేదు. దీంతో అనివార్యంగా వీరు ప్రమాణాలు లేని, నాసిరకం సామాగ్రితో కునారిల్లుతున్న ప్రైవేటు ఆసుపత్రుల బారిన పడుతున్నారు. ఈ ప్రైవేట్ ఆసుపత్రులు రోగి కుటుంబాల నుంచి లక్షలాది రూపాయలు కొల్లగొడుతూ చికిత్సను మధ్యలోనే నిలిపివేస్తున్నాయి. ఇలాంటి ఆసుపత్రుల చుట్టూ ఉంటున్న ల్యాబ్‌లు డాక్టర్ల తరపున సేవలందించే అటెండెంట్లతో నిండి పచ్చి మోసాలకు పాల్పడుతున్నాయి. ఈ ప్రయోగశాలలు అందించే కమీషన్ల కోసం కక్కుర్తి పడుతున్న వైద్య పుంగవులు అయినదానికి కానిదానికి టెస్టుల మీద టెస్టులు రాస్తూ రోగులను ఇలాంటి ల్యాబ్‌ల బారిన పడేస్తున్నారు.

కొవిడ్-19 సంక్షోభం వైద్యులు, ల్యాబ్‌లు వంటి ఈ తరహా పరాన్నజీవుల పంట పండిస్తున్నట్లుంది. భారత్ నిజమైన గ్లోబల్ లీడర్‌గా ఆవిర్భవించాలంటే ఈ సమస్యను తప్పకుండా పరిష్కరించాల్సిందే. ఉచిత, ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ అనేది ఏ రకంగానూ ఉచితంగా లభిస్తోందని చెప్పటానికి లేదు. దాన్ని ఇక నుంచి మన ప్రీ-పెయిడ్ (ముందస్తుగా చెల్లించిన) ఆరోగ్య సంరక్షణ అని పిలవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆరోగ్య సంరక్షణపై పెట్టే ప్రతి పైసానూ మనం ఏదో ఒకరకంగా పన్నుల నుంచే చెల్లిస్తున్నామని గ్రహించి తీరాలి. చివరకు అంగట్లో అగ్గిపెట్టె కొనుక్కునే కూలీ సైతం దానిపై పరోక్షంగా పన్ను చెల్లిస్తూనే ఉంటాడు. ఈ నేపథ్యంలో పన్నుల రూపంలో లక్షల కోట్ల రూపాయలను పిండుకుంటున్న ప్రభుత్వాలు పన్ను చెల్లింపుదారులకు కనీసమైన ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందించాల్సి ఉంటుంది.

దేశంలో నెలకొల్పిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో చాలావరకు రాజకీయ కుటుంబాల ప్రత్యక్ష యాజమాన్యంలో ఉంటున్నాయి. లేక వారు అనుమతించిన వారి యాజమాన్యంలో ఉంటున్నాయి. ఈ ఆసుపత్రులకు ఉచితంగా భూమిని అప్పగిస్తున్నారు. రాజకీయ నేతల సమ్మతి లేనిదే దేశంలో నిజమైన వాణిజ్య సంస్థలు సైతం ఇలాంటి రాయితీలను ఒక్కదాన్నైనా పొందలేవు. ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థను మెరుగుపర్చడానికి రాజకీయ వర్గానికి ఈ భారీస్థాయి రాయితీలే అడ్డుపడుతున్నాయి. దేశంలో ప్రజారోగ్య సంరక్షణ సమర్థంగానూ, ఉచితంగానూ అందుబాటులో ఉంటున్నట్లయితే ఈ ప్రైవేటు ఆసుపత్రులను ఉపయోగించుకునేది ఎవరు? పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యసంస్థలు (పీజీఐ) దేశంలో 1950, 60లలో ఉనికిలోకి రాగా, అప్పటి నుంచి దేశ జనాభా ఎన్నో రెట్లు పెరుగుతూ వచ్చింది. ఇప్పటి వైద్య అవసరాలు తీరాలంటే కనీసం జిల్లాకు ఒక పీజీఐ స్థాయి రెఫరల్ ఆసుపత్రిని తప్పక నిర్మించాల్సి ఉంది. రెండు, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి. ఉచిత, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కల్పన రాజకీయ పార్టీలకు ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలి. ఈ ప్రాథమిక అంశాలను మేనిఫెస్టోల్లో పొందుపర్చేవారికే ఓటు వేసేలాగా మన ఓటర్లు కుల, తెగ పరమైన రాజకీయాలకు అతీతంగా పరిణతి చూపాల్సి ఉంది. ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వాల ప్రథమ బాధ్యతల్లో ఒకటి అనే చైతన్యం ఓటర్లకు కలిగినప్పుడు రాజకీయ పార్టీల నుంచీ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయగలుగుతారు. ప్రజారోగ్య వ్యవస్థ కుప్పకూలిపోవడానికి బాధ్యులెవరో కూడా గ్రహించి వారే ఈ సమస్యకు పరిష్కరించాలిన ఓటర్లు డిమాండ్ చేయాలి.

**(ది ట్రిబ్యూన్/సాక్షి)**

# అసమర్థ, అశాస్త్రీయ నిర్ణయాల వల్లే ఇంత సంక్షోభం

కొవిడ్ విషయంలో వరుసగా తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్లే దారుణ సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని మహమ్మారిపై అధ్యయనం చేసిన ఓ అంతర్జాతీయ స్థాయి స్వతంత్ర కమిటీ పేర్కొంది. సరైన సమయంలో స్పందించి తగు నిర్ణయాలు తీసుకుని ఉంటే ఈ ఉత్పాతాన్ని అడ్డుకోగలిగి ఉండేవారమని 'ఇండిపెండెంట్ ప్యానెల్ ఫర్ ప్యాండమిక్ ప్రిపేర్డ్‌నెస్ అండ్ రెస్పాన్స్' (ఐపీపీపీఆర్) అభిప్రాయపడింది. వైరస్ విజృంభణకు సంబంధించి నిపుణుల హెచ్చరికలను పట్టించుకోలేదని విమర్శించింది. ప్రజా రక్షణలో వ్యవస్థలు విఫలమయ్యాయని, పలు దేశాల్లో సైన్స్‌ని విశ్వసించని నాయకుల వల్ల ఆరోగ్య వ్యవస్థలపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని తుది నివేదికలో స్పష్టం చేసింది. చైనాలో ఈ వైరస్‌ను గుర్తించిన వెంటనే ప్రపంచ దేశాలు స్పందించకుండా విలువైన కాలాన్ని వృథా చేశాయని తెలిపింది. మహమ్మారిని ఎదుర్కొనేందుకు అత్యంత సంపన్న దేశాలు.. అత్యంత పేద దేశాలకు ముందుగా కనీసం వంద కోట్ల టీకా డోసులు విరాళంగా అందించాలని సూచించింది. అలాగే, ఇలాంటి మరో మహమ్మారిని ఎదుర్కొంటున్న సంస్థలకు సాయం అందించాలని సంపన్న దేశాలకు విజ్ఞప్తి చేసింది. కరోనా మహమ్మారిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని గత సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్య దేశాలు అభ్యర్థించటంతో ఐపీపీపీఆర్ ఈ నివేదికను రూపొందించింది. ఈ కమిటీకి న్యూజిలాండ్ మాజీ ప్రధాని హెలెన్ క్లార్క్, లైబీరియా మాజీ ప్రెసిడెంట్ ఎలెన్ జాన్సన్ సర్లీఫ్ నేతృత్వం వహించారు. ఎలెన్ జాన్సన్‌కు 2011లో నోబెల్ శాంతి పురస్కారం లభించింది. 'కొవిడ్-19 – మేకిట్ ద లాస్ట్ ప్యాండమిక్' పేరుతో ఈ నివేదికను రూపొందించారు. ఇలాంటి మరో మహమ్మారి రాకుండా ఉండాలంటే అంతర్జాతీయ స్థాయిలో ఒక సమర్థవంతమైన హెచ్చరిక వ్యవస్థ ఉండాలని కమిటీ సూచించింది. సంక్షోభంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ వైఫల్యం కూడా ఉందని తెలిపింది. 2020 జనవరి 22నే అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితి ప్రకటించకుండా మార్చి వరకు జాప్యం చేసిందని అభిప్రాయపడింది. కరోనాపై ప్రపంచాన్ని హెచ్చరించటంలో చైనా కూడా జాప్యం చేసిందని తెలిపింది. 'వ్యూహాత్మకంగా అసమర్థ నిర్ణయాలు, సమన్వయంలో లోపాలు, ఉదాసీనత, సత్వరమే స్పందించకపోవటం.. ఇవన్నీ కలిసి కొవిడ్ దారుణ సంక్షోభానికి కారణమయ్యాయని పేర్కొంది.

# నిజమైన పౌరసత్వానికి నిలువెత్తు నిదర్శనం విజయకర్

ఎలక్ట్రానిక్స్ విభాగ మాజీ కార్యదర్శి ఎస్ఆర్ విజయకర్ మరణం విచారం కలిగించింది అని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. "విజయకర్ ఓ అరుదైన పౌరుడు. చిరునవ్వుతో, ఆశావాదంతో సమాజం కోసం క్రియాశీలంగా పనిచేశారు. ముందు తను ఆచరించి ఇతరులకు చెప్పేవారు. నిజమైన పౌరసత్వం అంటే ఏమిటో చేతల ద్వారా తెలియజెప్పారు. ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తాకు మూలస్తంభాలుగా నిలిచినవారిలో ఒకరు. ఆయన మృతి సమాజానికి లోటు" అని జేపీ నివాళులర్పించారు.

# కొవిడ్ వైరస్‌ను మించిన శత్రువు మన పాలన, రాజకీయాల్లో ఉంది..

## ఉపాధితో కూడిన వృద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి

భారతదేశ ప్రజలకు గణాంకాలు అక్కర్లేదు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పింది నమ్మితే చాలన్నట్లు వ్యవహరించే ఎన్‌డీయే ప్రభుత్వం.. ఆర్థికరంగం గురించి కూడా తప్పదన్న సందర్భాల్లోనే అంకెలు వెల్లడిస్తుంటుంది. ఆ సందర్భాల్లో కూడా.. ఆర్థికవృద్ధి ద్వారా వస్తున్న ఉద్యోగావకాశాల గురించి మాత్రం ప్రస్తావించదు. ఉపాధి లేని వృద్ధి ఏర్పడటం అంతకుముందు యూపీయే ప్రభుత్వంలో డా॥ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా జరిగింది. 2004 నుంచి 2012 మధ్యకాలంలో కేవలం 9 మిలియన్ల ఉద్యోగాలనే ఇచ్చారని ఎన్ఎస్ఎస్‌వో అధ్యయనం తెలియచేస్తోంది. అయితే యూపీయే హయాంలో వృద్ధి గణనీయంగా ఉంది. ఆ తర్వాత వచ్చిన ఎన్డీయే హయాంలో ఉపాధితో పాటు వృద్ధి కూడా మందగించింది. దేశ జనాభాలో నెలకి 10 లక్షల ఉద్యోగాల్ని సృష్టించాల్సిన అవసరముండగా, ఉద్యోగావకాశాల గురించి మాట్లాడటానికే ప్రభుత్వ వర్గాలు సుముఖత వ్యక్తం చేయటం లేదు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని కరోనాకు ముందు కొన్నేళ్ల నుంచీ ఆర్థిక సంస్థల అధ్యయనాలు, సర్వేలు చెబుతున్నా ప్రభుత్వం తోసిపుచ్చుతూ వస్తోంది. ఎన్నికల మీద ఎన్నికల్ని గెలుస్తుండటం కూడా వారి చల్తాహై రాజకీయానికి బలం చేకూర్చింది. కానీ కొవిడ్ ఉత్పాతం వచ్చాక ఆరోగ్య రంగంలోలాగే ఉపాధి రంగంలో కూడా సంక్షోభం బద్దలవుతూ వస్తోంది.

సెంటర్ ఫర్ మానిటరింగ్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) తాజా లెక్కల ప్రకారం, ఉపాధిని కోల్పోతున్నవారు కూడా తోడవటంతో దేశంలో నిరుద్యోగం దిగ్భ్రాంతికరస్థాయిలో పెరుగుతోంది. కొవిడ్ వల్ల ఒక్క మే మాసంలోనే దాదాపు రెండు కోట్ల మంది ఉపాధిని కోల్పోయారు. ఈ సంఖ్య ఇంకా ఎక్కువేనని క్షేత్రస్థాయిలో ఉండే ఎంటర్‌ప్రెన్యూర్లు అంటున్నారు. కరోనా కాలంలో అమెరికా రికార్డు స్థాయిలో నెలకు 5 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తోంది అని ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ చెబుతుంటే, మన దేశంలో ఇప్పటికే ఉన్న నిరుద్యోగ సంక్షోభానికి తోడు ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి. కొవిడ్ తొలిదశను ఎదుర్కోవటంలో మన కంటే అధ్వాన్నంగా ఉన్న అమెరికాలో ఇదెలా సాధ్యమైందో ప్రభుత్వంతోపాటు సమాజం కూడా లోతుగా ఆలోచించాలి.

మన ప్రధానమంత్రి ఇటీవల మాట్లాడుతూ, కనిపించని శత్రువుతో యుద్ధం చేస్తున్నామని, అందువల్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. యుద్ధం లాంటి వాతావరణాన్ని సృష్టించే పదాల్ని ఉపయోగించకుండా ప్రజల్ని ఆకట్టుకోలేమనుకుంటే, అందుకో శత్రువును వెతుక్కోవాలనుకుంటే.. అసలు శత్రువు కొవిడ్ వైరస్ కాదని మనందరం గుర్తించాలి. అసలు శత్రువు మన రాజకీయం, పాలనలో ఉంది. కనిపించకుండా మన జీవితాల్ని, వృద్ధిని కబళిస్తోంది. కొవిడ్ వైరస్‌లో ఎక్కడా అశాస్త్రీయత లేదు. దాని పని అది చేసుకుపోతోంది. సమీప భవిష్యత్తులోనే దానికి మందులు వచ్చి, ఓ సాధారణ జలుబులాగా మారిపోయే అవకాశముంది. కానీ మన రాజకీయం, పాలనలో ఉన్న వైఫల్యాలు దశాబ్దాలు గడుస్తున్నా మనల్ని కబళించటం ఆగటం లేదు. కొవిడ్ వైరస్‌ను మించిన మ్యుటేషన్లతో కొన్ని వేరియంట్లు సమాజాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నాయి. ఓట్లు దండుకోవటానికి ఈ రాజకీయం ప్రజల్లో ఉన్న బలాల్ని కాకుండా బలహీనతల్ని ప్రేరేపిస్తోంది. కరోనాను ఎదుర్కోవటంలో విఫలమై మన దేశం నివారించదగ్గ భారీ ప్రాణ, ఆర్థిక నష్టాన్ని చూడటానికి కారణాలు కూడా మన వ్యవస్థలోని వైరస్సే కారణం.



భారీ ఆర్థిక ప్యాకేజీ అంశాన్ని అలా ఉంచితే, ప్రధానంగా వ్యాక్సిన్లను పెద్దఎత్తున ప్రజలకు అందించటం అమెరికాకు కలిసివచ్చింది. మనం ప్రాణాలకి, జీవనోపాధికి సంబంధించి నినాదాలిచ్చుకున్నాం తప్ప కొవిడ్‌ని ఎదుర్కొని వాటి కోసం నిర్మాణాత్మక పద్ధతుల్ని అనుసరించటంలో విఫలమయ్యాం.

మన దేశం ఉన్న పరిస్థితుల్లో భారీ ఆర్థిక ప్యాకేజీ సాధ్యం కాదు. కాబట్టి ఆర్థిక వ్యవస్థ నడుస్తూనే ఉండాలి. దానికితోడు మన సమాజంలో అవిద్య, ఛాందస సెంటిమెంట్లు ఎక్కువ. కిక్కిరిసిన ఇళ్లలో జీవితాన్ని గడిపేవారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్‌లు విధించటం మనకి ఏమాత్రం పనికొచ్చే పరిష్కారం కాదు. పైగా కరోనా వైరస్ ఎబోలాలా తీవ్ర ప్రాణాంతకం కాదు. సరైన జాగ్రత్తలు తీసుకుంటే 95 శాతం కేసుల్లో సమస్య లేకుండా బయటపడవచ్చు. మిగిలినవారిలో కూడా రెండు శాతానికి తీవ్ర సమస్యలు ఎదురయ్యే ప్రమాదముంది. అయితే ఇలా ఒక గురితప్పకుండా జరగాలంటే కొన్ని నిబంధనల్ని కచ్చితంగా పాటించాలి. కొవిడ్‌కు తగ్గ ప్రవర్తనని రాజీలేకుండా పాటించాలి. ప్రజలందరూ మాస్క్‌లు ధరించటం, గుమికూడకుండా ఉండేలా బార్లు, వినోద కేంద్రాలు వంటివి మూసివేయటం, పరిశుభ్రతకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. మనకు సరైన ప్రజారోగ్య వ్యవస్థ లేకపోవటం వల్ల ఆరోగ్యపరమైన సందేశాలను ప్రజలు వెంటనే స్వీకరించి అమలు చేసే అలవాటు లేదు కాబట్టి.. పోలీసులతోపాటు కాలేజీ యువతీయువకుల్ని కొంత గౌరవ వేతనంతో కొవిడ్ వారియర్లుగా నియమించి మాస్క్‌లు ధరించటం వంటి చర్యలు సక్రమంగా అమలయ్యే చర్యలు తీసుకోవాలి. అలాగే కొవిడ్ బారిన పడ్డ వారికి వైద్యసేవలపై దిశానిర్దేశం చేసేందుకు వైద్య నిపుణులు, సిబ్బందితో ఒక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి. అయినా పరిస్థితి అదుపులోకి రావటం ఆలస్యమవుతుంటే, తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో కఠిన ఆంక్షల్ని కూడా విధించాలి. కానీ ప్రభుత్వం పాలనా సామర్థ్య వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవటానికి కొవిడ్ తొలినాళ్లలో కఠిన లాక్‌డౌన్‌ను దేశవ్యాప్తంగా అమలు చేసింది.

ఆ తర్వాత కొవిడ్ అదుపులోకి వచ్చాక నిపుణుల సూచనల్ని బేఖాతరు చేస్తూ ప్రభుత్వం, సమాజం నిర్లక్ష్యం వహించటంతో రెండో దశ విజృంభించింది. వైరస్ వ్యాప్తిని లాక్‌డౌన్ నిలువరిస్తుందన్నది నిరూపిత సత్యం.

అయితే లాక్‌డౌన్ అవసరంలేని చర్యలు మన వద్ద కొరవడటం వల్ల.. వైరస్ ఉత్పరివర్తనం మొదటిసారి కంటే తీవ్రంగా ఉండటం వల్ల రెండోసారి కూడా ఎంతోకొంత కఠిన లాక్‌డౌన్‌ను పలు ప్రాంతా ల్లో అమలు చేయాల్సి వచ్చింది. దీంతోపాటు అవసరమైన వ్యాక్సిన్లకు కీలక సమయంలో రూ.10,000 కోట్లు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేసింది. ఒకరోజు దేశవ్యాప్త లాక్‌డౌన్ వ్యయం సుమారు 10వేల కోట్లు. ఇలా ప్రభుత్వ వైఫల్యం, వాస్త వాల్ని వినిపించుకోని నిర్లక్ష్యం వల్ల భారత్‌కు లక్షల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లింది. కోట్ల మంది ఉపాధి అవకాశాల్ని కోల్పో యారు. అనేకమంది జీవితాలు అగమ్యగోచరంగా మారాయి.

కొవిడ్ మన రాజకీయ, పాలనా వైఫల్యాల్ని పరాకాష్ఠలో చూపింది. అందుకే ఒకపక్క కొవిడ్ వైరస్‌ను అదుపుచేయటంతోపాటు మన పాలనను, రాజకీయాన్ని ప్రక్షాళన చేసుకుంటూ ప్రజాస్వామాన్ని వికసింపచేయటం కోసం కూడా మనం బలంగా చర్యలు ప్రారంభించాలి. ఇందులో తక్షణావసరాలుగా ప్రజారోగ్యాన్ని బాగుచేసుకోవటంతోపాటు ఉపాధి ఆధారిత ఆర్థికవృద్ధి మీద దృష్టి పెట్టాలి. ఇందుకోసం జేపీ సూచించినట్లు, అసంఘటిత రంగంలో ఉపాధిని పరిరక్షించేందుకు చర్యల్ని పెద్ద ఎత్తున తీసుకోవాలి. ఎంపిక చేసిన చోట భారీస్థాయి ఆర్థిక కేంద్రాలను నెలకొల్పి మౌలిక సదుపాయాలను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేయాలి. ఇక్కడ పెట్టుబడులకు రాయితీల్ని ఉపాధి ఆధారితంగా ఇవ్వాలి. కార్మిక సంస్కరణల్ని చిత్తశుద్ధితో అమలు చేయాలి. కనీసం 2 కోట్ల ఉద్యోగావకాశాల్ని అందించేలా సమగ్ర ప్రజారోగ్య విధానాన్ని అమల్లోకి తేవాలి. మన వద్ద ఉపాధిలో ఐచ్ఛిక నిరుద్యోగం కూడా ఒక సమస్యగా ఉంది. చిన్న పని, పెద్ద పని అనే వివక్షతో కొన్ని రకాలు పనులున్నా కూడా చేయటానికి ఇష్టపడక ఖాళీగా ఉండేవారు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఆ ధోరణిని వీడి డిగ్నిటీ ఆఫ్ లేబర్‌తో అందుబాటులో ఉన్న ఉపాధితో ఆదాయం పొందటం, నైపుణ్యాల్ని నిరంతరం పెంపొందించుకుంటూ ఆదాయాల్ని పెంచుకోవటం సమాజం నుంచి కూడా జరగాల్సిన పని.

## లాక్‌డౌన్ కన్నా స్థానిక ఆంక్షలు మేలని ముందే సూచించారు

అమెరికాలో ఉంటున్న ప్రవాస వైరాలజిస్టొకరు ఇటీవల హైదరాబాద్‌కి వచ్చారు. ఆయన నాలుగుసార్లు నోబెల్ బహుమతికి నామినేట్ అయ్యారు. ఓ ప్రముఖ న్యూస్ ఛానల్‌కి ఆయనిచ్చిన ఇంటర్వ్యూలు బాగా ప్రాచుర్యం పొందాయి. ఆచరణసాధ్యమైన విలువైన సూచనల్ని ఆయన ప్రజలకు ఇచ్చారు. అయితే కొవిడ్ పూర్వాపరాలు, స్పానిష్ ఫ్లూ అనుభవం నుంచి ఎలాంటి చర్యలు తీసుకోవాలి వంటి విషయాల్ని మన ప్రజలకు ఎవరూ ఇంతవరకూ చెప్పలేదని ఆయన అన్నారు. అది సత్య దూరం. కొవిడ్-19 గురించి జనవరి 2020లోనే లోక్‌సత్తా జేపీ స్పష్టంగా చెప్పారు. ఒక డాక్టర్‌గా, ఐఏఎస్‌గా, విధానాల రూపకర్తగా, రాజకీయనేతగా, మేధావిగా అన్ని కోణాల నుంచీ సమన్వయం చేస్తూ పరిష్కారాల్ని అందించారు. లాక్‌డౌన్ మనకు ఎంత అనర్థదాయకమో, వలస కార్మికుల సమస్య ఎంత తీవ్రమైనదో కూడా తొలినాళ్లలోనే ప్రభుత్వానికి, ప్రజలకు చెప్పారు. లాక్‌డౌన్‌కు బదులు వైరస్ అధికంగా ఉన్న చోట్ల స్థానిక ఆంక్షల్ని అవసరమైతే కఠినంగా అమలు చేయాలని సూచించారు. ప్రజారోగ్యాన్ని తక్షణ, దీర్ఘకాల ప్రాతిపదికన ఎలా పటిష్ఠం చేయాలో చెప్పారు.

# నిరుద్యోగ భారతం - కొన్ని గణాంకాలు

- ప్రముఖ ఆర్థిక సర్వే సంస్థల ప్రకారం ఉత్పాదక పనుల్లో ఉన్న ఉద్యోగుల సంఖ్య 2011-12లో 58.9 మిలియన్లు ఉంటే, అది 2015-16 నాటికి 48.3 మిలియన్లకు పడిపోయింది.
- ప్రభుత్వ అధ్యయనాల ప్రకారమే.. 1977-78 నుంచి 2011-12 దాకా నిరుద్యోగ శాతం 2.6 శాతం పెరిగింది. కానీ అది 2017-18 నాటికి 6.1 శాతానికి చేరుకున్నది.
- 18-23 ఏండ్ల మధ్య వయస్సున్న వారిలో 2006లో నిరుద్యోగం 11 శాతం ఉంటే, అది 2016 నాటికి 26 శాతానికి చేరుకున్నది. + పదిహేనేండ్లు అంతకు ఎక్కువ వయసున్న యువతలో నిరుద్యోగ శాతం కూడా గతంతో పోలిస్తే తీవ్రంగా పెరుగుతున్నది. 2004-05లో పదిహేనేండ్లకు పైబడిన వారిలో 43 శాతం నిరుద్యోగం ఉంటే, 2011-12 నాటికి 39.5 శాతానికి చేరుకున్నది.
- మొత్తంగా వార్షిక కార్మికశక్తి 12 మిలియన్లకు మించటం లేదు. దేశంలో నూతన ఆర్థిక విధానాలు అమలు ఆరంభ రోజులు 1999-2000 నుంచి 2004-05లలో మాత్రమే 12 మిలియన్లకు చేరుకున్నది. 2011-12లో కేవలం 2.4 మిలియన్లు మాత్రమే లేబర్‌ఫోర్స్ పెరిగింది. మరోవైపు ఈ సంవత్సరాల్లోనే అక్షరాస్యత గణనీయంగా పెరగటం గమనించవచ్చు.
- 2011-12 దాకా నిరుద్యోగుల సంఖ్య స్థిరంగా 10 మిలియన్లుగా కొనసాగింది. 2015-16లో నిరుద్యోగం 16.5 మిలియన్లకు చేరుకున్నది.
- ఉత్పాదక రంగంలో ఉద్యోగాలు పొందినవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఉత్పత్తిరంగంలో 2011-12లో 58.9 మిలియన్ల మంది పనిచేస్తే, అది 2015-16 నాటికి 48.3 మిలియన్లకు తగ్గిపోయింది. ఇలా నాలుగైదేండ్లలో 10 మిలియన్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

# విద్యారంగంలోనూ కరోనా కళ్లు తెరిపించిందనుకుందాం

- డా॥ జయప్రకాష్ నారాయణ్

ఒక సంవత్సరానికిపైగా ప్రపంచమంతా భయాందోళనలతో ఉన్నప్పుడు పాఠశాలలకు సంబంధించి ప్రాధాన్యత తగ్గుతుంది. జరిగిన దాని గురించి బాధపడి ఉపయోగం లేదు. ఈ సంక్షోభాన్ని ఒక అవకాశంగా తీసుకుందాం. ఎందుకంటే, కరోనా లేదనుకుందాం, స్కూళ్లు మామూలుగా నడిచాయనుకుందాం.. అయినా కూడా మన విద్య చాలా తీవ్రమైన సంక్షోభంలో ఉంది. మనందరం గుర్తించాల్సింది ఇది. కరోనా వల్ల అంతా సంక్షోభం వచ్చి పడింది, కరోనా పోతే అంతా బాగుపడుతుంది అనేది భ్రమ.



కరోనా క్రమంగా పోతుంది. మామూలు జీవితం వస్తుంది. వచ్చే విద్యాసంవత్సరానికి పెద్ద ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ విద్య బాగోలా. ఈ సంక్షోభాన్ని అవకాశంగా తీసుకుందాం. ఉదాహరణకు ఇప్పటిదాకా మనం తీసుకున్నట్లయితే, పేరుకు పరీక్షలు, పరీక్షల్లో మార్కులు తప్ప చదువు అబ్బటం లేదు. ఆన్‌లైన్ పరీక్షలతో ఇబ్బంది ఉందంటున్నారు.. కానీ ఆఫ్‌లైన్‌లో మామూలు పరీక్షల్లో కూడా ఏమీ అద్భుతాలు జరగటంలా. బట్టీపడితే, కాపీ కొడితే చాలు. ఏమీ అర్థం కాకున్నా, ఉన్న పరిజ్ఞానం ఉపయోగించనక్కర్లేకున్నా పర్లే. నూటికి 80 మంది పిల్లలకు ఏమీ తెలియకుండానే బ్రహ్మాండంగా మార్కులు, ఫస్ట్‌క్లాస్‌లు వస్తున్నాయి. ఎందుకూ కొరగాకుండా పోతున్నారు సమాజంలో. కేవలం డిగ్రీలు, సర్టిఫికెట్లు. ఇది కఠోర వాస్తవం. ప్రభుత్వాలా, ప్రయివేటా అన్నది ముఖ్యం కాదు. చాలా పెద్దఎత్తున ఖర్చుపెడుతున్నాయి ప్రభుత్వాలు. మన రెండు తెలుగు రాష్ట్రాల్లోనే విద్యారంగం మీద అమ్మఒడి వంటి పథకాలను కలుపుకుంటే దాదాపు రూ.35,000 కోట్లు ఖర్చువుతోంది ప్రభుత్వం నుంచి. ఇది చిన్న మొత్తం కాదు. మొత్తం రెండు రాష్ట్రాల్లో 65 లక్షల మంది దాకా పిల్లలు ఉంటారు. ఇది ఆషామాషీ వ్యయం కాదు. మనం చిత్తశుద్ధితో విద్యాప్రమాణాల్ని పెంచాలి. విద్య బాగోకపోతే నష్టపోతున్నది ఎవరు? డబ్బున్నవాళ్లు నూటికి 90 మంది ఏదోకరకంగా తంటాలు పడుతున్నారు. ఖరీదైన స్కూళ్లలో పిల్లల్ని చేరుస్తున్నారు. ట్యూషన్లు పెట్టుకుంటున్నారు. వారి అబ్బాయో, అమ్మాయో అనుకున్నంత ప్రతిభతో రాణించకపోయినా డొనేషన్లు ఇచ్చి ఖరీదైన కళాశాలలో చేరుస్తున్నారు. అంతాఅయ్యాక వ్యాపారమో, మరోటో చేసుకోండని పెట్టుబడి పెడుతున్నారు. నష్టపోతున్నది నిరుపేదలే.

తెలివితేటలు వికసించకపోవటం వల్ల పేదలు, రైతుల కుటుంబాలు నష్టపోతున్నాయి. ఇవాళ రైతుల ప్రయోజనాల గురించి మాట్లాడుకుంటున్నాం. ఏ రైతు కుటుంబాన్నయినా అడగండి. ఒక బిడ్డను స్కూలుకు పంపటమంటే రూ.70,000 – 80,000 ఖర్చువుతుంది సగటున ఏడాదికి. కాస్త పనికొచ్చే విద్య కావాలనుకుంటే. మరింక ఆ కుటుంబాలేం బాగుపడతాయి! అసలే ఆదాయం తక్కువ ఉన్న సమాజంలో. కాబట్టి ప్రభుత్వం తక్కువ ఖర్చు పెట్టటంలా. అంగట్లో అన్నీ ఉన్నాయి. మన అదృష్టం కొద్దీ జాతీయస్థాయిలో ఒక మంచి విద్యావిధానాన్ని ప్రవేశపెట్టారు. ఇదేదో పార్టీల ప్రమేయంతో చేసింది కాదు. కస్తూరి రంగన్ కమిటీ విద్యావేత్తలు, నిపుణులతో కూర్చుని చాలా ఉన్నత ప్రమాణాల విద్య పిల్లలందరికీ అందాలని ఒక గట్టి ప్రయత్నం జరిగింది. కనీసం కాగితం మీద. అది విధానం. దాన్ని అమలు చేయటానికి ఈ కొవిడ్ వల్ల ఏర్పడిన గ్యాప్‌ని ఒక

అవకాశంగా తీసుకుందాం. నూతన విద్యావిధానానికి ఎలా తయారుచేయాలి, ఉపాధ్యాయులను ఎలా తయారుచేయాలి. అలాగే ఇంత డబ్బు ఖర్చు పెడుతున్నాం కాబట్టి ఆ డబ్బుని కొంచెం ఇతర రూపాల్లో ఖర్చు పెట్టే ప్రయత్నం చేయొచ్చు.

దూరవిద్య 20% అవసరం. ఉపాధ్యాయులతో సంబంధం లేకుండా పిల్లలకు కాన్సెప్టులు పట్టుపడటం అవసరం. దీనికోసం కొంత డబ్బు కేటాయించాలి. రెండోది పేదపిల్లలకు 10,000 – 15,000 రూపాయాల్లో మంచి ప్రమాణాల చదువు అందే స్కూళ్లు అందుబాటులో ఉంటే, ప్రభుత్వమే ఆ డబ్బును భరిస్తే పెద్ద ఎక్కువ డబ్బు కాదు. ఆ స్కూళ్లూ నిలబడతాయి, పిల్లల చదువులూ బాగుపడతాయి. అన్నిటినీ మించి పరీక్షల్ని సమూలంగా మార్చి.. మొక్కుబడి పరీక్షలు కాకుండా, కాపీ కొట్టటం కాకుండా.. నిజంగా పిల్లలు ఏం తెలుసుకున్నారు, ఆ గ్రహణశక్తిని, ఆ పరిజ్ఞానాన్ని ఎలా వినియోగిస్తారో బయటపెట్టేట్లుగా రూపొందించాలి. ప్రపంచమంతా చేస్తున్నారు, భారతదేశానికి పెద్ద కష్టం కాదు. అది కూడా చేయకపోతే మనకు విద్య గురించి మాట్లాడే హక్కు లేదు. ఉదాహరణకు 'పీసా' పరీక్ష. పిల్లల భాష, భావ ప్రకటన ఏ రకంగా చేస్తారో అందులో బేరీజు వేస్తారు. రాయక్కర్లా, బట్టీపట్టనక్కర్లా. గణితంలో కాన్సెప్టు, దాన్ని ఉపయోగించగలగటం. సమస్యా పరిష్కారం. మూడోది సైన్స్. ఫార్ములాలు బట్టీపట్టటం కాకుండా.. తర్కం, వాస్తవాల నుంచి మనం ఏ రకంగా నిర్ధారణలు చేస్తాం. ఈ మూడూ పరీక్షిస్తున్నారు ప్రపంచవ్యాప్తంగా. మన పిల్లలు ఈ పరీక్షలో ప్రపంచంలో 74 దేశాలలో అడుగునుంచి రెండోస్థానంలో ఉన్నారు. మనం చాలా తేలిగ్గా పైస్థాయికి చేరుకోవచ్చు. మొట్టమొదటి స్థానానికి ఒక్కరోజే రాలేం. కానీ టాప్ 10లో వచ్చే 5–10 ఏళ్లలో వెళ్లటం కష్టం కాదు. ఎందుకంటే మన పిల్లలకు తెలివితేటలున్నాయి, కష్టపడుతున్నారు, తల్లిదండ్రులు త్యాగాలు చేస్తున్నారు, సమాజంలో విద్య అంటే తపన ఉంది, విద్య బాగుండాలనే కోర్కె ఈ సమాజంలో సంస్కృతిలో అంతర్లీనంగా ఉంది. అంగట్లో అన్నీ ఉన్నాయి. కాబట్టి దానికి వెళ్లాలి అంటే పరీక్షల పద్ధతిని సమూలంగా మార్చాలి. ఒత్తిడి లేని, బట్టీపట్టని, కాపీ అవసరం, అవకాశంలేని, నిజంగా ఏం నేర్చుకున్నారు, నేర్చుకున్నది ఎలా ఉపయోగిస్తున్నారు– దాన్ని తెలుసుకునే పద్ధతులు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి.. అవి చేపట్టటం కష్టమేమీ కాదు.

కరోనాను అవకాశంగా తీసుకుని ఎంతోకొంత దూరవిద్యకు వెళ్లాలి. దూరవిద్య సమస్య డబ్బున్నవాళ్లకి పెద్ద ఉండదు. దాంతో వారికి విద్య బాగా అందుతుంది. లేనివాళ్లకి ఆ టెక్నాలజీ తతంగం కష్టమవుతుంది కాబట్టి దాని మీద దృష్టి పెట్టాలి. క్లస్టర్లు ఏర్పాటు చేసి.. వాటి మధ్య స్కూళ్ల ఆలనాపాలనా చేసే ఏర్పాటు చేయాలి. కస్టర్లలో ఉన్న స్కూళ్లను బాగు చేసేందుకు సమాజం మొత్తం భాగస్వాములయ్యేలా ప్రోత్సహించాలి. టెక్నాలజీ ఖర్చు ఉన్నకొద్దీ తగ్గుతోంది, సామర్థ్యం పెరుగుతోంది, దాన్ని ఉపయోగించి 20% దూరవిద్య అందాలి. మిగిలినది క్లాస్‌రూమ్‌లో అధ్యాపకుడి ద్వారా. అధ్యాపకుడు లేడన్న కారణంగా, అధ్యాపకుడికి ఆ సామర్థ్యం లేదన్న కారణంగా కాన్సెప్టుల విషయంలో పిల్లలు నష్టపోకూడదు. గత 100–200 ఏళ్లుగా మనకు విద్య అంటే ఒక ఒక రకం మూస. ఆ స్కూలు, క్లాస్‌రూమ్, బల్లలు, బ్లాక్‌బోర్డు, బెత్తం. అర్థమయ్యేట్లు చెబితే అదృష్టం. దాన్నుంచి బయటపడి పిల్లలు నేర్చుకుంటున్నారా లేదా, ప్రతి విద్యార్థినీ మానిటర్ చేయాలి. దానికి దూరవిద్య, టెక్నాలజీ అవసరం. పరీక్షల్ని సమూలంగా మార్చాలి. చదివే తరగతి స్థాయి తగ్గట్లు నేర్చుకోవటం, నేర్చుకున్నది ఉపయోగించటం పరీక్షించాలి. పేద తల్లిదండ్రుల మీద భారం తగ్గించాలి. ప్రభుత్వం ఎంత డబ్బు ఖర్చుచేసినా 50% కంటే ఎక్కువమంది విద్యార్థులు ప్రయివేటు స్కూళ్లకే వెళ్తున్నారు. ప్రమాణాలుంటే ప్రభుత్వమే 10,000 – 15,000 ట్యూషన్ ఫీజుని చెల్లించవచ్చు.. ఈ మూడూ కీలకమైనవి. అదీ ప్రభుత్వం మీద భారం పడకుండా.

కొద్దిపాటి ఖర్చు ట్యాబ్‌లు వగైరాల కోసం అవసరం కావచ్చు. దూరవిద్య మీద అది వన్‌టైమ్ వ్యయం. అదనపు భారం నామమాత్రం. పార్టీలకతీతంగా ఆలోచించాలి. సృజనాత్మకంగా. జనాభా తగ్గటం వల్ల పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్లు కూడా తగ్గుతున్నాయి. అందువల్ల ప్రభుత్వం మీద అదనపు భారాలుండవు. కరోనా వల్ల అందుకు ప్రయత్నం చేయాలి. మంచి ప్రమాణాలు గల చదువును అందించవచ్చు.

మనకు 65 లక్షల మంది విద్యార్థులుండగా, 3.5 – 4 లక్షల మంది దాకా ఉపాధ్యాయులున్నారు. 1:16. అదేపనిగా క్లాస్‌రూమ్‌లు పెంచనక్కర్లేదు. కొన్నిచోట్ల తప్ప. మనుగడ సాగించగలిగేలా హేతుబద్ధీకరిస్తే చాలు. పలు స్కూళ్లలో పిల్లలుంటే టీచర్లు లేరు, చాలా స్కూళ్లలో టీచర్లుంటే పిల్లలు బాగా తక్కువగా ఉన్నారు. దీన్ని హేతుబద్ధీకరిస్తే వచ్చే 2–3 ఏళ్లలో పెద్దమార్పుని తీసుకురావచ్చు. ఒక పేద సమాజంలో ఏ అడుగైనా ముందుకు పడటం కష్టం. అలాగని అక్కడే కూర్చుంటే అలాగే కొనసాగుతుంది. కంప్యూటర్లు, ఆన్‌లైన్ చౌకవుతున్నాయి.

ఆన్‌లైన్ చదువు అంటే.. క్లాస్‌రూమ్‌లో కూడా కాన్సెప్ట్‌లు పట్టుబడటానికి టెక్నాలజీని ఉపయోగించాలి. కొత్త టెక్నాలజీ పేదలకు ఎప్పుడూ నష్టం కాకూడదు. మనం పరీక్షల్ని ఒక మిలిటరీ ఆపరేషన్‌లా నిర్వహిస్తున్నాం. సంపన్న దేశాల్లో చదువు సమాజానికి సర్వస్వం, రాజకీయానికి కేంద్రబిందువు. మన దేశంలో దానికి ఇప్పుడు డబ్బు, టెక్నాలజీ సమస్య కాదు. కావలసిందల్లా చిత్తశుద్ధి, రాజకీయ సంకల్పం, సామర్థ్యం. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సర్వరోగనివారణి కాదు. క్లాస్‌రూమ్ టీచింగ్‌ని, ఆన్‌లైన్‌ని మిళితం చేయాలి. అది అంత తేలిక కాదు. కానీ క్లస్టర్ స్కూల్ వ్యవస్థలో అది అసాధ్యం కాదు. ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయుడి పాత్ర లేకపోవటమని కాదు. ఉపాధ్యాయుడి పాత్ర మారుతుంది, పెరుగుతుంది.

## ప్రజారోగ్యం - కరోనా:

# నిర్లక్ష్యమే కొంప ముంచింది

### ఏళ్లుగా కేంద్రంలోని ప్రభుత్వాలు వైద్య రంగాన్ని విస్మరించాయి
### ఏడాదికి రూ. లక్షన్నర కోట్లు వెచ్చించాలి
### రాష్ట్రాలను టీకాలు సమీకరించుకోమనటం కేంద్రం తప్పే
### 'ఈనాడు'తో లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



"అయిదారు దశాబ్దాలుగా కేంద్రంలోని ప్రభుత్వాల వైఫల్యాలను కరోనా ఎత్తిచూపింది. నిర్లక్ష్యమే కొంపముంచింది. పేలవమైన వైద్య వ్యవస్థలో లక్షల మంది మృత్యువాత పడ్డారు. ఓట్లు రాల్చే అంశాలపైనే ప్రభుత్వాలకు శ్రద్ధ. ప్రజలకు మేలు చేసే విధానాలు పట్టవు. బలమైన ఆరోగ్య వ్యవస్థ అవసరం. ఇందుకు ఏటా రూ.లక్షన్నర కోట్లు వెచ్చించాలి. జాతీయ ఆదాయంలో ఆరోగ్య రంగంపై చేస్తున్న ఖర్చు ఒక్క శాతమే. వ్యాక్సిన్ల విషయంలో జాతీయ విధానమే సరైనది. ఎన్నికల నిర్వహణలో వ్యూహాత్మకంగా వ్యవహరించకపోవటంలో ఎన్నికల సంఘాన్ని తప్పు పట్టాల్సిందే. చైనా విధానాలతో విసిగిన దేశాలను భారత్ ఆకర్షించాలి. అసంఘటిత రంగాన్ని ఆదుకునేందుకు పెద్దపీట వేయాలి" అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ 'ఈనాడు'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

**(?) దేశంలో ఇంతటి దయనీయ స్థితికి కారణాలు ఏమిటి**

**జేపీ:** దశాబ్దాలుగా మన ప్రభుత్వాలు వైద్యరంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశాయి. ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నాం. కుళాయి తిప్పితే నీళ్లు వచ్చినట్లుగా, స్విచ్ వేస్తే లైటు వెలిగినట్లుగా వైద్యం ఒక్కసారిగా అందుబాటులోకి రాదు. వ్యూహాత్మకంగా వైద్య రంగాన్ని పటిష్ఠం చేసుకుంటూ రావాలి.

**(?) కొవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో విఫలమయ్యామంటారా**

ఆరోగ్య వ్యవస్థ పటిష్ఠంగా లేకపోవటం, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టకపోవటం, వ్యాక్సిన్లను విస్తృతం చేయాలని తొమ్మిది నెలలుగా చెబుతున్నా పట్టించుకోకపోవటం కేంద్ర వైఫల్యాలనే చెప్పుకోవాలి. చైనాతో పోటీ పడాలని.. ప్రపంచ దేశాల మన్ననలు పొందాలన్న ఉద్దేశంతో, ఉత్పత్తి చేసిన ఆరు కోట్ల డోసులను ఇతర దేశాలకు పంచిపెట్టారు.

(?) ఈ పరిస్థితుల్లో నేర్చుకోవాల్సిన పాఠాలు ఏమిటి

వ్యాధి తీవ్రత ప్రబలకుండా చూడాలి. లాక్‌డౌన్ ఎక్కువకాలం కొనసాగించలేం. జాగ్రత్తలు పాటిస్తూనే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలి. రెస్టారెంట్లు, బార్లు, సినిమా థియేటర్లను మరికొంత కాలం మూసే ఉంచాలి. దేశంలో 18 ఏళ్లు దాటిన వారితో కలిపి 80 కోట్ల మంది ఉన్నారు. కనీసం 120 కోట్ల డోసులు ఆరు నెలల్లో ఉత్పత్తి చేయాలి. దేశంలో మరో రకమైన వైరస్ రాదని గ్యారంటీ లేదు. బ్రిటన్‌లో తాజాగా వచ్చిన కేసుల్లో ఎక్కువ బి-1617 రకమేనని ఆ దేశం ప్రకటించింది. దాన్ని దృష్టిలో పెట్టుకుని బూస్టర్ డోసులు సిద్ధం చేసుకోవాలి.

**(?) వైద్యం ప్రయివేటుపరం చేయటంతోనే ఈ పరిస్థితి వచ్చిందా**

నూటికి నూరుశాతం అదే కారణం. ప్రతి లక్షన్నర జనాభాను ఒక యూనిట్‌గా చేసి వ్యవస్థను పటిష్ఠం చేయాలి. వైద్య పట్టభద్రులకు ఉద్యోగాలు కాకుండా ప్రయివేటు ప్రాక్టీసు విధానాన్ని తీసుకురావాలి. డాక్టర్ వద్దకు వెళ్లినవారి సంఖ్య

ఆధారంగా ప్రభుత్వం ఫీజులు చెల్లించాలి. నెలకు కనీసం రూ.లక్ష వచ్చేలా ఆ విధానం ఉండాలి. దేశ జాతీయ ఆదాయంలో వైద్యానికి ఒక్క శాతం మనం ఖర్చు చేస్తుంటే ఇతర దేశాలు ఎనిమిది శాతం వెచ్చిస్తున్నాయి. నేను చెబుతున్నట్లు ఖర్చు చేసినా రెండు శాతం మించదు. ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను పటిష్ఠం చేయాలి. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భారత్ లాంటి పథకాలను మరింత విస్తృతం చేయాలి. జిల్లా, బోధనా ఆసుపత్రులను ఆధునిక పరికరాలతో సుసంపన్నం చేయాలి.

**(?) కొవిడ్ రెండో దశకు ఎన్నికలే కారణమన్న కోణాన్ని మీరు ఎలా చూస్తున్నారు**

ఎన్నికల సంఘాన్ని పూర్తిగా తప్పు పట్టాలి. కరోనా లేనట్లుగా ఎన్నికల సంఘాలు వ్యవహరించాయి. రాజకీయ పార్టీలూ భాగస్వాములే. బహిరంగ సభలను ఎన్నికల సంఘం ఎందుకు నిషేధించలేదు? అమెరికా ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ పద్ధతులను, పత్రికలను, సోషల్ మీడియాను వినియోగించుకున్నారు. ఇక్కడ అలాంటి ప్రయోగాలు ఎందుకు చేయలేదు? ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానాన్ని ఎందుకు అమలు చేయలేదు?

**(?) వైరస్ తీవ్రతను కేంద్ర ప్రభుత్వం అంచనా వేయలేకపోయిందా**

తొలిదశలో అతిగా స్పందించింది. ఎక్కువ కాలం ఆంక్షలు విధించింది భారతదేశమే. అద్భుతం చేద్దామన్న కుతూహలమే కారణం కావచ్చు. చైనా, న్యూజిలాండ్ తదితరాలు ఆంక్షలు విధించి విజయాలు సాధించాయి. మనదేశంలో పరిస్థితులు వేరు. పేదరికం, జనాభా, మూఢనమ్మకాలు తదితర పరిస్థితుల్లో కేవలం లాక్‌డౌన్‌తో కొవిడ్‌ను కట్టడి చేయాలని భావించటం ప్రభుత్వ పొరపాటే. 92 శాతం మంది ఉన్న అసంఘటిత రంగం తీవ్రంగా దెబ్బతింది. అనుకున్నంత భయాన్నీ సృష్టించలేకపోయింది. తొలిదశలో తీవ్రమైన స్ట్రెయిన్స్ మన దేశంలోకి రాలేదు. అప్పట్లో మన దేశంలో 1,200 మందిలో యాంటీబాడీలను పరీక్షించారు. 30 మందికి వ్యాధి సోకినట్లుగా గుర్తించారు. ఒకరు చనిపోయారు. ఈ గణాంకాలు ప్రపంచంలోకెల్లా మన దేశంలో అతి తక్కువ వ్యాధి సోకిందనడానికి ఉదాహరణ. రెండో దశ తీవ్రతను ఇటు ప్రభుత్వాలు, అటు సమాజం గుర్తించలేకపోయాయి.

**(?) కేంద్రం నియంత్రణతోనే వ్యాక్సిన్లు ఇవ్వలేకపోతున్నామన్న రాష్ట్రాల వాదనలు ఎంతవరకు సరైనవి**

వ్యాక్సిన్ల ఉత్పత్తి, సేకరణ కేంద్ర ప్రభుత్వమే చేయాలి. మా ఊళ్లో తయారవుతుంది కదా మాకు ప్రాధాన్యం ఇవ్వాలనటం సరైంది కాదు. సాంకేతికత, ఆర్థిక వనరులు, ప్రపంచ సమాజంతో సంబంధాలు కేంద్ర ప్రభుత్వానికే సాధ్యమవుతాయి. అయితే వ్యాక్సిన్లు సమీకరించుకోమని రాష్ట్రాలకు కేంద్రం చెప్పటం చాలా పొరపాటు ఆలోచన. కొన్ని రాష్ట్రాల్లో వైరస్ ప్రాథమిక దశలో ఉన్నప్పుడే కార్టికో స్టెరాయిడ్స్ వాడారు. కేంద్రం నుంచి వైద్యపరంగా సరైన ప్రొటోకాల్స్ రాకపోవడమే ఇందుకు కారణం. వాస్తవానికి సైటోకిన్‌స్టామ్ ఉన్నప్పుడు మాత్రమే వాటిని వాడాలి. ముందే వాడడం ప్రాణాంతకం.

**కొవిడ్ విషయంలో ప్రధానమంత్రి స్థాయిలో హెర్డ్ ఇమ్యూనిటీని నమ్ముకోవటం తప్పు. వ్యాక్సిన్ల అవసరం లేకుండా వైరస్‌ను ఎదుర్కొంటామని వ్యాఖ్యానించారంటే మనకు ఏమీ కాదులే అన్న భరోసానే. చివరకు ఏమైంది? ఆక్సిజన్, పడకల కొరత విషయంలోనూ అప్రమత్తం కాలేదు. ఫలితాన్ని చూస్తున్నాం.**

**మన దేశంలో వ్యాక్సిన్లు ఉత్పత్తి చేసే శక్తి ఉంది. ఇలాంటి అరుదైన సందర్భాల్లో ప్రభుత్వ పెట్టుబడులు అవసరం. మార్కెటింగ్‌లేక నష్టం వచ్చినా భరిస్తామని భరోసా ఇవ్వాలి. ఎన్ని రకాలుగా మొత్తుకున్నా ప్రభుత్వం సమయానికి, సానుకూలంగా స్పందించలేదు.**

**(?) ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే ఏయే రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలంటారు**

మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. అసంఘటిత రంగంలోని కార్మికులను ఆదుకోవాలి. వలస కార్మికులు ఏ స్థాయి ఇబ్బందులు పడ్డారో చూశాం. వారికి గృహవసతే కాదు ఉపాధి కూడా లేకపోవటంతో సొంతూళ్లకు తరలివెళ్లారు. ఆ ప్రభావం ఆర్థికరంగంపైనా పడింది. పట్టణ ప్రాంతాల్లో వారికి గృహనిర్మాణంతో కూడిన మౌలిక సదుపాయాలు కల్పించాలి. అసంఘటిత రంగంలోని వారి ఉపాధిని నిలపటం.. నైపుణ్యాన్ని పెంచటం ఎలా అన్నది ముఖ్యం.

**(?) ఉపాధి పెరగాలంటే పెట్టుబడుల ఆకర్షణకు ఉన్న అవకాశాలు ఏమిటి**

సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకోవాలి. చైనా విధానాలంటే చాలా దేశాలకు భయం పెరిగింది. ఆ దేశం నుంచి తమ పరిశ్రమలను తరలించాలని భావిస్తున్నాయి. ఈ పరిస్థితులను అందిపుచ్చుకోవాలి. ప్రతి రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలను గుర్తించి 20 వేల నుంచి 30 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాలను కల్పించి ప్రపంచాన్ని ఆకర్షించాలి. ఖాయిలా పడిన చిన్న పరిశ్రమలకు చేయూత ఇవ్వాలి. ఆరోగ్య రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అమెరికా, బ్రిటన్ దేశాల జనాభాలో రెండున్నర నుంచి మూడు శాతం మంది వైద్య రంగంలో పనిచేస్తున్నారు. భారత్‌లో అందులో పదోవంతు మందే ఉన్నారు. వైద్య రంగాన్ని వృద్ధి చేస్తే నాలుగైదు రెట్లు ఉపాధి పెరుగుతుంది. ✦

# 2,29,779.77 కోట్లతో ఆంధ్రప్రదేశ్ బడ్జెట్



కొవిడ్-19 వల్ల ఆదాయం తగ్గినా, యూనియన్ ప్రభుత్వం నుంచి నిధులు తగ్గినా, అప్పుల మీద భరోసాతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2021-22 బడ్జెట్‌ను రూ.2,29,779.77 కోట్లతో ప్రవేశపెట్టింది. ఇందులో నవరత్నాల్లో వివిధ పథకాల కింద లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీకి తగినన్ని నిధుల్ని కేటాయించటంతోపాటు మహిళలకు, పిల్లలకు కేటాయింపుల్ని ప్రత్యేకంగా చూపారు. మహిళల అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేకంగా రూ.47,283.21 కోట్లు కేటాయించారు. చిన్నారుల కోసం రూ.16,748.47 కోట్లు చూపారు. కొత్తగా మైనారిటీలకు యాక్షన్ ప్లాన్ పేరుతో రూ.3,840.72 కోట్ల కేటాయింపు చేశారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్‌ను రూ.31,256.36 కోట్లతో ప్రవేశపెట్టారు.

మొత్తం బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.1,82,196.54 కోట్లు. రుణాల చెల్లింపులతో కలిపి క్యాపిటల్ వ్యయం రూ.47,582.73 కోట్లు అని బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెడుతూ రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పేర్కొన్నారు. రెవెన్యూ ఆదాయం రూ.1,77,196.48 కోట్లు కాగా, యూనియన్ పన్నుల్లో వాటా రూ.26,935.32 కోట్లు. యూనియన్ గ్రాంట్ల రూపంలో రూ.57,930.62 కోట్లు వస్తాయని చెప్పారు. రెవెన్యూ లోటు రూ.5000.05 కోట్లు కాగా, ద్రవ్యలోటు రూ.37,029.79 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు.

### ఏపీ బడ్జెట్‌లో కొన్ని పథకాలకు కేటాయించిన నిధులు (రూ. కోట్లలో)..

**ఈబీసీ నేస్తం: 500 ; వైఎస్సార్ పెన్షన్ కానుక: 17,000, వైఎస్సార్ ఆసరా: 6,337 ; అమ్మ ఒడి: 6,107.36, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు వైఎస్సార్ చేయూత: 4,455 ; విద్యారంగం: 24,624, వైద్యం: 13,830; కాపు సంక్షేమం: 3,306, ఈబీసీ సంక్షేమం: 5,478; గృహ నిర్మాణం: 5,661.57, సాగునీటి రంగం: 13,237**

## ఏపీ తలసరి ఆదాయం రూ.1,70,215

కరోనా కష్టకాలంలోనూ 2020-21 రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 1.58 శాతం వృద్ధి నమోదైందని సామాజిక సర్వే తెలిపింది. రాష్ట్ర తలసరి ఆదాయంలో కూడా రూ.1735 పెరుగుదల నమోదైందని పేర్కొంది. 2019-20లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,68,480 ఉండగా, 2020-21లో రూ.1,70,215గా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ 2020-21 సామాజిక సర్వేను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఇందులోని మరికొన్ని ముఖ్యాంశాలు:

- లాక్‌డౌన్, కర్ఫ్యూలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పెద్దఎత్తున సాయం అందించింది.
- పది లక్షల జనాభాకు దేశంలో సగటున 2.2 లక్షల మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా రాష్ట్రంలో సగటున 3.3 లక్షల మందికి పరీక్షలు జరిగాయి.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.1902.35 కోట్ల వ్యయంతో 5,33,670 మందికి ఉచితంగా వైద్య చికిత్సలు.
- వైఎస్సార్ ఆసరా ద్వారా 87,74,674 మంది స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు రూ.6,792.21 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ.
- రాష్ట్రంలో అక్షరాస్యతా రేటు జాతీయ సగటు కన్నా తక్కువగా ఉంది. జాతీయ సగటు 72.98 శాతం కాగా, రాష్ట్రంలో 67.35 శాతంగా ఉంది.
- దేశీయ ఎస్‌డీజీఎస్ (సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు) ర్యాంకుల్లో 2018లో రాష్ట్రం నాలుగో స్థానంలో ఉండగా, 2019లో మూడో స్థానానికి వచ్చింది.
- వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు.
- రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కర్నూలు ఓర్వకల్లులో నిర్మించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయంలో కార్యకలాపాలు ప్రారంభం
- మచిలీపట్నం, రామాయపట్నం, భావనపాడు, కాకినాడ సెజ్‌లలో నాలుగు నాన్ మేజర్ పోర్టుల నిర్మాణ పనులు.

# కరోనా కాలంలో కాడిపారేసిన రాజకీయ నేతలు



విజయనగరం జిల్లాలో కరోనా విరుచుకుపడి విలయతాండవం చేస్తుంటే అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్షం రాజకీయ ప్రయోజనాల మీదే దృష్టి పెట్టాయి తప్ప ప్రజల గురించి ఆలోచించలేదని అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఆరోపించాయి. కొవిడ్ పరిణామాలపై లోక్‌సత్తా జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, జనసేన, ప్రజాసంఘాలు పాల్గొన్నాయి. లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, కొవిడ్‌పై జిల్లా నాయకులంతా చేతులెత్తేశారన్నారు. గిరిజన ప్రజానీకం పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. దిక్కులేని మరణాలకు రాజకీయం వైఫల్యమే ప్రధాన కారణమన్నారు. లోక్‌సత్తా ఎన్నిసార్లు హెచ్చరించినా ప్రజారోగ్యాన్ని పటిష్ఠం చేయలేదన్నారు. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన నేతలున్న జిల్లాలో ప్రజలకు ఆరోగ్యంపై భరోసా లేకపోవటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకర సతీష్ మాట్లాడుతూ, కొవిడ్ ఏర్పాట్లలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని అన్నారు. జిల్లాలో తలాతోకాలేని పాలన కొనసాగుతోందని, ఆరోగ్య సమస్యలపై ఎవరికి చెప్పుకోవాలో ప్రజలకు అర్థం కావటం లేదని బీజేపీ నేత కొండల శ్రీనివాసరావు అన్నారు. బీఎస్పీ నేత బిలాల్ అహ్మద్ మాట్లాడుతూ, కరోనా పేరుతో కొన్ని ప్రయివేటు ఆస్పత్రులు అడ్డగోలుగా దోచుకున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మరణాలపై తప్పుడు లెక్కలు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం చేయాల్సిన పనుల్ని స్వచ్ఛంద సంస్థలు చేస్తున్నాయని, మరి ప్రభుత్వం ఇంకెందుకని జనసేన సీనియర్ నాయకుడు త్యాడా రామకృష్ణ (బాలు) అన్నారు. యథా రాజా అన్నట్లుగా అధికారులు వ్యవహరించటం వల్ల కరోనా రోగులు, వారి కుటుంబ సభ్యులు పడ్డ అవస్థలు చూసి గుండె తరుక్కుపోతోందని ప్రజాసంఘాల ప్రతినిధులు చోడి ఆదినారాయణ, తిరుపతిరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్యంలో పాలనా వ్యవస్థ వైఫల్యం వల్ల అనేకమంది జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు.

**ఎట్టకేలకు కలసికట్టుగా ప్రభుత్వ వైద్య కళాశాలను సాధించుకున్నాం**

విజయనగరం జిల్లాకి ప్రభుత్వ వైద్య కళాశాల కావాలని లోక్‌సత్తా ఉద్యమించిందని, ఎట్టకేలకు జిల్లాలో కళాశాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయటం అభినందనీయమని భీశెట్టి బాబ్జీ అన్నారు. అయితే ఈ కార్యక్రమానికి ఎవరినీ ఆహ్వానించకుండా అధికార పార్టీ సొంత కార్యక్రమంలా చేయటం మంచి సంస్కృతి కాదన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల కోసం లోక్‌సత్తా మొదలుపెట్టిన పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ సంఘాలు కూడా మద్దతిచ్చాయని, ఈ పోరాటం అందరి సహకారంతోనే విజయవంతమైందని గుర్తుచేశారు. జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురజాడ ఇంటిలో ఆయనకు ఘననివాళు లర్పించారు.



**2017లో శ్రీకాకుళం పర్యటనలో కథానిలయాన్ని సందర్శించిన సందర్భంగా కాళీపట్నం రామారావుతో జేపీ, రామ్మోహనరావు, బాబ్జీ**

### మన అంతరంగాన్ని స్పృశించిన

# అరుదైన కథకుడు

కాళీపట్నం రామారావు (కారా) మృతి తెలుగు సాహిత్యానికి పెద్ద లోటని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా|| జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆయన మన అంతరంగాన్ని స్పృశించిన అరుదైన కథకుడన్నారు. 1910 నుంచి వచ్చిన కథల్ని 'కథానిలయం'గా పొందుపరచటంలో ఆయన చేసిన కృషి ఎన్నటికీ చెరిగిపోదన్నారు. కారా మాష్టారికి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బందారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ కూడా నివాళులర్పించారు.

# యువ భారత్‌కీ మార్గం చూపే ప్రజా జీవితం

బరాక్ ఒబామా అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నప్పుడు 2007లో ఆయన గురించి తెలుగులో పాప్యులర్ మీడియాలో మొట్టమొదట ప్రచురితమైన వ్యాసం బహుశా ఈ రచయితదే. లోక్‌సత్తా భావజాల అభిమానిగా 'అరె, ఈయనెవరో లోక్‌సత్తా తరహాలో కొత్త రాజకీయం చేస్తున్నాడే, ఈయన పంథా, భావాలు లోక్‌సత్తా మార్గంలోనే ఉన్నాయే' అని గుర్తించి, అదే విషయాన్ని వెంటనే ఓ చిన్న వ్యాసంలా రాసి ఓ ప్రముఖ తెలుగు దినపత్రికకి పంపటం జరిగింది. దాన్ని వారు జాప్యం లేకుండానే ప్రచురించి ప్రోత్సహించారు.

యువత ప్రయోజనాలు, సమాజాన్ని విడగొట్టటం కాకుండా కలపటం, పరస్పర విరుద్ధమైన ప్రయోజనాలను సైతం సమన్వయం చేయటం, సామాన్య ప్రజల నుంచి కూడా విరాళాలు, వలంటీర్లుగా ప్రజలను పార్టీలో భాగస్వాముల్ని చేస్తూ వారి సేవలను వినియోగించటం, చిన్న చిన్న సమూహాలనుద్దేశించి ప్రసంగాలుండేలా ఎక్కువ సభల నిర్వహణ, ఈ మొత్తంలో సాంకేతికతను గరిష్ఠంగా వినియోగించటం వంటి అంశాలను అప్పటికే తెలుగుగడ్డ కార్యక్షేత్రంగా భారత్‌లో లోక్‌సత్తా పార్టీ ఆచరణలో చూపుతోంది. వీటినే బరాక్ తన అధ్యక్ష ఎన్నికలలో 'మార్పు' నినాదంతో అమలు చేస్తూ అమెరికా ప్రజల్ని ఆకట్టుకుంటున్నారు. క్రమంగా మరింత సూక్ష్మ విశ్లేషణతో ఒబామా ఎన్నికల ప్రచారంలో వినూత్నత గురించి తెలుగులో వ్యాసాలు, విశ్లేషణలు వెలువడ్డాయి. డెమోక్రాటిక్ పార్టీ ప్రైమరీలో హిల్లరీ క్లింటన్‌పై ఒబామా విజయం తర్వాత మన దేశవ్యాప్తంగా కూడా విశ్లేషణలు, చర్చలు మరింత ఊపందుకున్నాయి. 2008 నవంబర్‌లో అమెరికా అధ్యక్షుడిగా ఒబామా ఘనవిజయం సాధించిన రోజున భారత్‌లోని జాతీయ పార్టీలతోపాటు దాదాపు అన్ని ప్రాంతీయ పార్టీల నాయకులు కూడా అభినందన సందేశాలు చెప్పారు. బరాక్ విజయంపై భారత్‌లో కొత్త రాజకీయానికి నాంది పలికిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్పందనను తెలుసుకునేందుకు మీడియా కూడా చాలా ఆసక్తిని ప్రదర్శించింది.

కేవలం 4-5 ఏళ్లలో యావత్ దేశం దృష్టినీ ఆకర్షించి ఏకంగా ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించగల అవకాశాన్ని ఒబామాకు ఆ దేశంలో ఒక ప్రధాన రాజకీయ పార్టీ అందించగా, ప్రజలు కూడా ఓటుతో మద్దతిచ్చి గెలిపించారు. కానీ అదే సమయంలో మన దేశంలో తెలుగునాట 2009 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో లోక్‌సత్తా తరపున పార్టీ వ్యవస్థాపకుడు జేపీని తప్ప ఎవరినీ ప్రజలు గెలిపించలేదు. ఒబామాను రెండోసారి కూడా 2012లో ఆ దేశ ప్రజలు గెలిపించగా, 2014 ఎన్నికల్లో తెలుగు ప్రజలు.. తమ జీవితాల కన్నా కూడా రాష్ట్ర విభజన రాజకీయాలు ముఖ్యమనుకుని లోక్‌సత్తాను ఒక్క స్థానంలో కూడా గెలిపించలేదు.

తన కొత్త రాజకీయం, అమెరికా అధ్యక్షుడిగా తన పదవీ కాలం గురించి బరాక్ ఒబామా 'ఏ ప్రామిస్డ్ ల్యాండ్' పేరుతో ఒక పుస్తకాన్ని వెలువరించిన సంగతి తెలిసిందే. సుమారు 500 పేజీల్లో పుస్తకాన్ని ముగించాలని బరాక్ భావించగా, చివరికి అది రెండు వాల్యూములుగా తయారైంది. వివిధ చిత్రాలు, రిఫరెన్సలతో కలిపి మొదటి భాగం 902 పేజీలైంది. 'ఏ ప్రామిస్డ్ ల్యాండ్' అమ్మకాల్లో కూడా కొత్త రికార్డులు నెలకొల్పింది. ఒబామాకు భారీ ఆదాయాన్నిచ్చింది (నిజానికి ఒబామాకు ఆదాయం పెద్ద మొత్తంలో వచ్చింది పుస్తకాల ద్వారానే అంటే అతిశయోక్తి కాదు). ఈ పుస్తకంలోని భావాలు, వాటి వెనుక ఘటనలు, ఆ భావాల్ని ముందుకు తీసుకెళ్లిన రాజకీయం.. ఇవన్నీ నేటి భారతీయ యువ కూడా తెలుసుకోవలసిన, ఆలోచించాల్సిన, తమ ఆచరణల్లో భాగం చేసుకోవాల్సినవి. లేకుంటే మన దేశంలో లోక్‌సత్తా అవసరమే వచ్చేది కాదు.




మంచి పాలన, దానికి మూలమైన మంచి రాజకీయం, నాయకత్వం లేకుంటే ఏం జరుగుతుందో తాజాగా కొవిడ్-19 మనందరికీ స్పష్టంగా తెలియజెప్పింది. రాజకీయం, పాలన కేవలం నాయకులకు వదిలేయాల్సిన విషయాలు కావు అని తెలిసొచ్చింది. మనలోని గందరగోళాల్ని తొలగించి మనకు మార్గదర్శనం చేసేందుకు దోహదపడతాయి కాబట్టే.. 'ఏ ప్రామిస్డ్ ల్యాండ్' పుస్తకంలోని కొన్ని అంశాలను ప్రస్తావించే ప్రయత్నం ఇది. ఈ పుస్తకం గురించి ప్రపంచవ్యాప్తంగా అనేక సమీక్షలు ఇప్పటికే వచ్చాయి. వాటిలో ఎక్కువ అధ్యక్షుడిగా ఒబామా వ్యవహారశైలి, నిర్ణయాలు, ప్రపంచ నేతలపై బరాక్ ఏమన్నారు వంటి కోణాల్లో వచ్చాయి. కానీ మేకింగ్ ఆఫ్ ఒబామా, ఎస్సెన్స్ ఆఫ్ ఒబామా న్యూ పాలిటిక్స్‌కు మాత్రమే పరిమితం కావాలన్నది ఇక్కడ ప్రయత్నం. అమెరికా అధ్యక్షుడిగా ఎనిమిదేళ్లలో ఒబామా ఏ మేరకు విజయం సాధించారు అనే అంశాన్ని ముగింపులో క్లుప్తంగా మాత్రమే ప్రస్తావిస్తూ, మన దేశంలో మార్పుకి అవసరమైన ఒబామా కొత్త రాజకీయం, అందుకోసం ఆయన ప్రయత్నం గురించి ఎక్కువ వివరంగా చెప్పడం జరిగింది. అందుకు వైట్‌హౌస్ బయట ఒబామా ఉన్న అధ్యాయాలనే ఎక్కువగా ప్రస్తావించటం జరిగింది. 'ఏ ప్రామిస్డ్ ల్యాండ్' ఒబామా ఆత్మకథే అయినప్పటికీ ఎక్కువగా థర్డ్ పర్సన్‌లో మాత్రమే ఈ వ్యాసం అందిస్తున్నాం. మరీ అవసరమనుకున్న సందర్భాల్లోనే పుస్తకంలోని వాక్యాలను నేరుగా కోట్ చేయటం జరిగింది.

**'ఏ ప్రామిస్డ్ ల్యాండ్'లో కొన్ని అధ్యాయాల నుండి ఎంపిక చేసిన భాగాల స్వేచ్ఛానుసరణతో ఓ రిపోర్టు..**

అవే విలువలు, అవే ఆశలు, అవే కలలు! ఇల్లినాయిస్ రాష్ట్రంలో నేను ప్రాతినిధ్యం వహిస్తున్న చికాగో డిస్ట్రిక్ట్ వెలుపల కూడా. మా అమ్మమ్మ తాతయ్య, మా అమ్మ, నా భార్య మిషేల్ రాబిన్‌సన్ తల్లిదండ్రుల్లో కనిపించిన విలువలు, ఆకాంక్షలే నాకు అక్కడి ప్రజల్లోనూ కనిపించాయి. చికాగో డిస్ట్రిక్ట్ నుంచి ఇల్లినాయిస్ సెనెట్‌కు ఎన్నికయ్యాక ప్రతి వేసవిలో ఇతర డిస్ట్రిక్ట్‌లలో సహచరులు, ప్రజల మధ్య గడిపేందుకు సరదా

పర్యటలను చేయటం ఆనవాయితీగా పెట్టుకున్నాను. డేన్ షొమన్ అనే యూపీఐ మాజీ రిపోర్టర్ నాకు కీలక రాజకీయ సలహాదారుగా ఉండేవాడు. నాకు మంచి స్నేహితుడు కూడా. ఆయన నా పర్యటనల్లో కూడా ఉండేవాడు. రోడ్డు ప్రయాణంలో ఉండదగ్గ సహచరుడు డేన్. ప్రయత్నం లేకుండానే గలగలా మాట్లాడతాడు, మనం మౌనాన్ని కోరుకుంటున్నప్పుడు అందుకు తగ్గట్లు నిశ్శబ్దంగానూ ఉండగలడు.

చికాగో డిస్ట్రిక్ట్ బయట నా ప్రయాణం పట్ల మొదట్లో అతను కొంత సంశయించాడు. ఒక నల్లజాతి లాయర్‌ని చూసి ఇతర ప్రాంతాల్లో ప్రజలు ఎలా ప్రతిస్పందిస్తారోనని భయపడ్డాడు. పైగా అరబ్‌ల తరహా పేరు నాది. అందుకే డ్రస్ దగ్గర్నుంచి కొన్ని హెచ్చరికలు చేశాడు. అన్ని జాగ్రత్తలకూ నేను భరోసా ఇచ్చాక మా ట్రిప్ మొదలైంది. కానీ మా ప్రయాణం మొదలయ్యాక, కొనసాగుతున్నకొద్దీ డేన్ భయాలు ఊహాగానాలు మాత్రమేనని తేలింది. ప్రతి చోటా నాకు సుపరిచితం, ప్రతి ఒక్కరి మధ్యా చిరపరిచితం అనిపించింది. ప్రజలు తమ కుటుంబాల్ని, ఉద్యోగాల్ని వర్ణించిన తీరు, వారి వినమ్రత, ఆతిథ్యం, హైస్కూలు బాస్కెట్ బాల్ పట్ల వారి ఉత్సుకత, భోజనంలో వారి వడ్డనలు అన్నీ నాకు మా ప్రాంతంలో ఉన్నట్లే, మా కుటుంబ సభ్యులు, మిషేల్ కుటుంబ సభ్యుల మధ్య ఉన్నట్లే అనిపించాయి. మా పిల్లలు పుట్టాక, ఈ విహారయాత్రలు మరింత ఎక్కువయ్యాయి.

కానీ పర్యటనల్లో నాకు ప్రతిసారీ కనిపించిన సందేశం, అనిపించిన అనుభూతి మాత్రం నాలో బలంగా ముద్రితమై కొనసాగుతూ వచ్చాయి. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న చికాగో జిల్లా, మిగిలిన రాష్ట్రం (డౌన్‌స్టేట్) వేర్వేరుగా ఉన్నంత వరకూ, ఒకరికొకరు అపరిచితుల్లా ఉన్నంతవరకూ, మన రాజకీయాలు నిజంగా ఎప్పటికీ మారవు అని నేను గుర్తించాను. నల్లవారికి వ్యతిరేకంగా తెల్లవారిని .. గ్రామీణులకు వ్యతిరేకంగా పట్టణవాసుల్ని రెచ్చగొట్టి మోహరించే సాంప్రదాయ రాజకీయాలే కొనసాగుతాయి. అమెరికా ఎంతో విభజితమై ఉంది అనే అంచనాల చుట్టూ ఆనవాయితీగా సాగే రాజకీయ ధోరణుల్ని సవాలు చేసే ప్రచారాన్ని గనక ప్రారంభించగలిగితే దేశ పౌరుల మధ్య ఓ నూతన వారధిని నిర్మించటం సాధ్యం కావచ్చు. స్థానికతను ఆసరాగా చేసుకొని ఒకరి మీద ఇంకొకరిని ఉసిగొల్పే విద్వేషాలకు స్వస్తి పలకొచ్చు. శాసనసభ్యులు కూడా తమ నియోజకవర్గాల ప్రయోజనాల్ని, తమ సొంత ప్రయోజనాల్ని మరీ అంత సంకుచితంగా నిర్వచించాల్సిన ఆగత్యం ఉండదు. మీడియా కూడా.. ఎవరు గెలిచారు, ఎవరు ఓడారు అనే కోణం నుంచి కాకుండా.. మన ఉమ్మడి లక్ష్యాలు నెరవేరాయా, లేదా అనే కోణంలో విషయాల్ని గుర్తించటం, పరిశీలించటం ప్రారంభించవచ్చు. అంతిమంగా, ఇదే కదా నా లక్ష్యం. అమెరికాలోని వర్ణ, తెగ, మత విభజనల్ని, నా జీవితంలోని అనేక చేదు అనుభవాల్ని అధిగమించే రాజకీయాన్ని నిర్మించటమే గదా నా లక్ష్యం!

కానీ ఆలోచిస్తున్న కొద్దీ నాకొక విషయం స్పష్టమవుతూ వచ్చింది. నేను కలలుగంటున్న ఇటువంటి సయోధ్య రాజకీయాలు (బ్రిడ్జి బిల్డింగ్ పాలిటిక్స్) సాధ్యం కావాలంటే, రాష్ట్రంలో ప్రతినిధుల సభకు ఎన్నికవటం ద్వారా సాధ్యం కాదు. సమస్య వ్యవస్థాగతమైనది! డిస్ట్రిక్ట్‌ల సరిహద్దుల్ని కూడా తెల్లవాళ్లు, నల్లవాళ్లు వేరన్నట్లు, ఎవరి నియోజకవర్గాలు వారివన్నట్లు, ఓ తరహావారి గెలుపునకు అనుకూలంగా గీశారు. ఉదాహరణకు నేను ప్రాతినిధ్యం వహిస్తున్న డిస్ట్రిక్ట్‌లో నల్లవారు ఎక్కువ ఉంటారు. సుదీర్ఘకాలంగా వివక్ష, అణచివేతకు గురైన ఈ కమ్యూనిటీల్లో రాజకీయ నాయకులు వర్ణం కోణంలోనే సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. అలాగే శ్వేత జాతీయులు, గ్రామీణులు ఎక్కువగా ఉండే వెనుకబడిన జిల్లాల్లో కూడా. మమ్మల్ని ఉపయోగించుకుని ఎదిగి, మమ్మల్నే చిన్నచూపు చూస్తే వాళ్లతో మీరు ఎలా వ్యవహరిస్తారు.. అనే ప్రశ్న వారందరి నుంచి ఎదురవుతుంటుంది. అటువంటి సంకుచిత రాజకీయంలో ప్రతినిధిగా ఎన్నికైతే, మహా అయితే కొంత సీనియారిటీ ద్వారా నియోజకవర్గ ప్రజలకు కొంత సేవ చేయవచ్చు. మిత్రులతో కలిసి జాతీయ స్థాయి చర్చను ప్రభావితం చేసే ప్రయత్నం చేయవచ్చు. కానీ ఆరోగ్య సంరక్షణ అవసరం ఎంతగానో ఉన్నవారికి దాన్ని అందనీయకుండా చేసే, పేద పిల్లలకు మెరుగైన స్కూళ్లు, లేనివారికి ఉపాధి అవకాశాలు అందనీయకుండా చేసే రాజకీయాన్ని, అవరోధాల్ని తొలగించటానికి అది సరిపోదు. మొత్తం వ్యవస్థని కదిలించాలంటే, నేను ఎంత ఎక్కువమందితో, ఎంత విశాల వేదిక మీద మాట్లాడగలిగితే అంత మంచిది అని అర్థమైంది. అందుకు అత్యుత్తమ మార్గం రాష్ట్రస్థాయి ఎన్నికలలో పోటీ చేయాలి. ఉదాహరణకు అమెరికా దేశ సెనెట్‌లో ప్రాతినిధ్యం పొందాలి.

... చికాగో డిస్ట్రిక్ట్ నుంచి ఇల్లినాయిస్ రాష్ట్ర సెనెట్‌కు ఎన్నికయ్యాక (1997) అంతకంటే ఉన్నత పదవిని పొందాలనే ఉద్దేశంతో జాతీయ ప్రతినిధుల సభ (కాంగ్రెస్)కి ఇల్లినాయిస్ వేరే డిస్ట్రిక్ట్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కొన్నాళ్ల తర్వాత ఒబామాలో కలిగిన ఆలోచనలివి.

అయితే ఈ రకంగా ఆలోచనలు ఒక కొలిక్కి రావటానికి ముందు అమెరికా జాతీయ ప్రతినిధుల సభకు పోటీ చేసి ఓడిపోయిన తర్వాత ఒబామాలో పెద్ద అంతర్మథనమే జరిగింది. తనకు ఇష్టం లేకపోయినా ఒబామా ప్రగాఢ ఆకాంక్ష కావటంతో ఇల్లినాయిస్ రాష్ట్ర సెనెట్‌కు పోటీ చేయటానికి ఆమోదం తెలిపిన మిషేల్ ఆ పని భారం వల్ల ఇంటి బాధ్యతల నుంచి ఒబామా దూరమవటం పట్ల తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. తమ రాష్ట్ర సెనెటర్ ఎవరో చాలామంది నియోజకవర్గ ప్రజలకే తెలియని అప్రాధాన్య ప్రాతినిధ్యం అది. తనకున్న తపనతో, సత్సంబంధాలతో, పరిజ్ఞానం, నైపుణ్యంతో ఉన్నంతలో ప్రజలకు మేలు చేసేందుకు వీలున్నంత మేర చట్టాలకు మెరుగులు దిద్దటం వంటి పద్ధతుల్ని అనుసరిస్తూ బరాక్ ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మిషేల్‌కి, ఒబామాకి మధ్య వాదోపవాదాలు పెరిగాయి. 'మొత్తం పనంతా నేనే చేస్తున్నట్లుంది' అని ఒక రోజు మిషేల్ అన్న మాటలు ఒబామాను బాధించాయి. రాత్రి భోజనం తర్వాత తాను వంటగదిని శుభ్రం చేయకపోవటానికి – ప్రజల కోసం పని చేయాల్సిరావటమే కారణమని చెబుతూ ఎదురుదాడికి దిగారు. కానీ అది వంకలాగే అనిపించింది. మొదట్లో తానిచ్చిన మాటను తానే నిలబెట్టుకోలేకపోతున్నాననే బాధ ఒబామాను మరీ ఎక్కువగా వేధించింది. తానెవరో తన పిల్లలకు తెలియాలని, తన ప్రేమను ఆస్వాదిస్తూ వారు పెరగాలని, తండ్రి తమకు ఎప్పుడూ తొలి ప్రాధాన్యతనిచ్చాననే భావంతో వారు ఎదగాలని స్వయంగా తానే చెప్పుకున్న మాటల్ని ఆచరణలో చేసి చూపలేకపోతున్నాననే బాధ కలిగింది. ఆ వాదన జరిగిన తర్వాత మిషేల్‌లోని కోపం విచారంగా మారింది. "అంత కష్టపడాల్సిన పనా అది?" అని ఒబామా ప్రాతినిధ్యం గురించి అన్నారామె. కష్టం ఎక్కువ, ఫలితం తక్కువ అని తన పని గురించి తన మనసులో కూడా అనిపిస్తున్నా పైకి చెప్పలేక దాటవేశారు బరాక్. ఇంత జరిగాక కూడా, తాను ఆత్మపరిశీలన చేసుకోకుండా– తన కొత్త రాజకీయంతో రాష్ట్ర సెనెటర్‌గా స్ప్రింగ్‌ఫీల్డ్ (ఇల్లినాయిస్ రాజధాని)లో ప్రత్యేకించి తెస్తున్న మార్పు ఏదీ లేని సందర్భంలో– రాష్ట్రం నుంచి కాంగ్రెస్ సభకు వెళ్లాలని ప్రయత్నించటం పెద్ద తప్పిదంగా ఒబామా గుర్తించారు. ఆ తర్వాత మరో భంగపాటు జరిగింది. స్వయంకృతాపరాధం లాంటి ఓటమి బాధతో కుంగిపోతున్న ఒబామాకు ఊరటనిచ్చేందుకు 2000 సంవత్సరంలో లాస్‌ఏంజెల్స్‌లో జరగనున్న డెమోక్రాటిక్ పార్టీ జాతీయ సదస్సుకు వెళ్దామని ఓ మిత్రుడు ఆహ్వానించాడు. అతని బలవంతం మేరకు బయల్దేరిన ఒబామాకు అక్కడ చేదు అనుభవం ఎదురైంది. సదస్సు వేదిక వద్దకు రావటానికి ఒబామాను అనుమతించలేదు. బయట ఏర్పాటు చేసిన టీవీల వద్ద కార్యక్రమాన్ని వీక్షిస్తూ నిలుచున్నాడు. తనను లోపలికి తీసుకెళ్లే పలుకుబడి మిత్రుడికి లేకపోవటం, సొంతంగా అంత పలుకుబడి తనకు లేకపోవటంతో ఒబామా వెనక్కి మళ్లాల్సి వచ్చింది. విమానంలో తిరిగి చికాగో వస్తున్నప్పుడు ఒబామా తనలో తాను మౌనంగా విలపించారు. చుట్టూ చీకటి అలముకున్న భావన ఆవరించింది. కాంగ్రెస్ ఎన్నికలో ఓటమి, తన వివాహ జీవితంలో

కలతలు, చివరికి ఓ మిత్రుడి నిర్వాకంతో పార్టీ సభ వద్ద పరాభవం.. ఇవన్నీ బరాక్ మనసులో ముప్పిరిగొన్నాయి. పొరపాటు మార్గంలోకి ప్రవేశించానా అని జీవితంలో తొలిసారి తనను తాను నిందించుకున్నారు. కొండల్లా తనలో ఉన్నాయనుకునే ఆత్మవిశ్వాసం, నిబ్బరం అన్నీ కరిగిపోయినట్లనిపించింది. ప్రపంచాన్ని మార్చాలనే నిస్వార్థ కల కోసం తాను కాంగ్రెస్‌కు పోటీ చేయాలనుకున్నాడా, లేక అప్పటికే ఏర్పరచుకున్న ఊహలకనుగుణంగా తన అహాన్ని సంతృప్తి పరచటం కోసం, తనకు లేనిది ఇతరులు సాధించారనే అసూయ వల్ల చేశాడా అని అంతరాత్మ సతాయించింది. ఆ తర్వాత రెండు మూడేళ్లు గడిచాయి. పెద్ద కూతురు మాలియాకు తోడు రెండో కూతురు సాషా పుట్టింది. పరిస్థితులు కొంత కుదుటపడ్డాక ఒబామాలో ఆత్మవిశ్వాసం తిరిగి కుదురుకోసాగింది. ఏవైతే తనకు శాపాలని కుమిలిపోయాడో అవన్నీ ఇప్పుడు ఆయనకు ఆశీస్సులుగా కనిపించసాగాయి. ఆలోచనలు ఒక కొలిక్కివచ్చాయి. ఇల్లినాయిస్ రాష్ట్రం నుంచి అమెరికా సెనెట్‌కు పోటీ చేయాలనే కొత్త ఉత్సాహం ఒబామాలో ప్రవేశించింది.

...

ఇల్లినాయిస్ సెనెట్ నుంచి అమెరికా సెనెట్‌కు ఒబామా పోటీ గురించి మాట్లాడుకునేముందు.. విభజనతో కాకుండా సమన్వయంతో, ప్రజల బలహీనతల్ని కాకుండా వారిలోని బలాల్ని ప్రేరేపించి గెలవాలనే నూతన రాజకీయ సంస్కృతికి ఆయనలో బీజం పడ్డ వైనాన్ని ఒకింత పరిశీలించాలి. ఈ వివరాల్ని బరాక్ పుస్తకం తొలి పేజీల్లోనే అందించారు.

తాతయ్య, అమ్మమ్మలను పరిచయం చేయటంతో తన బాల్యాన్ని వివరించటం ప్రారంభించారు బరాక్. 1960లో వాళ్లు హవాయికి వచ్చి సెటిలయ్యారు. అక్కడే ఒబామా ఆఫ్రికన్ – అమెరికన్ నేపథ్యమున్న బిడ్డగా జన్మించారు. తండ్రి కెన్యాకు చెందిన ప్రభుత్వోద్యోగిగా హవాయికి వచ్చినట్లు చెప్పారు. కొన్ని ఉత్తరాల ప్రస్తావన తప్ప పెద్దగా తండ్రిని గురించిన వివరాలివ్వలేదు. కానీ తాత, అమ్మమ్మ, తల్లి యాన్ డన్‌హామ్ గురించి మాత్రం గుండెలోతుల్లో నుంచి చెప్పారు. తన అమ్మమ్మ తాతయ్యలకు రాజకీయ నేపథ్యం లేకపోయినా రాజకీయాల పట్ల అవగాహన ఉండేదని, పత్రికల్ని చదివేవారని, వార్తల్ని తెలుసుకుంటూ ఉండేవారని చెప్పారు. పరిజ్ఞానమున్న పౌరుల్లా ఉండాలని తన అమ్మమ్మ చెప్పేవారన్నారు. తన తల్లి చదువరి, స్వేచ్ఛాపిపాసి, చాలా బలమైన అభిప్రాయాలున్న మహిళ అన్నారు. పౌర హక్కుల గురించి, వియత్నాం యుద్ధం ఎందుకు అమెరికా చేసిన దుస్సాహసమైందీ, మహిళల హక్కుల పోరాటాల గురించి చిన్నారి ఒబామాకు వివరించేది. కొంతకాలానికి పెంపుడు తండ్రితో కలిసి ఉండేందుకు తల్లితో కలిసి ఒబామా ఇండొనేషియా వెళ్లారు. అక్కడ కూడా ఆమె తన సామాజిక, రాజకీయ బోధనను కొనసాగించారు. అవినీతి అంటే మామూలే అనుకునే దశ అప్పటికే వచ్చేసినా.. అవినీతి అంటే దొంగతనమే, దానికి దూరంగా ఉండాలని బరాక్‌కు ఆమె చెబుతుండేవారు. వాటర్‌గేట్ కుంభకోణం విచారణను ప్రతి రాత్రీ వింటూ రన్నింగ్ కామెంట్రీతో విశ్లేషిస్తూ వివరించేవారు. ఒకసారి స్కూల్లో తోటి విద్యార్థిని వేధించిన బృందంలో ఒబామా కూడా ఉన్నట్లు తెలిసి ఆమె నిరుత్సాహానికి గురయ్యారు. బ్యారీ అంటూ ఒబామాను పిలిచి (బేర్ అని కూడా బరాక్‌ను ముద్దుగా పిలుస్తుండేవారు) కూర్చోబెట్టి అన్నారు.

"ఈ ప్రపంచంలో తమ గురించి మాత్రమే ఆలోచించేవాళ్లు కొంతమంది ఉంటారు. తమకు కావలసింది లభిస్తున్నంత వరకూ వాళ్లు ఇతరులకు ఏం జరుగుతుందన్నది పట్టించుకోరు. తమ గొప్పతనాన్ని చాటుకోవటానికి ఇతరులను కించపరుస్తుంటారు."

"అదే సమయంలో ఇంకొందరు వారికి పూర్తి విరుద్ధంగా ఉంటారు. ఇతరుల గురించి ఆలోచిస్తుంటారు. ఇతరులు బాధపడే పనులు చేయరు వీరు."

"నువ్వు ఎలాంటి వ్యక్తివి కావాలనుకుంటున్నారు బ్యారీ" అని తల్లి ప్రశ్నించారు.

తన తల్లి ఆశించినట్లుగానే ఆ ప్రశ్న తనని చాలాకాలం వెంటాడుతూనే ఉందని బరాక్ చెప్పారు.

నైతికత ఉన్నవారికి ప్రపంచంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తన తల్లి భావిస్తుండేవారన్నారు. కానీ ఆమె ఎప్పుడూ రాజకీయ ప్రచారాల్లో పాల్గొనేవారు కాదు. ఒబామా తాత, అమ్మమ్మల్లాగే తల్లికి కూడా రాజకీయ పార్టీలు, సిద్ధాంతాలు తదితరాలపై అనుమానాలుండేవి. తన విలువల్ని తన పరిమిత పరిధిలోనే ఆచరించి చూపుతుండేవారు. అందులో భాగంగానే వర్ణ వివక్షను వ్యతిరేకిస్తూ వర్ణాంతర వివాహాల్ని చేసుకున్నారు. ఒబామాకు, ఆ తర్వాత మాయకు జన్మనిచ్చారు. పురుషాధిక్య విలువలకు నిరసనగా రెండు పెళ్ళిళ్ల నుంచీ విడాకులు తీసుకున్నారు. ఒబామా, అతని చెల్లెల్ని తన విలువలకనుగుణంగానే పెంచారు. తనకున్న స్వతంత్ర ప్రవృత్తి వల్ల ఆర్థికంగా ఒడిదుడుకులనెదుర్కొన్నా, ఎన్నడూ ఒబామా చదువు పట్ల ఆమె అశ్రద్ధ కనబరిచేవారు కాదు. హవాయిలోని మంచి స్కూల్లోనే చేర్చారు. కాలేజీ చదువు వద్దన్న ఊహకే తావివ్వలేదు. కానీ ఒబామా ప్రజాప్రతినిధి అవుతాడన్న ఆలోచన తల్లికి, ఆమె తల్లిదండ్రులకు కూడా ఎప్పుడూ కలగలేదు. ఒబామా ఫోర్డు ఫౌండేషన్‌లాంటి ఒక ధార్మిక సంస్థకు నేతృత్వం వహిస్తాడని తల్లి భావించగా, ఒక న్యాయమూర్తి లేదా పెర్రీ మ్యాసన్‌లాగా పలుకున్న న్యాయవాది అవుతాడని అమ్మమ్మ తాతయ్యలు అనుకున్నారు. హైస్కూలు స్థాయిలోకొచ్చాక ఒబామాలో కొన్ని అసౌకర్యం కలిగించే ప్రశ్నలు వస్తుండేవి. తండ్రి పాత్ర లేకపోవటం, తల్లి నిర్ణయాలు, తోటి పిల్లల్లో ఎక్కువమంది నేపథ్యం తనకు భిన్నంగా ఉండటం, నల్లజాతీయులు బాస్కెట్ బాల్ ఆడటం తప్ప శిక్షకులుగా కాలేకపోవటం, 'ఒబామా, నువ్వు నల్లజాతీయుడవనుకోలేదు' అని ఓ అమ్మాయి అనటం, యాక్షన్ సినిమాల్లో నల్లజాతీయుల్ని జోకర్లు, విలన్లుగా చూపించేతీరు.. వీటన్నింటిపై పరంపరలా ప్రశ్నల రూపంలో అడుగుతుండేవాడు. కేవలం వర్ణం గురించే కాకుండా వర్గం గురించి కూడా ఒబామాలో ఆవేదన, సందేహాలు ఉండేవి. డబ్బున్నవారికి, పేదలకు మధ్య అంతరాన్ని నిత్యం గమనిస్తుండేవాడు. తన తాత, అమ్మమ్మల అవస్థల్ని, తల్లి కష్టాల్ని చూస్తుండేవాడు.

తల్లి ఎంత చెప్పినా.. ఇతరుల మీద ఆధిపత్యం చేసేవారు, మోసగాళ్లు, లేనిగొప్పతనాన్ని ప్రచారం చేసుకునేవారు జీవితంలో గెలుస్తుండగా, ఆమె దృష్టిలో మంచిగా, హుందాగా ఉండేవాళ్లు కష్టాలు పడుతున్నారని ఒబామాకు అనిపిస్తుండేది. ఈ గందరగోళాలు, వైరుధ్యాల్లో తన గురించి తాను స్పష్టంగా నిర్వచించుకోకపోతే, తన మార్గాన్ని, ఆలోచనా ధోరణిని నిర్దేశించుకోకపోతే, చివరికి అనామకుడిగా మిగిలిపోక తప్పదని ఒబామాకు అర్థమైంది. తన భావాల్ని ఒబామా స్నేహితులు, కుటుంబ సభ్యులు ఎవరితోనూ పంచుకోలేదు. వాళ్లని బాధపెట్టదలచుకోలేదు. తన తల్లి చిన్నప్పటి నుంచే అలవాటు చేసిన పుస్తక పఠనాన్ని ఆశ్రయించాడు. బోర్ కొడుతుందన్నా, తల్లితోపాటు ఆఫీసుకి వెళ్లినా పుస్తకాన్ని చదవమని ఆమె ప్రోత్సహిస్తుండేది. 'ఆ పుస్తకం చదివి, అందులో నువ్వు నేర్చుకున్న విషయాన్ని నాకు చెప్పు' అనేవారామె. ఆ తర్వాత తల్లి, సోదరి మాయను వీడి ఇండొనేషియా నుంచి తిరిగా హవాయిలోని తాత, అమ్మమ్మల దగ్గరికి వచ్చినా ఆ పఠనం అలవాటు ఒబామాలో పోలేదు. పదవ తరగతిలో ఉన్నప్పుడు ఓసారి పాత పుస్తకాల అమ్మకం జరుగుతుంటే రాల్ఫ్ ఎల్లిసన్, లాంగ్‌స్టన్ హ్యూస్, రాబర్ట్ పెన్ వారెన్, దోస్తవెస్కీ, డీహెచ్ లారెన్స్, ఆర్‌డబ్ల్యూ ఎమర్సన్ తదితర రచయిత పుస్తకాల్ని ఒక బాక్సు నిండా తెచ్చుకుని చదవనారంభించాడు. ఇక అక్కడ్నుంచి పుస్తక పఠనం అతని జీవితంలో నిత్యకృత్యంగా మారింది. హైస్కూలులో, ఆ తర్వాత 1979లో ఓక్సిడెంటల్ కాలేజిలో చదువులో రాణించటానికి ఒబామాకు పుస్తక పఠనం ఎంతగానో సహాయ పడింది.

ఓక్సిడెంటల్ కళాశాలలో చదివిన రెండేళ్లలో ఒబామాలో రాజకీయ చైతన్యం మొగ్గ తొడిగింది. అయితే రాజకీయ నాయకుల పట్ల అతనికి ఇంకా సదభిప్రాయం లేకపోవటం, ఒక పరాధీన వ్యవస్థలో రాణించటానికి

పోటీపడుతున్న నటులుగానే వారిని భావిస్తుండటం వల్ల రాజకీయాల్లో భాగం కాకూడదని నిర్ణయించుకున్నాడు. అయినా ఒక విశాలమైన, తక్కువ సాంప్రదాయకమైన సామాజిక ఉద్యమాలు ఒబామాను ఆకర్షించాయి. సామాన్య ప్రజలు కూడా పాల్గొనే ఉద్యమాలు సంఘటిత కృషితో మార్పునకు దోహదం చేస్తాయని భావించాడు. కార్మిక పోరాటాలు, ఓటు హక్కు ఉద్యమాలు, మరీ ముఖ్యంగా డాక్టర్ కింగ్, జాక్ లూయిస్, బాబ్ మోజెస్, ఫ్యానీ లేహామర్, దయానీ నాష్ వంటి యువ నాయకుల పౌర హక్కుల ఉద్యమాలు ఆకర్షించాయి. గాంధీ మార్గం ఒబామా మీద బాగా ప్రభావం చూపింది. ఓటర్ల రిజిస్ట్రేషన్లకు ఇంటింటి ప్రచారం, భోజన సమయ సమావేశాలు వంటి వాటిల్లో తన తల్లి చెప్పిన విలువల ఆచరణకు అవకాశాలు ఒబామాకు కన్పించాయి. "ఇతరులకు నష్టం చేయకుండా, వారిని కూడా ఎదిగేలా చేస్తూ గెలవటం. ఇది నిజమైన క్రియాశీల ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యం అంటే పై నుంచి అందించే కానుక కాదు, పరస్పర ప్రయోజనాల మధ్య వైరుధ్యం కాదు, ప్రజాస్వామ్యం అంటే ప్రతి ఒక్కరూ భాగస్వాములై సాధించుకొనేది. దాని ఫలితం – కేవలం భౌతిక పరిస్థితులు మారటం మాత్రమే కాదు, ప్రజలందరిలో, ప్రతి సమూహంలో, ఒక ఆత్మగౌరవ భావం కలగటం, ఒకప్పుడు వేర్వేరు అనుకుంటూ, విడిపోయి ఉన్న వారి మధ్య ఒక బంధం ఏర్పడటం. ఈ ఆదర్శమే నేను సాధించాల్సిన లక్ష్యం అనిపించింది" అని రాశారు ఒబామా. ఆ లక్ష్యం మీద బాగా దృష్టి కేంద్రీకరించారు.

ఇదే సమయంలో కొలంబియా యూనివర్సిటీకి వెళ్లటంతో ఒబామా జీవితంలో అదో కొత్త ఆరంభంలా మారింది. దాదాపు మూడేళ్లపాటు న్యూయార్క్ మహానగరంలో స్నేహితులు, విహారాలు వంటివి లేకుండా ఒక రుషిలా పుస్తకాల్ని చదివాడు ఒబామా. ఆలోచనల్ని మథించాడు. నాటి యువ ఒబామా గురించి ఇప్పుడు ఆలోచిస్తే చాలా ముచ్చటేస్తుంది.. అని పుస్తకంలో ఒబామా వ్యాఖ్యానించారు. అయితే అంత చదవక్కర్లేదేమో, కొంత క్షేత్రస్థాయి జీవితాన్ని కూడా ఆస్వాదించి ఉండాల్సింది అని అభిప్రాయపడ్డారు. ఆ కాలంలో రొనాల్డ్ రీగన్ నిర్దేశంలో కొత్త కన్సర్వేటిజం మొదలైంది. ఆర్థికవ్యవస్థ మందగించింది. ప్రచ్ఛన్న యుద్ధం పతాకస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో సామాజిక ఉద్యమాల ప్రాధాన్యత తగ్గింది. అయితే, ఒబామా ఎంతగా పుస్తకాల్లో మమేకమైనా, ఎంతటి ఆదర్శవాదమున్నా తనను తాను ప్రశ్నించుకునే తత్వం, నిరంతరం మెరుగుపరచుకునే ధోరణి ఉండటం వల్ల విపరీత ధోరణుల వైపు మళ్లలేదు. అమెరికా స్వదేశంలో, విదేశాల్లో ఎన్ని అణచివేతల్ని చేస్తున్నా, ఎన్ని ఇతర తప్పుల్ని చేస్తున్నా 'ఐడియా' ఆఫ్ అమెరికా, 'ప్రామిస్' ఆఫ్ అమెరికా పట్ల తన విశ్వాసం మాత్రం ఎప్పుడూ చెక్కుచెదరలేదని ఒబామా అంటారు. 'అందరూ సమానమే అని చాటి చెప్పేదే నా అమెరికా. టోక్విల్లీ, విట్‌మాన్, థోరో, థామస్ ఎడిసన్, రైట్ బ్రదర్స్, జాకీ రాబిన్సన్, బాబ్ డిలాన్, లింకన్, జాన్ ఆడమ్స్, డాక్టర్ కింగ్, అమెరికన్ రాజ్యాంగం, హక్కుల పత్రం.. ఇలా ఎందరో, ఎన్నో హామీ ఇచ్చిన, ఆశించిన అమెరికా తాను కలలుగంటున్న అమెరికా అంటారు ఒబామా.

"వర్ణ వివక్ష అనివార్యం కాదు అనే విశ్వాసం కూడా – ఈ దేశం ఎలా ఉండాలి, ఎలా రూపొందగలదు – అని చెప్పే 'ఐడియా' ఆఫ్ అమెరికా పట్ల తన సానుకూలతకు కారణమని ఒబామా చెప్పారు. అటువంటి పరిస్థితుల్లో 1983లో ఆయన గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్నారు. "పెద్ద ఆలోచనలు .. ఎటు వెళ్లాలో తెలీదు .. చేరటానికి ఎటువంటి ఉద్యమాలూ లేవు .. అనుసరించదగ్గ నిస్వార్థ నాయకుడూ లేడు".. అని రాసుకున్నారు.

స్థానిక సమస్యల మీద సామాన్య ప్రజలని సంఘటితం చేస్తూ పని చేసే 'కమ్యూనిటీ ఆర్గనైజింగ్' కార్యక్రమం ఒబామాకు తన మనసులోని భావాలకు దగ్గరగా కనిపించింది. న్యూయార్క్‌లో తనకు సరిపడని ఓ రెండు ఉద్యోగాలలో తిప్పలు పడ్డాక, చికాగోలో కొన్ని చర్చిల ఆధ్వర్యంలో జరుగుతున్న ఓ సామాజిక కార్యక్రమంలో ఖాళీ ఉన్నట్లు తెలిసింది. స్టీల్‌ప్లాంట్‌ల మూసివేతలతో రోడ్డున పడ్డ కమ్యూనిటీలను కుదుటపరిచే కార్యక్రమం అది. పెద్ద గొప్ప పనికాదు, కానీ ప్రారంభానికి సరైనది. నల్లజాతి కార్మికులు ఉండే నైబర్‌హుడ్‌లలో ఒబామా పనిచేసేవారు. చిన్నచిన్న విజయాలు, తాత్కాలిక విజయాలు కనిపిస్తుండేవి. కానీ ఇదే సమయంలో చికాగో నగరం ఒబామా జీవితాన్నే మార్చేసింది. ఒబామాలో మితిమీరిన అంతర్ముఖత్వాన్ని వదిలించింది. తాను ఆలోచించటం కాకుండా ప్రజలు చెప్పేది వినటం, ప్రజలకు ఏం కావాలో తెలుసుకోవటం ప్రారంభించాడు. పార్కు నిర్మాణం, స్కూలు తదనంతరం కార్యక్రమాలు.. ఇలా తనతో కలిసిరమ్మని అపరిచితులను అడగాల్సి వచ్చేది. ఈ క్రమంలోనే.. తిరస్కారాలు, అవమానాలకు భయపడే మానసిక స్థితిని అధిగమించాడు. పరిణతిని సాధించాడు, హాస్య చతురతను తిరిగి తెచ్చుకున్నాడు. ఒంటరి తల్లే అయినా తన నలుగురు పిల్లల్నీ కాలేజీ చదువులు చదివించిన మహిళ, స్టీల్ ప్లాంట్ మూతతో సోషల్ వర్కర్‌గా మారేందుకు స్కూలుకి వెళ్లిన ఓ శ్రామికుడు.. ఇలాంటి విజయాలు ప్రజల విజ్ఞత పట్ల ఒబామా విశ్వాసాన్ని దృఢతరం చేశాయి. తమ నాయకులను, వ్యవస్థలను పౌరులు జవాబుదారీ చేయగలిగితే ఎలా మార్పుల్ని సాధించవచ్చో కళ్లారా చూశాడతను. తమ మాటకు విలువుంటుందని గుర్తిస్తే ప్రజలు ఎంత మెరుగ్గా, భిన్నంగా ఆలోచిస్తారో, వ్యవహరిస్తారో గమనించాడు. వీటి నుంచి.. వర్ణ వివక్షతో కూడిన తన అస్తిత్వం పట్ల ఒబామాను వెంటాడే ఓ ప్రశ్నకు సమాధానం లభించింది. నల్లజాతీయులు ఎలా ఉండాలి అనే వెతుకులాట కన్నా, ఒక మంచి మనిషిగా ఉంటే చాలు అనే స్పష్టత కలిగింది. సందేహిస్తూనే, ప్రశ్నిస్తూనే ఇప్పుడున్న పరిస్థితి కంటే మెరుగైన స్థితిని అందుకునే ధోరణి ఆయనకు చుట్టూ కనిపించింది. తన తల్లి, తాత, అమ్మమ్మలు తనలో పాదుగొల్పిన నిజాయతీ, కష్టపడటం, సహానుభూతి వంటి వాటితో కూడిన ఉమ్మడి బంధం ఈ ప్రజల మధ్య కనిపించింది. ఇలాగే ఆర్గనైజింగ్‌లో కొనసాగి ఉంటే ఒబామా ఆ ప్రాంతంలోని, చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజల, పిల్లల జీవితాల్ని బాగుచేసి ఆ క్రమంలో ఒక సంస్థను నిర్మించగలిగి ఉండేవారేమో! కానీ ఆయన అక్కడ్నుంచి హార్వర్డ్ లా స్కూల్‌లో చేరారు.

ఆర్గనైజింగ్ ద్వారా తాను చేస్తున్న పని తాను సేవ చేయాలనుకుంటున్న ప్రజల అవసరాలను తీర్చగలిగే స్థాయిలో లేదని, చాలా పరిమితంగా, నెమ్మదిగా ఉందని ఒబామా భావించారు. ఒక స్టీల్‌ప్లాంట్‌ను మూసివేస్తే కోల్పోయే వేల ఉద్యోగాలను ఒక స్థానిక ఉద్యోగాల సంస్థ భర్తీ చేయలేదు. ఒక స్కూలు తదనంతర కార్యక్రమం.. స్కూళ్లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న నిధుల కొరతకు సమాధానం కాలేదు. ప్రతి అంశంలోనూ ఇలా సమస్య ఉంది. కానీ నిర్ణయాధికారాలేమో ఎవరో రాజకీయ నాయకుడు, అధికారి, సీఈవో చేతిలో ఉంటాయి. వాళ్లు ఎప్పటికో స్పందిస్తారు. అది కూడా అరకొరగా. సమస్య బడ్జెట్‌లు, విధానాలను ఎక్కడో ఉండి నిర్దేశించేవారిలో ఉంది కాబట్టి.. మనం దృష్టి పెట్టాల్సింది అక్కడ అనుకున్నారు ఒబామా. దాంతోపాటు, ఒబామా రాకకు రెండేళ్ల ముందు మార్పు కోసం చికాగోలో ఒక సామాజిక, రాజకీయ ఉద్యమం జరిగింది. అయితే అది తన భావజాలానికి అనుగుణంగా లేకపోవటంతో ఒబామా పూర్తిస్థాయిలో ఏకీభవించలేకపోయారు. నగర తొలి నల్లజాతి మేయర్‌గా హెరాల్డ్ వాషింగ్టన్‌ను ఎన్నుకోవటమన్నది ఆ ఉద్యమ లక్ష్యం. ఆ ఉద్యమంలో క్రియాశీల భాగస్వామి కాకుండా బయట నుంచి ఒబామా శ్రద్ధగా గమనించారు. పాఠాల్ని నేర్చుకునే ప్రయత్నం చేశారు. ఒక నిర్మాణం, సంస్థాగత పాలనా నైపుణ్యం లేకుండా.. ఒక ఉద్యమంలోని గొప్ప శక్తిసామర్థ్యాలను నిభాయించటం ఎలా అసాధ్యమవుతుందో ఆయన ప్రత్యక్షంగా చూశారు. వర్ణ వివక్షకు వ్యతిరేకంగా నిర్వహించిన ఒక మానవీయ ఉద్యమం – ఎంత సహేతుకమైనదైనా – భయాన్ని, వ్యతిరేకతను కలిగించటాన్ని, అభివృద్ధికి పరిమితులు విధించటాన్ని ఆయన గమనించారు. హెరాల్డ్ ఆకస్మిక మృతితో ఆ ఉద్యమ పర్యవసానాలు ఒబామాకు బాగా అర్థమయ్యాయి. మార్పు కోసం ఒక వ్యక్తి ఆకర్షణ శక్తి మీదే ఉద్యమాలు ఎందుకు ఆధారపడకూడదో అర్థమైంది. కానీ హెరాల్డ్

ఎలాంటి అద్భుతమైన శక్తో ఆ అయిదేళ్లూ నిరూపించాయి. చికాగోలో అనేక ఉమ్మడి వసతుల తీరుతెన్నుల్ని ఆయన మార్గగలిగారు. అన్నిటినీ మించి హెరాల్డ్ ప్రజలకు ఒక ఆశను అందించగలిగారు. చికాగో నల్లజాతీయులు ఆయన గురించి కథలుకథలుగా చెప్పుకునేవారు. ఈ పరిణామాలు ఒబామాలో ఒక బీజాన్ని నాటాయి. ఏదోకరోజు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచనను తొలిసారిగా కలిగించాయి. కానీ వేరే పద్ధతిలో. అదే ఎనర్జీ, అదే లక్ష్యశుద్ధి, కానీ కేవలం నల్లజాతీయులతో మాత్రమే కాకుండా వర్గాలకతీతంగా. సరైన సన్నద్ధతతో, విధానాల పట్ల అవగాహనతో, నిర్వహణ నైపుణ్యాలతో. హెరాల్డ్ చేసిన పొరపాట్లు చేయకుండా. ప్రజలను సమీకరించటం కేవలం ప్రచారం మీద కాకుండా, వారి భాగస్వామ్యం కూడా ఉండేలా చేయటం ద్వారా. ఎవరైతే ఇప్పటి వరకూ వ్యవస్థ బయట ఉన్నారో, వారందరినీ భాగస్వాముల్ని చేయటం ద్వారా. తాము ఎన్నుకున్న ప్రతినిధులను కాకుండా, ప్రజలు ఒకరినొకరు కూడా విశ్వసించేలా చేయటం ద్వారా.

…

ఇప్పుడు తిరిగి అమెరికా సెనెట్‌కి ఇల్లినాయిస్ నుంచి పోటీ చేయాలన్న ఒబామా తాజా ప్రయత్నం వద్దకు వద్దాం.

సెనేటర్‌గా తాను కచ్చితంగా గెలుస్తాను అనుకోకపోయినా.. గెలవగలను అనే స్పష్టతయితే ఒబామాకు వచ్చింది. ఆ ఎన్నికలో గెలిస్తే తాను చాలా పెద్ద స్థాయిలోనే ప్రభావం చూపగలనని గుర్తించారు. ఒకవేళ గెలవకపోతే, రాజకీయాల నుంచి విరమించుకోవాలనుకున్నారు. సెనెట్ పోటీకి వివిధ రకాలుగా సిద్ధమయ్యాక చివరిగా మిషెల్ నుంచి ఆమోదం కోసం ఒబామా ప్రయత్నించారు. దీనివల్ల తమ కుటుంబంపై ఆర్థికంగా పడే భారం పట్ల ఆమెను ఎంతో ఆందోళనకు గురిచేసింది. గత ఎన్నికల దెబ్బ నుంచి ఇంకా కోలుకోలేదని, విద్యార్థి రుణాలు, తాకట్లు, అప్పులు అలాగే ఉన్నాయని ఒబామాను హెచ్చరించారు. ఇంకా పిల్లల కాలేజీ చదువులకు డబ్బు పొదుపు చేయలేకపోతున్నామని మరచిపోయావా అని ప్రశ్నించారు. దాంతోపాటు సెనెట్‌కు పోటీ కారణంగా లాభదాయక పదవి విమర్శలకు అవకాశమివ్వకుండా తాను లా ప్రాక్టీస్‌ను కూడా ఆపాల్సి ఉంటుందని, ఇది తమ ఆదాయాన్ని ఇంకా తగ్గిస్తుందన్నారు. “నువ్వు ఓడిపోతే, మనం మరిన్ని కష్టాల్లో కూరుకుపోతాం.. ఒకవేళ గెలిస్తే వాషింగ్టన్‌లో, చికాగోలో రెండు చోట్లా ఇళ్లు ఎలా నిర్వహించగలం? ఒక ఇంటి నిర్వహణకే సతమతమవుతున్నాం” అని ఆమె గట్టిగా అన్నారు. ‘గెలిస్తే, సెనెట్‌లో ఏకైక ఆఫ్రికన్ అమెరికన్‌గా అందరి దృష్టినీ ఆకర్షిస్తాను, మరో పుస్తకం రాస్తాను, ఈసారి ఎక్కువ కాపీలు అమ్ముడై ఎక్కువ డబ్బులు వస్తాయి’ అని ఒబామా ఆశావాదాన్ని వినిపించారు. ‘అల్లావుద్దీన్ అద్భుతదీపం థియరీ’ అన్నారు మిషెల్ ఎకసెక్కపు నవ్వుతో. కొంతసేపు మౌనం రాజ్యమేలింది. “ఇదే చివరిసారి బరాక్. కానీ నా నుంచి ప్రచారం ఆశించవద్దు. నా ఓటును కూడా లెక్కేసుకోవద్దు” ఆమె తేల్చి చెప్పారు.

అలా అమెరికా సెనెట్‌కు ఒబామా పూర్తిస్థాయి ప్రయత్నం 2003లో మొదలైంది. ఇన్సూరెన్స్ పాలసీలను అమ్మే తన తాత చిన్నప్పుడు వినియోగదారులకు ఫోన్ చేస్తూ అవతలి వారి తిరస్కారాలు, విసుగుల పట్ల ఎంత బాధగా ముఖం పెట్టేవారో ప్రచారం ప్రారంభంలో ఒబామాకు గుర్తుకొచ్చింది. అయితే అదేసమయంలో జాతీయ స్థాయి రాజకీయ పరిణామాలు కూడా ఒబామాకు కలిసివచ్చాయి.

…

ఇరాక్‌పై దాడికి అమెరికా సిద్ధమవుతున్న సందర్భంగా దానికి వ్యతిరేకంగా మాట్లాడాలని ఒబామాను చికాగో డౌన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన ఒక యుద్ధవ్యతిరేక ర్యాలీకి ఆహ్వానించారు. అప్పటికింగా ఒబామా అమెరికా సెనెట్‌కు తన అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ఒబామా బృందంలోని ముఖ్యులేమో యుద్ధానికి వ్యతిరేకంగా వైఖరి వల్ల డెమొక్రాటిక్ పార్టీ ప్రైమరీలో లాభం ఉంటుందని చెప్పగా, 9/11 దాడుల తర్వాత ప్రజల్లో తీవ్రవాదం పట్ల ఉన్న వ్యతిరేకత వల్ల నష్టం కూడా జరిగే ప్రమాదముందని ఇంకొందరు హెచ్చరించారు. ఇరాక్‌పై సైనికచర్యకు 67% అమెరికన్లు మద్దతు తెలిపారని ఆ సమయంలో ఓ జాతీయపోల్ తెలియచేసింది. ఒసామాను గుర్తుచేయటంతోపాటు అరబ్ మూలాల్ని స్ఫురింప చేసే తన పేరు వంటివి కూడా జతపడి ఎన్నికల్లో అసలుకే మోసం రావచ్చన్న అంచనాలు వెలువడ్డాయి. దీనిపై లోతుగా ఆలోచించాక తన అంతరాత్మ ఆమోదించిన ప్రచారాన్నే చేయాలని, తాను నిజాయతీగా నమ్మే విలువలకనుగుణంగానే మాట్లాడాలని ఒబామా నిర్ణయించుకున్నారు. ఆ రోజున ర్యాలీలో వెయ్యిమందికి పైగా పాల్గొన్నారు. జెస్సీ జాక్సన్ ప్రధాన వక్త. తన వంతు వచ్చాక ఒబామా చాలా స్పష్టతతో మాట్లాడారు. ఇది యుద్ధవ్యతిరేక ర్యాలీ అయినా కూడా, అన్ని సందర్భాల్లో తాను యుద్ధానికి వ్యతిరేకం కానని స్పష్టం చేశారు. సభలో నిశ్శబ్దం. ఒబామా ఏం మాట్లాడుతున్నారో ఎవరికీ అర్థం కాలేదు. యునైటెడ్ అమెరికా ఆవిర్భావం కోసం, ఆ తర్వాత స్వేచ్ఛకు పునర్జన్మ ఇచ్చే సమయంలోనూ అమెరికాలో చిందిన రక్తాన్ని ఒబామా ప్రస్తావించారు. పెరల్ హార్బర్‌పై దాడి సమయంలో తన తాత యుద్ధంలో స్వచ్ఛందంగా పోరాడటాన్ని చెప్పారు. మరో 9/11 దాడి జరగకుండా ఆయుధాలు పట్టటానికి తాను సైతం ఎలా సిద్ధమో చెప్పారు.

“అన్ని యుద్ధాలనూ నేను వ్యతిరేకించను. కానీ గుడ్డిగా చేసే యుద్ధాన్ని వ్యతిరేకిస్తాను. సద్దాం హుస్సేన్ అమెరికాకుగానీ, పొరుగు దేశాలకు గానీ ఎటువంటి ప్రమాదం కాదు” అన్నారు ఒబామా. ఇరాక్‌పై అమెరికా విజయవంతంగా యుద్ధం చేసినా కూడా ఎంత కాలం పడుతుందో, ఎంత ఖర్చవుతుందో, పర్యవసానాలు ఎలా ఉంటాయో ఎవరూ ఇతిమిద్దంగా చెప్పలేరని హెచ్చరించారు. ప్రెసిడెంట్ బుష్ యుద్ధం చేయాలనుకుంటే అల్ ఖైదా మీద చేయాలన్నారు. నియంతృత్వ ప్రభుత్వాలకు మద్దతు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఇరాక్ యుద్ధాన్ని తోసిపుచ్చారు. జనాన్ని ఆయన ప్రసంగం ఆకట్టుకున్నా, మీడియాలో మాత్రం పెద్దగా కవరేజీ లేదు.

కొన్ని నెలల తర్వాత యుద్ధం ప్రారంభమై బాగ్దాద్ మీద బాంబుల దాడి మొదలయ్యాక, డెమొక్రాట్లు ఇరాక్ యుద్ధానికి వ్యతిరేకంగా గట్టిగా గళం విప్పటం ప్రారంభించారు. మృతుల సంఖ్య, అరాచకం పెరగటం మొదలయ్యాక మీడియా కూడా ప్రశ్నల్ని సంధించటం ప్రారంభించింది. అంతే.. యుద్ధవ్యతిరేక ర్యాలీలో ఒబామా చేసిన చిన్నపాటి ప్రసంగం ఇంటర్నెట్‌లో పెద్దఎత్తున సర్క్యులేట్ కాసాగింది. దీంతో ఒబామాకు ఆదరణ ఉవ్వెత్తున పెరిగింది. విద్య, ఆరోగ్యం, ఉద్యోగాలు, ఆఫ్ఘనిస్తాన్‌లో యుద్ధాన్ని పూర్తి చేయకుండా కొత్తగా ఇరాక్‌లో యుద్ధాన్ని ప్రారంభించటంలోని అసంబద్ధత వంటి అంశాల్ని ప్రస్తావిస్తూ అన్ని రకాల అమెరికన్ల మధ్యా ఒబామా కలియతిరిగారు. క్రమంగా తాను మాట్లాడటం తగ్గించి ఎక్కువ వినటం ప్రారంభించారు. ఆరోగ్య బీమాకొనుగోలుకు స్తోమతు లేక వైద్యానికి దూరమవటం, ఎక్కువ రోజులు రావటం కోసం మందుబిళ్లల్ని ముక్కలు చేసి ఉపయోగించటం, కర్మాగారాలు మూసివేయటం, భూములు అమ్ముకోవటం, సరైన ఉద్యోగాలు లేక వలసలు పోవటం, ఆర్థిక స్థితి సరిగా లేక కాలేజీ చదువును వీడటం వంటివన్నీ ప్రజలు చెప్పారు. తన పాలసీలను నేరుగా వివరించటం కాకుండా.. ప్రజల గొంతు నుంచి వచ్చిన సమస్యల్ని ప్రస్తావిస్తూ వాటినే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ఉమ్మడి గళంగా ఒబామా మార్చారు. వాటికి తన పాలసీలతో పరిష్కారం సాధించగలననే విశ్వాసాన్ని వారిలో కలిగించారు. ఈ సందర్భంగా తన కొత్త రాజకీయాన్ని మరింత ప్రస్ఫుటంగా ఒబామా పుస్తకంలో వివరించారు.

“చాలామంది ప్రజలు, వాళ్లు ఎక్కడ నుంచి వచ్చినా, వాళ్లు ఎలా కనిపించినా, వారి వెతుకులాట మాత్రం ఒకే అంశం కోసం! వాళ్లు అడ్డగోలుగా సంపన్నులు కావాలని కోరుకోవటం లేదు. తమంతట తాము చేసుకోగలిగిన పనుల్ని ఎవరో వచ్చి చేసిపెట్టాలనీ వారు ఆశించటం లేదు. కానీ తాము పనిచేయటానికి ముందుకొస్తే, తమ కుటుంబాన్ని పోషించుకోవటానికి కావలసిన ఉద్యోగం అందాలని వారు ఆశిస్తున్నారు.

తమ పిల్లలకు మంచి చదువు రావాలని, కొత్త ఆర్థిక వ్యవస్థకు సన్నద్ధం చేసే చదువు రావాలని, కాలేజీ చదువుకు వెళ్లాలనుకుంటే అందుకు అవకాశం లభించాలని వాళ్లు ఆశిస్తున్నారు. నేరస్తులు, తీవ్రవాదుల నుంచి తాము భద్రంగా ఉండాలని ఆశపడుతున్నారు. జీవితకాలం పని చేశాక, గౌరవాదరణలతో రిటైరవ్వాలని కోరుకుంటున్నారు. ఇంతే, కేవలం ఇంతే వారు కోరుకుంటున్నది. ఇదేమీ దురాశ కాదు. ప్రభుత్వం తమ సమస్యలన్నిటినీ పరిష్కరించాలని కూడా వాళ్లు ఆశించటం లేదు. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో స్వల్ప మార్పులు చేస్తే తమకెంతో మేలు జరుగుతుందని వాళ్లకి అవగాహన ఉంది" అన్నారు ఒబామా.

ఈ తరహాలో డిమాండ్‌కు తగ్గ సప్లయ్‌తో కూడిన కొత్త రాజకీయ ప్రచారంతో ప్రజలను ఆకట్టుకున్న ఒబామాకు ప్రత్యర్థి రాజకీయ శిబిరంలోని పరిణామాలు కూడా కలిసి రావటంతో మార్చి 16, 2004న జరిగిన ప్రైమరీల్లో 53% ఓట్లతో పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఇక ఎన్నికల్లో గెలుపు కోసం ప్రచారంలో బిజీ అయ్యారు. ఇరాక్ యుద్ధానికి వ్యతిరేకంగా ఒబామా వీడియోకి విశేష ప్రాచుర్యం లభించటం, సెనెట్ రేసులో ఉమ్మడి ప్రయోజనాల చుట్టూ ప్రజలను ఆయన ఏకం చేయటం, ప్రైమరీల్లో భారీ విజయం చూశాక డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి జాన్ కెర్రీ కార్యాలయం నుంచి ఒబామాకు ఫోన్ వచ్చింది. జులైలో బోస్టన్‌లో నిర్వహించనున్న డెమోక్రాటిక్ పార్టీ జాతీయ సదస్సులో కీలకోపన్యాసం ఇవ్వాలని ఒబామాను ఆహ్వానించారు. ఆ ప్రసంగాన్ని తయారు చేసే పనిని తన బృందానికి అప్పచెప్పకుండా ఒబామా తాను స్వయంగా తయారుచేసుకోసాగారు. కొన్ని రోజుల పాటు సాయంత్రాల సమయంలో ప్రసంగాన్ని రాసుకుంటూ వచ్చారు. కాలేజీలో చదివే రోజుల్లో ఎటువంటి రాజకీయం కోసమైతే తాను ఆరాటపడ్డాడో, తానీ స్థానానికి రావటానికి ఎటువంటి రాజకీయం కారణమైందో ఆ రాజకీయ భావజాలాన్ని సంపూర్ణంగా వ్యక్తం చేసే పదాలు జాలువారసాగాయి. తన తల్లి, తాత, అమ్మమ్మల గొంతులు, తన తండ్రి లేఖలు, తాను కలుసుకున్న అనేకమంది ప్రజల గుండె చప్పుళ్లు, తాము ఎదుర్కొన్న కష్టాలకు కసితో రగిలిపోయి పక్కదోవపట్టకుండా, అరాచకాన్ని తిరస్కరిస్తూ, నిర్మాణాత్మకంగా ఎదిగేందుకు, ఇతరులతో కలిసిమెలిసి జీవించేందుకు ప్రయత్నిస్తున్నవారి సానుకూల గళాలు.. ఒబామా మనసంతా నిండిపోయాయి. ఒక ప్రార్థన సమయంలో తన పాస్టర్ జెరిమియ రైట్ చెప్పిన మాటలు స్ఫురణకు వచ్చాయి: "ఆశావాదం చేయించే సాహసాలు, అద్భుతాలు".

...

2004లో పార్టీ జాతీయ సదస్సులో ఒబామా ఇచ్చిన ఆ ప్రసంగం అమెరికాలో ఓ నూతనాధ్యాయానికి నాంది పలికింది. సభలోనివారు విభేదాలను అధిగమించి తనతో మమేకమైన ఓ అద్వైత స్థితిని, ఓ ఉమ్మడి భావోద్వేగానుభూతిని ఆ ప్రసంగ సమయంలో ఒబామా గుర్తించారు. టీవీల్లో లైవ్ ద్వారా ప్రసారమైన ఆ ప్రసంగం చూసినవారిలోనూ అనేకులు అదే స్థితిని పొంది ఉంటారని ఆ తర్వాత ఒబామాకు ఎదురైన అనుభవాలు రుజువు చేశాయి. ఆ తర్వాత అనేక సభల్లోనూ అదే దృశ్యాన్ని ఒబామా గమనించారు. ఈ నేపథ్యంలో, తాను జాతీయ స్థాయి రాజకీయాల్లోకి వెళ్లటం లేదని, ఇల్లినాయిస్ తన ప్రాధాన్యమని తెలియచెప్పేందుకు ఒబామా ప్రత్యేకించి ప్రచార ప్రణాళికను రచించుకోవాల్సి వచ్చింది. చివరికి రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో ఒబామా అమెరికన్ సెనెట్‌కు ఎన్నికయ్యారు. కానీ జాతీయ స్థాయిలో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జాన్ కెర్రీ అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోవటంతో సెలబ్రేషన్లలో ఉత్సాహం తగ్గింది. జాతీయ సదస్సులో ఒబామా ప్రసంగం ఇచ్చినప్పటి నుంచి.. ఆయన పునర్ముద్రణ పుస్తకం అమ్మకాలు భారీగా పెరగటంతో, పబ్లిషర్ ఫోన్ చేసి కొత్త పుస్తకానికి ఆఫర్ ఇచ్చారు. ఈసారి భారీ మొత్తాన్ని పారితోషికంగా ఇవ్వటానికి ఒప్పందం కుదిరింది. "ప్రచారం, పుస్తకం ఈ రెంటినీ నువ్వు హ్యాండిల్ చేసిన తీరు, విజయం సాధించిన తీరు నేను ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను" అని సెనెటర్‌గా బరాక్ ప్రమాణస్వీకారానికి ముందు మిషేల్ అన్నప్పటికీ.. ఆమెలో ఇంకా రాజకీయాల పట్ల విముఖత కొనసాగుతూనే ఉందని ఆ తర్వాత పరిణామాలు వెల్లడించాయి.

...

చట్టసభలో పనులు సకాలంలో తెమలకపోవటంతో విసుగు చెందిన సందర్భాలలో కార్యనిర్వాహక పాత్రలోకి వెళ్తే బాగుండును అని ఒబామాకు అనిపిస్తుండేది. గవర్నర్‌గా గానీ, ప్రెసిడెంట్‌గా గానీ ఎన్నికైతే తన ఎజెండాను మెరుగ్గా అమలు చేయొచ్చు అనే భావం కలుగుతుండేది. అప్పుడాయనకి 43 ఏళ్లు. దేశ సెనెట్ ద్వారా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటూ విదేశాంగ విధానం మీద కూడా ఒబామా దృష్టి పెట్టారు. 2006 వచ్చేసరికి ఒబామా అధ్యక్ష రేసులోకి రావాలనే భావాన్ని వ్యక్తం చేసేవారి సంఖ్య పెరిగిపోసాగింది. వేదిక విశాలమవటం, అది కూడా కార్యనిర్వాహక స్థానం కావటం తన కొత్త రాజకీయ లక్ష్యాలకి దోహదం చేస్తుందన్న భావం క్రమంగా ఒబామాలోనూ బలపడసాగింది, పోటీ దిశగా ప్రేరేపించసాగింది. ఇల్లినాయిస్‌కే పరిమితం కావాలన్న స్వీయనియంత్రణ ఉన్నా, తన ప్రొఫైల్ పెరగటాన్ని ఒక అవకాశంగా వినియోగించుకోవాలన్న భావం ఆయనలో రోజురోజుకూ ఎక్కువ కాసాగింది. ఆ తర్వాత కొందరు సీనియర్లను ఒబామా సలహా కోరారు.

'మార్పు దిశగా స్ఫూర్తినిచ్చే శక్తి చాలా కొద్దిమందికే ఉంటుంది. అమెరికా మార్పును కోరుతోంది. ఇదో అరుదైన అవకాశం. వినియోగించుకోవటం మేలు ఒబామా" అన్నదే వారందరి సలహా. జో బైడెన్, హిల్లరీ క్లింటన్ వంటి వారు అప్పటికే రేసులో ఉన్నా, ఒబామా పట్ల వారిలో ఎక్కువమంది మొగ్గు చూపారు. కొత్త భావాలు, వాక్చాతుర్యం, మీడియా సానుకూలత వంటి అనుకూలతలున్నా.. చిన్న వయసు, అనుభవరాహిత్యం వంటివి అధిగమించగలనా అన్న ఒబామా సంశయాలు, సందేహాలను వారు కొట్టిపారేశారు.

ఇలాంటి సంశయస్థితిలోనే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ విషయంపై మిషేల్‌ను ఒబామా కదిలించారు.

"ఇది 'మన' సంగతి కాదు. 'నీ' సంగతి. నాకు రాజకీయాలంటే పడదు. నీ మీద నమ్మకంతో భరించాను. అవి మన కుటుంబాన్ని నలుగురి మధ్యకూ లాగుతున్నాయి. నువ్వు అధ్యక్ష పదవికి పోటీ చేయటం నాకిష్టం లేదు. కనీసం ఇప్పుడు పోటీచేయటం!.. దీనికి ముగింపు ఎప్పుడు?" అని ఆమె విసురుగా వెళ్లిపోయారు.

తన రాజకీయ జీవితంలో సహనాన్ని, ధైర్యాన్ని మిషేల్ నుంచి ఒబామా ఆశించారు. తిరస్కారంతోనే అయినా ప్రేమతోనే వాటిని ఆమె అందించారు. కానీ తాను మాత్రం సంతృప్తి చెందటం లేదు. మళ్లీ కావాలని, ఇంకా కావాలని అడుగుతున్నా- అనుకున్నారు ఒబామా.

"ఎందుకు ఆమెను ఇందులోకి లాగుతున్నాను? ఇది నా అహమా? సేవ అనే ముసుగులో ఉన్న ఓ గొప్ప ఆకాంక్షా? తీరని ఆకలా? తనను వదిలేసిపోయిన తండ్రికి దీటైన జవాబివ్వాలన్న ప్రయత్నమా? తన ఒక్కగానొక్క కొడుకు గొప్పవాడు కావాలని విప్పారిత నేత్రాలతో చూసే తల్లి కోరికను నెరవేర్చాలన్న తపనా?".. ఆలోచనలతో ఒబామా సతమతమయ్యారు.

అలసిపోయేంతవరకూ కష్టపడే తన తీరుని చూసి పెళ్లయిన కొత్తలో మిషేల్ అన్న మాటలు గుర్తుకొచ్చాయి. "నీలో పూరించాల్సిన ఏదో పెద్ద వెలితి ఉంది బరాక్. అందుకే నువ్వు త్వరగా వెనక్కి తగ్గలేవు".

బరాక్ అంతరాత్మ మాత్రం అధ్యక్ష పదవికి పోటీ వైపే మళ్లుతోంది. పెద్ద మొత్తాలిచ్చే వారి కంటే పెద్దసంఖ్యలో చిన్న మొత్తాలు విరాళమిచ్చేవారు, వలంటీర్లు, ఇంటర్నెట్ ద్వారా సూక్ష్మస్థాయికి ప్రచారాన్ని తీసుకెళ్లటం.. ఇలా ఒబామా బృందం వినూత్న ప్రణాళికను రూపొందించింది. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న మధ్యంతర ఎన్నికల్లో ఒబామా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇదే సమయంలో "బరాక్ ఒబామా తదుపరి అధ్యక్షుడయ్యే అవకాశం ఎందుకంటే" అని 'టైమ్' పత్రిక ముఖచిత్ర కథనాన్ని ప్రచురించింది.

క్రమంగా మిషేల్ కూడా అర్థం చేసుకోసాగారు. సమావేశాల్లో పాల్గొంటూ బరాక్ ప్రచార ప్రణాళికల గురించి తెలుసుకోసాగారు.

ఈ సమయంలోనే ఒక కీలక సమావేశం జరిగింది. అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేయాలా, వద్దా ఒబామా తుది నిర్ణయం తీసుకోవటానికి ఆయన బృందం నిర్వహించిన సమావేశమిది. మిషేల్ కూడా పాల్గొన్నారు. ఒబామా చెబుతూ వస్తున్న నూతన రాజకీయంపై పూర్తి స్పష్టతకు మనకు కూడా ఈ సమావేశంలోని సంభాషణ ఎంతో ఉపయోగపడుతుంది. ఇందులో మిషేల్ బరాక్‌ను ఇలా ప్రశ్నించారు.

"ఎన్నికల్లో గెలిచి అధ్యక్ష పీఠాన్ని అందుకోగల సామర్థ్యమున్న డెమోక్రాట్లు ఇంకా ఉన్నారని నువ్వే చెబుతున్నావు. నువ్వు పోటీ చేయటానికి ఏకైక కారణం - ఇతరులు చేయలేనిదేదో నువ్వు మాత్రమే చేయగలగటం - అని నువ్వే నాకు చెప్పావు. అలాంటిదేమీ లేకుంటే అసలు పోటీయే చేయనక్కర్లేదు. అవునా?"

బరాక్ తలపంకించారు అవునన్నట్లు.

"కాబట్టి బరాక్, నేనడుగుతున్నది - నువ్వే ఎందుకు? అని. నువ్వు అధ్యక్షుడు కావాలని ఎందుకు అనుకుంటున్నావు?" అని మిషేల్ అన్నారు.

మిషేల్ వంక నిశితంగా చూశారు బరాక్. ఆ గదిలో తామిద్దరే ఉన్న భావం ఆవరించిందాయన్ని. "దాదాపు పదిహేడేళ్ల ముందు మేమిద్దరం మొదట కలుసుకున్న సన్నివేశం కళ్ల ముందు మెదిలింది" అని ఈ సన్నివేశం గురించి రాశారాయన.

"బరాక్!?".. మళ్లీ ఈ లోకంలోకి వచ్చి పెదవి విప్పారు.

"అవును. నేనే ఎందుకు?.." అనుకుంటూ ఇప్పటికే తాము పలు సందర్భాల్లో మాట్లాడుకున్న పలు అంశాల్ని మరింత స్పష్టంగా వివరంగా చెప్పారు.

"ఒక కొత్త తరహా రాజకీయానికి నేను నాంది పలకగలననుకుంటున్నాను. కొత్త తరాన్ని భాగస్వాముల్ని చేయగలనని, ఇతర అభ్యర్థుల కంటే మిన్నగా ప్రజల మధ్య ఉన్న విభజనల్ని పూడ్చగలనని అనుకుంటున్నాను."

"కానీ ఎవరికి తెలుసు?" కొనసాగిస్తూ అన్నారు బరాక్ బల్లను కలియజూస్తూ.

"మనం గెలుస్తామని గ్యారంటీ ఏమీ లేదు. ఒక్క విషయం మాత్రం గ్యారంటీగా చెప్పగలను. నేను నా కుడిచేతిని ఎత్తి అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడిగా ప్రమాణం తీసుకున్న రోజున.. మొత్తం ప్రపంచం అమెరికాను భిన్నంగా చూడటం మొదలు పెడుతుంది. ఈ దేశంలోని బిడ్డలందరూ - నల్లజాతి పిల్లలు, హిస్పానిక్ పిల్లలు, అవకాశాలు అందని పిల్లలు - అందరూ తమను తాము భిన్నంగా, నూతనోత్తేజంతో చూసుకోవటం మొదలు పెడతారు. వాళ్ల కలలు కొత్త స్థాయికి విస్తరిస్తాయి. వాళ్ల అవకాశాలు పరిమితుల్ని ఛేదిస్తాయి. అదే ఓ పెద్ద విజయం!"

బరాక్ మాటలకు ఆ గది నిశ్శబ్దమైంది.

మార్టి చిరునవ్వు నవ్వగా, వేలరీ కన్నీటితో ఉద్వేగభరితమైంది. తన బృందంలోని సభ్యులు మొదటి ఆఫ్రికన్ అమెరికన్ అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యాన్ని తమ మనసుల్లో ఊహించుకోవటం ఒబామాకు తెలుస్తూనే ఉంది.

"ఇది చాలా మంచి సమాధానం" సుదూర తీరాలను తాకుతున్నట్లు ఒబామాను తదేకంగా చూశాక మిషేల్ అన్న మాటలు.

అందరూ నవ్వారు. సమావేశం ఇతర అంశాల వైపునకు మళ్లింది.

"రాబోయే సంవత్సరాల్లో, ఈ గదిలో ఉన్నవారు ఏదో ఒక సందర్భంలో ఈ సమావేశాన్ని ప్రస్తావిస్తారు. మిషేల్‌కి నేనిచ్చిన సమాధానం అందరి మనసుల్లోని ఉమ్మడి విశ్వాసానికి ప్రతిధ్వని మాత్రమే. ఆ విశ్వాసమే, ఆకాంక్షే మమ్మల్ని అసాధ్యమనిపించే ఓ సుదీర్ఘ, ఒడిదుడుకుల మార్గంలో ప్రయాణానికి పురికొల్పింది. వైట్‌హౌస్‌లో ఓ చిన్నారి బాలుడు నా జుట్టును తాకినప్పుడు, నేను ఎన్నికయ్యాక తమ స్కూలులో పిల్లలు కొత్త ఆశలతో కష్టపడి చదవటం ప్రారంభించారని ఓ ఉపాధ్యాయురాలు చెప్పినప్పుడు.. వాళ్లు ఈ సమావేశాన్ని గుర్తుకు తెచ్చుకుంటారు.

"ఇది వాస్తవం. మిషేల్‌కి ఇచ్చిన సమాధానం ద్వారా నేను అమెరికా వర్ణ వివక్షాపూరిత గతంలోని కొన్ని పార్శ్వాల్ని కదిలించగల కొన్ని విశ్వసనీయ ప్రచారాంశాల్ని, మార్గాల్ని గుర్తిస్తున్నాను. మేము గెలిస్తే.. నా అమెరికా సెనెట్ ప్రచారం కేవలం అదృష్టం కాదని అర్థం. మేము గెలిస్తే, రాజకీయాల్లోకి నన్ను పురికొల్పింది కేవలం ఒక కల మాత్రమే కాదు.. నేను కలగంటున్న అమెరికా సాధ్యం, నేను కలగంటున్న ప్రజాస్వామ్యం అందుకోగల దూరంలోనే ఉందని అర్థం. మేము గెలిస్తే.. బలహీనులను బలవంతులు మింగేసే ఆటవిక యుగాల్లోకి మనం జారిపోయే నిర్దాక్షిణ్య ప్రాంతంగా ఈ ప్రపంచం ఉండనక్కర్లేదని నమ్మేది నేనొక్కడినే కాదని అర్థం.

"ఈ విశ్వాసాలన్నిటినీ నిజం చేయగలిగితే, నా జీవితానికి అర్థం ఏర్పడుతుంది. ఆ ప్రామిస్‌ను, ఆ నూతన ప్రపంచాన్ని నా పిల్లలకు అందివ్వగలుగుతాను. ఈ లక్ష్యాన్ని నేను ఎప్పుడో నిర్ణయించుకున్నాను. అందుకు కీలకమైన అడుగు వేయాల్సిన సమయమిది. ఇప్పుడు ఆగిపోవటం, ఇప్పుడు వెనుదిరగటం, ఇప్పుడు భయపడటం - ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు".

.. ఒబామా దృఢ నిశ్చయాన్ని వ్యక్తం చేశారు.

...

ఆ తర్వాత 2007 ఫిబ్రవరిలో, స్ప్రింగ్‌ఫీల్డ్‌లో ఇల్లినాయిస్ రాష్ట్ర శాసనసభ ప్రతినిధిగా అబ్రహం లింకన్ తన "హౌస్ డివైడెడ్" ప్రసంగాన్ని ఇచ్చిన చోట అమెరికా అధ్యక్షుడిగా పోటీ చేస్తున్నట్లు బరాక్ ఒబామా ప్రకటించారు.

తన రాజకీయంలో కొత్తదనమున్నప్పటికీ, దాన్ని ఆచరణలోకి తేగల విధానాలపై తనకింకా పూర్తిస్థాయి స్పష్టత రాలేదని ఒబామాకు అధ్యక్ష ఎన్నికల ప్రచారం మొదట్లోనే అర్థమైంది. విధానాల్ని నినాదాల్లా చెబితే చాలదని, ఎటువంటి శషభిషలకూ తావు లేకుండా, ఎవరూ తోసిపుచ్చటానికి వీల్లేకుండా నిర్దిష్టంగా, పకడ్బందీగా కూడా రూపొందించుకోవాల్సి ఉంటుందని ఆయన గుర్తించారు. తన తల్లి సహా ఆరోగ్య సమస్యల ఖర్చును భరించలేక దేశంలో అనేకమంది పడ్డ కష్టాలను స్వయంగా చూసి అందరికీ అందుబాటులో ఉండే ఒక హెల్త్ కేర్ పాలసీని తేవాలనుకున్నారుగానీ, అది ఇలా ఉండాలి అని నిర్దిష్ట గణాంకాలు, ఆధారాలు, ఇతర వివరాలతో కచ్చితంగా ఒబామా చెప్పలేకపోయారు. మీడియా ఫోకస్ ఎక్కువగా ఉండటంతో ఆయన అనుభవరాహిత్యం ప్రైమరీల ప్రచార తొలిదశలోనే కొన్నిచోట్ల బయటపడి ఇబ్బందికర పరిస్థితుల్ని కల్పించింది. విధానాల పట్ల పూర్తి స్పష్టత ఉండటం.. తన కొత్తరాజకీయాన్ని ఓ లాయర్‌లాగా కేవలం వాస్తవాలు, హేతుబద్ధ వాదనలతో ప్రజల ముందు ఏకరువు పెట్టకుండా, ఒక జాతీయస్థాయి నాయకుడిలా సారాంశాలు, అందుబాటు లక్ష్యాల్లా చూపిస్తూ, వాటిని సాధించటానికి భరోసానిస్తూ చెప్పటం.. ఒబామాకు పెద్ద సవాళ్లుగా మారాయి. మొత్తానికి ఎలాగోలా కష్టపడి సాధనతో అవరోధాలను అధిగమించి మెరుగైన అభ్యర్థిగా డెమోక్రాటిక్ పార్టీ అభిమానులతోపాటు ప్రజల ఆదరణని కూడా పొందగలిగారు (ప్రచారంలో ఒబామా జేబులో హనుమాన్ బొమ్మ కూడా ఉండేది). 2009లో అమెరికా సంయుక్త రాష్ట్రాల 44వ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. 2012లోనూ గెలిచి రెండోసారి అధ్యక్షుడయ్యారు.

... ఇవీ స్థూలంగా 'ఎ ప్రామిస్డ్ ల్యాండ్'లో బరాక్ ఒబామా తన కొత్త రాజకీయం, అందుకు దారితీసిన పరిస్థితులు, సామాజిక నాయకత్వం గురించి చెప్పిన అంశాలు.

నిజానికి ఈ పుస్తకాన్ని ఒబామా కేవలం అధ్యక్షుడిగా తాను ఎన్నికవటం, రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌లో చేసిన పనులు, అనుభవాల గురించే చెప్పాలనుకున్నారు. కానీ యువతకు స్ఫూర్తినివ్వటం కోసం తన రాజకీయ భావజాలాన్ని, కార్యాచరణని మలచిన బాల్య, యవ్వన, జీవిత కాలాల్ని కూడా గాఢంగా వ్యక్తం చేశారు.

ఏ రంగంలోనైనా, ముఖ్యంగా రాజకీయాల్లో ఒక వ్యక్తి నాయకత్వ

**అమెరికా అధ్యక్షుడిగా మొదటిసారి బరాక్ ఒబామా విజయం సాధించిన సందర్భంగా నవంబర్ 5, 2008న మీడియా సమావేశంలో జయప్రకాష్ నారాయణ్ విడుదల చేసిన నోట్**

# ఒబామా విజయం

## మనదేశంలోనూ కొత్తరాజకీయానికి ఉత్తేజాన్నిస్తుంది
## సంప్రదాయపార్టీలు నేర్చుకోవలసిన అంశాలెన్నో ఉన్నాయి : లోక్‌సత్తా
## ప్రపంచవ్యాప్తంగా సానుకూల ప్రభావముంటుందన్న జేపీ




కొత్తరాజకీయానికి నాంది పలుకుతూ అమెరికా 44వ అధ్యక్షుడిగా పెద్దగా రాజకీయ అనుభవంలేని బరాక్ ఒబామా భారీ మెజారిటీతో ఎన్నికవటం అనేక కోణాల్లో చరిత్రాత్మకమైనదని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రపంచంలో కొత్త రాజకీయానికి ఇది నాంది పలుకుతోందన్నారు. వర్ణ, మత వివక్షలకు అతీతంగా రాజకీయాన్ని మలచటంతోపాటు ఎజెండా, ప్రచారసరళి, నిధుల సమీకరణలో ఒబామా అనుసరించిన తీరు ప్రశంసనీయమన్నారు. ఓ ప్రముఖ రాజకీయనేత కొడుకుగానో, అల్లుడుగానో రాజకీయాల్లోకి రాకుండా కేవలం ఎజెండా, కొత్త రాజకీయసంస్కృతి, వ్యక్తిత్వ బలంతో ఆయన విజయం సాధించారన్నారు. నిజానికి లోక్‌సత్తా ఎన్నాళ్ల నుండో ఈ సిద్ధాంతాలను చెబుతూవస్తోందన్నారు. ఈ విజయం ఈరోజు భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు స్ఫూర్తినివ్వాలని, ఇక్కడ కూడా అలాంటి మార్పు వెల్లువెత్తాలని జేపీ పేర్కొన్నారు. విరివిగా ఓటింగ్‌లో పాల్గొన్న అమెరికా యువత చూపిన ఉత్సాహాన్ని ఇక్కడి యువత కూడా అందిపుచ్చుకోవాలన్నారు. 'ఒకే దేశం–ఒకే ప్రజ–అందరి అభివృద్ధి' అని ఒబామా తన విజయంప్రసంగంలో ఇచ్చిన సందేశం మనందరికీ ఉత్తేజాన్నివ్వాలన్నారు. "రాజకీయమంటే వివక్ష లేకుండా ప్రతి బిడ్డా ఎదిగే సమాజాన్ని రూపొందించేదని, రాజకీయం అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాల చుట్టూ మాత్రమే తిరగాలని, బడా బాబుల నల్లధనాన్నికాకుండా పౌరుల నుంచే పార్టీ నిధుల్ని సమీకరించాలని, హుందాగా ప్రచారాన్ని నిర్వహించాలని, కుల,మత, ప్రాంత విద్వేషాలతో విభజించు–పాలించు అన్న సిద్ధాంతం కాకుండా ప్రజల్లో ఐకమత్యాన్ని పెంచి అందరినీ కలుపుకునిపోయేలా వ్యవహరించాలని' ఒబామా చాటిచెప్పారని జేపీ అన్నారు. ఓ పక్క ప్రపంచంలో అత్యాధునిక మార్పులు వస్తుంటే, ఇక్కడ మన రాజకీయపార్టీలు మాత్రం పాత రాజకీయపు వాసనలతోనే నడుస్తున్నాయని ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తపరిచారు. అట్టహాసంగా భారీసభల్ని ఏర్పాటుచేసి బీరు, బిర్యానీ, డబ్బులు పంచి లక్షలసంఖ్యలో ప్రజల్ని తరలించకుండా, ప్రజల వద్దకే వెళ్లి సమూహాలనుద్దేశించి ప్రసంగించటం ద్వారా జనరాజకీయాన్ని సాగించారన్నారు. ఇవన్నీ ఒబామా విజయం నుంచి ఇక్కడి సంప్రదాయ రాజకీయపార్టీలు నేర్చుకోవలసిన అంశాలని ఆయన స్పష్టంచేశారు. 'ఒబామా విజయం– కొత్త రాజకీయ సంస్కృతి'పై జయప్రకాష్ నారాయణ్ బుధవారం పార్టీ ప్రధానకార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

మరోవైపు, "ఈవేళ దాకా ఒబామా నా ప్రత్యర్థి, రేపట్నుంచి నా అధ్యక్షుడు. ఆయన ఆధ్వర్యంలో దేశాభివృద్ధికి పాటుపడతా" అని ఓటమి తర్వాత రిపబ్లికన్ అభ్యర్థి మెక్‌కెయిన్ అన్న మాటలు కూడా మనకు ఆదర్శప్రాయమన్నారు. రాజకీయాల్ని అధికారక్రీడగా, పోటీదారుల్ని శత్రువుల్లా చూసే సంస్కృతి నుంచి బైటపడాలన్నారు. ఓ ఎజెండా కోసం అన్ని పార్టీల సమన్వయంతో చేసే కృషిగా రాజకీయాన్ని చూడాలని జేపీ అన్నారు. "ఎన్నికలు పోటీ చేసే అభ్యర్థుల గురించి కాదు. రాజకీయ నాయకుల భవిష్యత్తుని గురించి కాదు. ఎన్నికలు, రాజకీయం ఓటు వేసే ప్రజల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అధికార క్రీడగా, ఆటగాళ్ల మార్పుగా నడుస్తున్న మనదేశ రాజకీయం అమెరికా ఎన్నికల ఫలితాల నుంచి స్ఫూర్తిని, ఉత్తేజాన్ని పొంది, రాజకీయ ప్రక్షాళనకు, నిజమైన మార్పుకి దారితీయాలి" అని జేపీ పిలుపునిచ్చారు.

యువత, మధ్యతరగతి ఎక్కువ ఉన్న భారత్‌పై ఒబామా గెలుపు ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. "కేవలం 27శాతం యువ ఓటర్లున్న అమెరికాలో యువతే నాయకత్వం తీసుకుని ఈ నిశ్శబ్ద విప్లవాన్ని సాధించారు. అలాంటిది మనదేశంలో యువ ఓటర్లు 50శాతం ఉన్నారు. అలాగే 35ఏళ్లు దాటిన మధ్యతరగతివారు మరో 15శాతం ఉన్నారు. వీరంతా నిజమైన మార్పు కావాలని కోరుకుంటున్నారుగానీ, అది మరెవరివల్లో వస్తుందని ఆశిస్తున్నారు. ఈ యువత, మధ్యతరగతి తల్చుకుంటే మార్పు వెనువెంటనే సాధ్యం" అని జేపీ అన్నారు. ఒబామా ఎవరో ప్రపంచానికి, చివరకు అమెరికన్లకూ తెలియని రోజుల నుంచి లోక్‌సత్తా ఉద్యమం, పార్టీ ఈ కొత్తరాజకీయ సంస్కృతిని, ఎజెండాను ఆచరిస్తూ వస్తోందని, ఒబామా విజయంతో కొత్త ఉత్సాహాన్ని సంతరించుకుని లోక్‌సత్తా గెలుపుబాటలో పయనిస్తుందని జయప్రకాష్ నారాయణ్ ఆత్మవిశ్వాసంతో పేర్కొన్నారు.

స్థాయి కృషి చేయాలంటే, అందుకు జీవితపు ఎత్తుపల్లాల్ని ప్రత్యక్షంగా ఎంతోకొంత చవిచూసి ఉండటం అవసరం. ఆ అనుభవాలు ఆహ్లాదకరమైన విద్యలా కాకుండా గాయాల్లా, చేదు గుళికల్లా ఒబామా జీవితంలో ఉన్నాయి. అలాంటి అనుభవాల నుంచి విద్వేషాన్ని, ఇతరుల పట్ల కసిని పెంచుకోవటం తేలిక. ఎంతో న్యాయమని అంతరాత్మకి, చుట్టూ ఉన్న ప్రపంచానికి కూడా అనిపించేలాగానే విభజన రాజకీయాలు చేసేయొచ్చు. ఇతరులకు నష్టం చేస్తూ కూడా పరిస్థితులు అనుకూలించినంత వరకూ ఎదగవచ్చు. కానీ బరాక్ అందుకు విరుద్ధంగా సానుకూలత, సయోధ్య, అందరి ప్రయోజనాల సమన్వయం చుట్టూ తనను నిర్వచించుకునే, తన జీవితాన్ని నిర్మించుకునే ప్రయత్నం చేశారు. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్నీ అలాగే మార్చాలనుకున్నారు. ఒక గాయం నుంచి బయటపడటంలోనే మనిషి నైపుణ్యం, స్థాయి నిర్ణయమవుతాయన్న తాత్వికవాక్కుకు ఒబామా జీవితం నిలువెత్తు నిదర్శనం.

ఒబామా అంతర్మథనం, అధ్యయనం, కాలేజీ రోజుల్లో రాజకీయ భావాలు వికసించటం, కొత్త రాజకీయంతో మార్పు తేవాలనే ప్రయత్నం, ఆయన ప్రసంగాల తీరు ఇవన్నీ చదువుతుంటే లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ జీవితమే గుర్తుకొస్తుంది. ఒబామా తరహాలో పెద్ద వివక్షల నేపథ్యం లేకపోయినా, సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచే వచ్చిన యువ జేపీ 1975లో ఎమర్జెన్సీ సమయంలో భారతదేశం ఎదుర్కొంటున్న దుష్పరిపాలనా సంక్షోభం, దమనకాండల పట్ల తీవ్రంగా కలత చెందారు. జాతీయోద్యమ నేతలు ఆశించినట్లు మన దేశంలో నిజమైన స్వాతంత్ర్యం రావాలని, అందరికీ ఎదిగే అవకాశాలు లభించాలని ఆరాటపడ్డారు. అందుకే ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ప్రారంభించిన ఉద్యమానికి సంపూర్ణ మద్దతుని ప్రకటించారు. తనలాంటి అనేకమంది యువకుల్లాగా.. ఇందిర గద్దె దిగితే చాలు, సమస్య పరిష్కారమవుతుందనుకున్నారు. ఇందిర పాలన తర్వాత 1977లో జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఎగిరి గంతేశారు. కానీ సరైన ఎజెండా లేకుండా వ్యక్తులు మారినంత మాత్రాన దేశంలో మార్పు రాదని తర్వాతి పరిణామాలతో అర్థం చేసుకున్నారు. మార్పు కోసం ప్రయత్నంలో భాగంగా డాక్టర్ నుంచి ఐఏఎస్ అయ్యారు. ఆ తర్వాత నూతన రాజకీయ ఉద్యమంగా లోక్‌సత్తాను ప్రారంభించారు. 2006లో లోక్‌సత్తాని ఓ రాజకీయ పార్టీగా కూడా విస్తరించారు.

ఒబామా దేశం అమెరికా కంటే చాలా సంక్లిష్టమైన, విస్తృత సంఖ్యలో జనాభా ఉన్న, వారిలోనూ పేదరికం, అవిద్య ఎక్కువగా ఉన్నవారున్న భారతదేశంలో ఒబామా కంటే ఎంతో స్పష్టతతో, అవగాహనతో విధానాల్ని రూపొందించి జేపీ వాటిని ప్రజల్లోకి, రాజకీయ నాయకుల్లోకి తీసుకెళ్లేందుకు ఎంతో కష్టపడ్డారు. రాజకీయ చర్చను ప్రభావితం చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తినివటంతోపాటు కాలపరీక్షకు నిలబడిన ఓ రాజకీయ రోడ్‌మ్యాప్‌ను భారత్‌కు అందుబాటులోకి తెచ్చారు. ఒక్క పార్లమెంటు సభ్యుడు కూడా లేకుండా గణనీయ విజయాలను సాధించారు. కానీ మన ప్రజాస్వామ్యం, వ్యక్తులు, రాజకీయ పార్టీల నిర్మాణం ఇలా రకరకాల కారణాల వల్ల ఒబామాలా జేపీ ఎన్నికల రాజకీయంలో విజయం సాధించలేకపోయారు.

అమెరికాలో ఓ ప్రధాన రాజకీయ పార్టీ ఒబామా ప్రతిభను ఓ ప్రసంగం తర్వాత గుర్తించి అలవోకగా ఉన్నత స్థానానికి ఎదిగే అవకాశాన్ని కల్పించగా, అమెరికన్లూ ఆదరించారు. మన దేశంలో అలాంటి బలాలు రూపుదిద్దుకోలేదు.

ఒబామా తన పుస్తకం ముందుమాటలో చెప్పినట్లు, ఆయన 8 ఏళ్ల కొత్త రాజకీయ పాలన తర్వాత ఆయన భావాలకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించే డొనాల్డ్ ట్రంప్ రిపబ్లికన్ పార్టీ తరపున అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. డబ్బు ప్రభావం విపరీతమైంది. అయితే, నిస్సందేహంగా ఎన్ని వైఫల్యాలున్నా ఒబామా అమెరికాను పటిష్టపరిచి ముందుకు నడిపించేందుకే ప్రయత్నించారు. తన కొత్త రాజకీయానికి కట్టుబడి, విద్వేషాలను చల్లారుస్తూ ఆరోగ్యం, విద్య, పర్యావరణం వంటి కీలక రంగాల్లో కృషి చేశారు. తుపాకుల సంస్కృతిని నియంత్రించేందుకు వీరోచిత ప్రయత్నం చేశారు. అందుకే ఎన్ని వైఫల్యాలున్నా, విధానపరమైన లోపాలున్నా, కొత్త రాజకీయంపై పలు సందర్భాల్లో రాజీ పడి పలుచన చేసినా.. అమెరికా గర్వించదగ్గ అధ్యక్షులలో ఒకరిగా ఒబామాను ఆ దేశంలో ఎక్కువమంది భావిస్తుంటారు, చరిత్రకారులు విశ్వసిస్తారు. ఒబామాయే చెప్పినట్లు, మార్పుకి ఒక ఎన్నిక, రెండు ఎన్నికలు చాలవు. ఎందుకంటే, అమెరికా రాజ్యాంగం ఎన్ని విలువల్ని, సమానత్వ భావాల్ని ప్రకటించి ఫ్రెంచి విప్లవం సహా అనేక ప్రపంచ పరిణామాలకు, రాజ్యాంగాలకు స్ఫూర్తినిచ్చినా, ఆచరణలో మాత్రం స్వదేశంలో తెల్లజాతీయులకు మొగ్గు చూపేలా ఉంది. ఎంతోమంది త్యాగాలు చేసి రక్తం చిందించాకే అమెరికాలో ప్రజాస్వామ్యం వికసిస్తూ వచ్చింది. ఆ పరంపరలో భాగంగా 21వ శతాబ్దంలో ఒబామా పాలన కొన్ని సానుకూల మార్పుల్ని సాధించింది. వీటిని కొనసాగిస్తూ మార్పుని మరింత బలోపేతం చేయాలి. అందుకు ప్రజాస్వామిక విలువలు జీవితంలో భాగంగా మార్చుకున్నవారు సమాజంలో ఎల్లెడలా రూపుదిద్దుకోవాలి.

ఈ తరంలో పాఠ్యాంశాలకి, పుస్తకాలకే పరిమితమైన ప్రజాస్వామికతను ఎటువంటి సంకోచాలు, కపటత్వం లేకుండా స్వభావసిద్ధంగా ఆచరించే అవకాశం కొత్త తరానికి ఎక్కువగా ఉంది. అందుకే తన కృషికి కొనసాగింపుని యువతరంలో ఒబామా ఎక్కువగా చూస్తున్నారు.

ప్రపంచం నలుమూలల్నుంచి వలసవచ్చిన భిన్నరకాల ప్రజలతో రూపుదిద్దుకొన్న దేశం అమెరికా. శక్తిమంతమైన మినీప్రపంచం అమెరికాలో ప్రజాస్వామ్యం ఎంత విజయవంతమైతే.. అనివార్యమైన ప్రపంచీకరణ మధ్య మానవజాతి మనుగడ కూడా అంత విజయవంతంగా కొనసాగే అవకాశం ఉంది.

ఇదే సమయంలో, అమెరికా సాఫల్య వైఫల్యాల నుంచి ఇతర ప్రపంచ దేశాల యువత కూడా పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది. ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం కాబోతున్న, అత్యధిక యువ జనాభా కలిగిన దేశమైన భారత్‌కు ఇది మరింత ముఖ్యం. తమ జీవితాల్ని, కుటుంబాల్ని చూసుకుంటూ సానుకూల దృక్పథంతో చుట్టూ ఉన్న సమాజం కోసం కొంత సమయాన్ని కేటాయించే సామాజిక నాయకులుగా మన యువతీయువకులు ఎదగటం అవసరం. కొవిడ్ కాలంలో, ముఖ్యంగా రెండోదశలో పెద్దసంఖ్యలో యువత సమాజానికి తమ వంతు సాయం అందించేందుకు ఎంతో చిత్తశుద్ధితో ముందుకొచ్చారు. తమ శక్తికి మించి సాటివారికి వైద్యం, ఆహార సరఫరా వంటి సహాయాల్ని అందించారు. అద్భుత మానవీయతను ప్రదర్శించారు. కానీ ఈ పరిస్థితికి మూలాలు ఎక్కడున్నాయో గుర్తించకుండా కేవలం సాయానికి పరిమితమైతే పెద్ద ప్రయోజనం ఉండదు. సరైన పాలన, రాజకీయానికి వ్యక్తుల దాతృత్వం ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు. రాజ్య వ్యవస్థ తాను చేయాల్సిన ప్రజారోగ్యాన్ని సవ్యంగా అందించి ఉంటే, ఇతర చర్యల్ని ప్రభుత్వ యంత్రాంగం ఏకవ్యక్తి నిర్ణయాల చుట్టూ నిర్లక్ష్యం చేయకుండా ఉంటే ఈ పరిస్థితి చోటు చేసుకునేది కాదు. అందుకే వ్యక్తిగత దాతృత్వాన్ని వీలైనంత మేర కొనసాగిస్తూనే, రాజ్య వ్యవస్థ చేత పనుల్ని సక్రమంగా చేయించేందుకు యువత సామాజిక నాయకులుగా ఎదగాలి.

స్వావలంబన, ప్రజాస్వామిక దృక్పథం, సానుకూలత, సంఘటితత్వం, సామాజిక నాయకత్వానికి చొరవ ఉన్న యువత ఎంత ఎక్కువమంది ఉంటే భారతదేశ సుస్థిరాభివృద్ధికి అంత గ్యారంటీ. ఇందుకు విలువైన తోడ్పాటుని అందిస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరూ ఒబామా పుస్తకం 'ఎ ప్రామిస్డ్ ల్యాండ్'ను చదవాలి. నివారించదగ్గ బాధలను తొలగించటానికి, వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలను అందించటానికి కావలసిన వ్యవస్థీకృత మార్పుల్ని పార్టీలపరంగానో, పార్టీలకతీతంగానో సాధించుకోవాలి.

# వ్యాక్సిన్లపై ప్రణాళికాబద్ధమైన చేతలు కావాలి




కొవిడ్ వ్యాక్సిన్లు మే నెలాఖరు నాటికి సుమారు 21.5 కోట్ల డోసులు మన దేశ ప్రజలకు అందాయి. ఇటీవల ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ భార్గవ మాట్లాడుతూ జులై మాసం నుంచి కోటి డోసులు రోజుకు వస్తాయన్నారు. కోటి వస్తే సంతోషమేగానీ, దాని మీద ఆశపడకూడదు. ఇప్పుడు రోజుకు 25 లక్షల వ్యాక్సిన్లను చేస్తున్నాం. అంటే జూన్, జులై నెలల్లో మనం 15 కోట్లు చేయవచ్చు. మొత్తంగా జులై మాసం వరకూ 36 కోట్లు అవుతాయి. ఆ తరువాత నాలుగు నెలల్లో ఆయన కోటి అంటున్నారు గానీ.. నేను ఆచరణసాధ్యంగా 75 లక్షలు చేయాలంటున్నాను. రోజుకు 75 లక్షలు చేస్తే మరొక 90 కోట్లు మనం నవంబర్ మాసానికి చేయగలం. అప్పటికే ఉన్న 36 కోట్లతో కలిపి మొత్తం 126 కోట్లు అవుతాయి. అంటే.. 18 ఏళ్లు దాటిన జనాభాలో దాదాపు 80 శాతం మందికి వ్యాక్సిన్ ఇచ్చినట్లు లెక్క. అక్కడితో చాలామట్టుకు ఒడ్డున పడతాం. మనం అయోమయంగా, లబోదిబోమనకుండా ఒక ప్రణాళికాబద్ధంగా వెళ్లాలి. మన సమాజాన్ని రక్షించుకోవాలంటే మనం అంకెలు అర్థం చేసుకోవాలి, సైన్స్ అర్థం చేసుకోవాలి. మనకున్న వనరులతో గొంతెమ్మ కోర్కెలు కోరటం వల్ల లాభం ఉండదు. ఇవాళ రోజుకి 25 లక్షల డోసులు ఉత్పత్తి అవుతుంటే, హడావుడిగా కోటి డోసులు తెండి అంటే.. మాటతో, మంత్రంతో వచ్చేవి కాదు గదా! ఇంకో రెండు నెలల్లో రోజుకు 75 లక్షలు సాధించగలం. దానికోసం ఏమన్నా అడ్డంకులుంటే తొలగించాలి. ఇంతవరకూ చేస్తే నవంబర్ ముగిసే సరికి దీన్నుంచి మనం పూర్తిగా బయటపడటానికి మార్గం సుగమం అవుతుంది. ఆ తర్వాత 2 నెలల్లో మిగతావారికి, 18 ఏళ్ల లోపలివారికి, కనీసం 13 ఏళ్లు దాటిన వారికి ఇవ్వటం కష్టం కాదు. కానీ ఒక్కసారి ఈ వ్యాక్సిన్ల ఉత్పత్తి పెరిగాక ఆగదు. ఒక్కరోజే పెరగదు.. కానీ పెరిగిన తర్వాత కొనసాగుతుంది. ప్రపంచ మార్కెట్లో, మన దేశంలో కూడా వ్యాక్సిన్లకు అవసరముంది కాబట్టి ఈ రీతిన ఉత్పత్తిని పెంచుతూ వెళ్లాలి. దీనిలో ఏ రకంగా అడ్డంకులు లేకుండా మనం సర్వశక్తుల్నీ ఉపయోగించాలి. అక్కడ పరిపాలనా యంత్రాంగం చేయాల్సిన పనులు చిన్నవే అయినా కూడా చాలా ముఖ్యమైనవి ఉన్నాయి. అంతా వ్యాక్సిన్ల ఉత్పత్తి మీద దృష్టి పెడుతున్నాం, దేశమంతా అదే మాట్లాడుతోంది. నాలాంటి వాళ్లం సంవత్సరం క్రితమే మాట్లాడాం గానీ, ఇప్పుడు దేశంలో అందరికీ అర్థమైంది. మనం టీకాలను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేశాక, ఇంతమందికీ కోల్డ్ స్టోరేజీ పెట్టి అందించే శక్తి మనకుందా? మన దేశంలో ఏడాదికి దాదాపుగా 4-5 కోట్ల డోసుల వ్యాక్సిన్లు ఇస్తాం. ఈవేళ ఒక్కసారిగా 100-150 కోట్ల డోసులంటున్నాం. 20-30 రెట్లు ఎక్కువ. అంత మొత్తానికీ కోల్డ్ స్టోరేజీ, లాజిస్టిక్స్ ఒక్కరోజులో రావు. అంతా అయ్యాక అయ్యోఅయ్యో అనుకుని కంగారు పడితే లాభం లేదు. ఇప్పుడే ఏర్పాట్లు చేసుకోవాలి. రేపొద్దున 75 లక్షల డోసులు వచ్చినట్లయితే, 75 లక్షలకీ కోల్డ్ స్టోరేజీ కావచ్చు, కోల్డ్ చెయిన్ కావచ్చు, వ్యాక్సిన్ కేంద్రాలను పెంచటం కావచ్చు, డాక్టర్లు, నర్సులు అంత పెద్ద సంఖ్యలో లేరు కాబట్టి శిక్షణనిచ్చి ఆరోగ్య కార్యకర్తలను సిద్ధం చేయటం కావచ్చు, రియక్షన్లు వంటివి వస్తే ప్రమాదం లేకుండా దానికోసం ప్రొటోకాల్స్ ఏర్పాటు చేయటం కావచ్చు.. వీటన్నిటికీ పరిపాలనా యంత్రాంగం క్రమపద్ధతిలో పూనుకోవాలి. మనమేం చేస్తున్నాం- ఒక తుపాను వచ్చాక లేస్తున్నాం, దాహమేస్తే బావి తవ్వడం మొదలెడుతున్నాం. అది కాదు, ముందస్తుగా ఒక క్రమపద్ధతిలో ఆలోచించాలి. అదే విధంగా మాటలు ఎక్కువయ్యాయి ఈ దేశంలో. ప్రణాళికాబద్ధమైన చేతలు కావాలి.



- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th June, 2021 Posting Date 15 &16th of every month

# సమగ్ర ఆరోగ్య వ్యవస్థ విధానం తయారీ కృషిలోనే రాత్రింబవళ్లూ: జేపీ





ప్రజారోగ్యంలో గత పాపాల నీడ మనల్ని వెన్నాడుతోంది. కరోనా వల్ల అకస్మాత్తుగా మన ఆరోగ్య వ్యవస్థ నాశనం కాలేదు. అంతకుముందు కూడా నాశనమవుతూనే వస్తోంది. మన దేశంలో రోజూ 2,000 మంది శిశువులు నివారించదగ్గ మరణాలకు గురవుతున్నారు. వైద్య ఖర్చులు భరించలేక రోజుకి లక్షన్నర మంది పేదరికంలోకి జారిపోతున్నారు. ఇంతకంటే విషాదం ఉంటుందా? ఇది ఒక్కరోజు వచ్చింది కాదు. గత 70 ఏళ్లుగా కొనసాగుతోంది. అది గుర్తించాలి. ఇప్పటిదాకా మన రాజకీయం తాత్కాలిక తాయిలాలు, పందేరాలు, కులం, మతం పేరుతో ప్రజలను చీల్చి ఓట్లు దండుకోవటం తప్ప.. ఆరోగ్యం, విద్యలను అందించటం మీద దృష్టి పెట్టలేదు. ఆరోగ్యంలో ఓట్లున్నాయని మొదటగా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తించారు. ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారు. అది మంచిదే గానీ చాలా పరిమితమైనదని ఆరోజే చెప్పాను. ఇప్పుడూ చెబుతున్నాను. ఆరోగ్యంపై తెలుగునాట మొదలైన ఆ ప్రయత్నం అక్కడితోనే ఆగిపోయింది. ఈవేళ భారతదేశంలో ప్రతి ఒక్కరినీ కరోనా విషాదం ఏదోకరకంగా చుట్టుముట్టి ఉంది. ఇంత నష్టం జరిగాకైనా మనం గుణపాఠం నేర్చుకోవాలి. మన ప్రజారోగ్యాన్ని బాగుచేసుకోవటానికి ఈ సంక్షోభాన్ని అవకాశంగా మలచుకోవాలి. మన దేశానికి ఒక సమగ్రమైన ఆరోగ్య వ్యవస్థను తయారుచేస్తున్నాను. రాత్రింబవళ్లూ ప్రస్తుతం దాని మీదే కూర్చుంటున్నాను. నేను కనీసం 25 ఏళ్ల నుంచి దీని కోసం పోరాడుతున్నాను. జాతీయ ఆరోగ్య పథకం నా ఒత్తిడి మీదే జాతీయస్థాయిలో వచ్చింది. కానీ చాలా కొద్ది. జరగాల్సినదానితో పోలిస్తే చాలా కొద్ది. గుడ్డిలో మెల్ల అని ఏదో ఒకటి జరిగితే బాగుండునని దాని కోసం ప్రయత్నం చేసి సాధించాం. కానీ సమగ్రమైన ఆరోగ్యం అందరికీ అందాలంటే ఏడాదికి సుమారుగా లక్ష కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు పెట్టాలి. ఇది పెద్ద డబ్బు కాదు. భారతదేశం ఆరోగ్యం కోసం ప్రపంచంలో అతి తక్కువ ఖర్చు పెడుతోంది. కేవలం 1% కాస్త అటూఇటుగా ఖర్చు పెడుతున్నాం. దాన్లో కూడా అత్యధికశాతం రాష్ట్రాలు ఖర్చు పెడుతున్నాయి. సుమారు 25 -30 శాతం మాత్రమే జాతీయ ఆదాయం నుంచి ఖర్చు పెడుతున్నారు. చాలా తక్కువ. కనీసం జాతీయ ఆదాయం నుంచి ఖర్చును 2 శాతానికి పెంచాలి. 3 శాతం అని బీరాలు పలుకుతున్నారు. కనీసం ఓ అర్ధశాతం సరైన రీతిలో పెంచండి. అంటే ఓ 90,000-1,00,000 కోట్లు. వెంటనే ఒక్కరోజులో పెంచలేం. దానికో ప్రణాళికాబద్ధత కావాలి. ప్రాథమిక స్థాయిలో ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన డాక్టర్‌ను ఎంచుకునే అవకాశంతో చిన్న పట్టణంలో, 5-10 కిలోమీటర్ల దూరంలో వైద్య సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఆ ఖర్చంతా ప్రభుత్వమే భరించాలి. దానికి సమగ్ర ప్రణాళిక తయారుచేశాం. అందుకు కావలసిన డాక్టర్లున్నారు, వనరులున్నాయి, అన్నీ ఉన్నాయి. అంగట్లో అన్నీ ఉన్నాయి. బుద్ధి ఉండాలి, జ్ఞానం ఉండాలి, వివేకముండాలి, ప్రజలంటే మమకారం ఉండాలి, దీర్ఘకాలిక దృక్పథం ఉండాలి. అంతకుమించి మనకు లేనిదేమీ లేదు. అలాగే ఆరోగ్యశ్రీకి కొద్దిగా మార్పులుచేర్పులు చేస్తే ఒకస్థాయిలో సరిపోతుంది దేశవ్యాప్తంగా. ఇక తృతీయ స్థాయిలో. గాంధీ, ఉస్మానియా, జిల్లా ఆస్పత్రులు వంటి వాటిల్లో డాక్టర్లది తప్పు కాదు. అక్కడ రద్దీ ఎక్కువ, మౌలిక వసతులు తక్కువ. పెట్టే ఖర్చు చాలా తక్కువ. అక్కడ తగిన ఏర్పాట్లు చేయాలి. ఈ మొత్తానికీ లక్ష కోట్లు ఖర్చవుతాయి. అది చేస్తే ఏటా 5 కోట్ల మంది పేదలవటం పోతుంది, 2,000 మంది శిశువుల అకాల మరణాలు పోతాయి, కోట్లాదిమంది నివారించదగ్గ వ్యాధుల బారిన పడటం పోతుంది, నివారించదగ్గ మరణాలు పోతాయి. అంతవరకు చేస్తే మనం పరిస్థితులను బట్టి ఇంకా పెంచుకుందాం. మనం ఆచరణ సాధ్యంగా అతి తక్కువ వనరులతో, అతి ఎక్కువ ఫలితాల్ని సామాన్య ప్రజలకు అందించాలి. అదీ పరిపాలన అంటే. ఈ సమగ్ర ఆరోగ్య వ్యవస్థ విధానం అమలు కోసం రాజకీయం, మీడియా, జనం అందరూ కదలాలి.

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**